thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 236 కరీంనగర్ ఆదివారం, 3 నవంబర్, 2024 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 'కామ్ కీ బాత్'పై మాట్లాడరేం?

శ్రీనగర్ : ప్రధాని మోదీ 'మనసులోని మాటల'ను చెబుతున్నారే తప్ప ఉద్యోగాలు, ఉపాధి కల్పనకు సంబంధించిన 'పనుల మాటల'ను మాట్లాడడం లేదని విపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. శ్రీనగర్‌లో జరిగిన సభలో ప్రసంగిస్తూ మోదీ 'మన్ కీ బాత్'కే పరిమితమయ్యారే తప్ప 'కామ్ కీ బాత్'ను పట్టించుకోవడం లేదని అన్నారు. ధరల పెరుగుదలను ప్రస్తావించడం లేదని చెప్పారు. దేశ రాజకీయ పరిస్థితులను ప్రస్తావిస్తూ... మోదీ ముఖకవళికల్లో మార్పులు వచ్చాయని అన్నారు.

"గత లోక్‌సభ ఎన్నికల్లో '56 అంగుళాల ఛాతీ' గురించి మీరు వినేవారు. ఆ మాటలు ఇప్పుడు వినబడుతున్నాయా? ఆయన ముఖ కవలిళికలు, మూడ్ మారాయి. మోదీ మనస్తత్వాన్ని కాంగ్రెస్, ఇండియా కూటములు కలిసి మార్చేశాయి" అని వ్యాఖ్యానించారు.



# సంక్షోభంలోకి హైదరాబాద్.?

# 'హైడ్రా' దెబ్బ!

## పూర్తిస్థాయిలో పడిపోయిన రియల్ ఎస్టేట్!

## నిలిచిపోయిన ఇళ్ళు, స్థలాల కొనుగోళ్ళు!!

హైదరాబాద్ : ఏడాది క్రితం వరకు హైదరాబాద్‌అంటే చాలు అంత అబ్బా అనుకునేవారు..సామాన్య ప్రజల దగ్గరి నుడి కోటీశ్వర్ల వరకు అందరి చూపు హైదరాబాద్ పైనే ఉండేది. హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టాలని బిజినెస్ వర్గాలు భావిస్తే..సామాన్య , మధ్యతరగతి వారు నగరంలో ఓ చిన్నపాటి ఇల్లు కట్టుకోవాలని భవిస్తూ వచ్చారు. కానీ ఇప్పుడు హైదరాబాద్ అంటేనే భయపడుతున్నారు. ఏడాది కాలంగా హైదరాబాద్ నగర కళ తప్పింది. కొత్త పరిశ్రమలు రావడం లేదు..ఉన్న పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నాయి. రియల్ ఎస్టేట్ భారీగా పడిపోయింది. కొత్తగా ఇల్లు కొనాలనుకునేవారు ఆసక్తి చూపించడం లేదు. హైదరాబాద్‌లో ఈ జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఇళ్ల అమ్మకాలు 12,082 యూనిట్లుగా ఉండొచ్చని ప్రాప్‌ఈక్విటీ చెప్తున్నది. గత ఏడాది ఇదే వ్యవధిలో 20,658 యూనిట్ల విక్రయాలు జరిగాయన్నది. దీంతో తాజా సర్వేలో అన్ని నగరాల కంటే హైదరాబాద్‌లోనే అత్యంత క్షీణత నమోదవుతున్నది. గత ఏడాదిదాకా దేశంలోనే అత్యంత ఎక్కువగా ఇండ్ల అమ్మకాలు ఇక్కడ జరిగిన విషయం తెలిసిందే.

ముంబై, బెంగళూరు వంటి నగరాలనూ దాటుకొని గడిచిన పదేండ్లలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం దూసుకుపోయింది. కానీ ఇప్పుడు సీన్ రివర్సైంది. దీనికి కారణం అనేకం ఉన్నాయి. ప్రభుత్వం మారడం, అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు , నగర వ్యాప్తమగు అభివృద్ధి తగ్గడం , క్రైమ్ రేట్ పెరుగుతుండడం ఇలా అనేక కారణాలు ఉన్నాయని చెప్పొచ్చు. ఇదే విషయాన్నీ మాజీ మంత్రి , బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ ప్రస్తావించారు. అభివృద్ధి చెందుతున్న మహానగరం సంక్షోభంలోకి వెళ్తుందనడానికి ఈ నివేదికనే నిదర్శనం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విధ్వంసక పరిపాలన చేస్తున్నారని విమర్శించారు. ఆర్ఆర్ ట్యాక్స్, కూల్చివేతల కారణంగా రియల్ ఎస్టేట్ రంగం దారుణంగా పడిపోయిందన్నారు. హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపకపోవడంతో.. హైదరాబాద్ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన ఈ మహా నగరం ఈరోజు గందరగోళ పరిస్థితుల్లో కూరుకుపోయిందంటూ కేటీఆర్ మండిపడ్డారు. కేటీఆర్ అన్నారని కాదు కానీ నగర ప్రజలు కూడా ఇలాగే మాట్లాడుకుంటున్నారు. ముఖ్యంగా హైడ్రా వల్ల ప్రభుత్వానికి మంచి కంటే చెడు ఎక్కువగా జరుగుతుంది. అక్రమ ఇల్లు కూల్చడం తప్పు కాదు..కానీ కాస్త సమయం ఇస్తే బాగుంటుందని అంటున్నారు. అలాగే రాజకీయ నేతలకు ఓ న్యాయం..సామాన్య ప్రజలకు ఓ న్యాయం అంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

సీఎం సోదరులకు నెల టైం ఇచ్చి..సామాన్య ప్రజలకు కనీసం సామాన్లు తీసుకునే సమయం కూడా ఇవ్వక పోతే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికి హైదరాబాద్ అంటే ఇప్పుడు వామ్మో అనుకునే స్థాయికి వచ్చిందని చెపుతున్నారు.

# రుణమాఫీ కాని రైతులందరికి త్వరలోనే రుణమాఫీ

హైదరాబాద్ : రూ.2 లక్షలు రుణమాఫీ కాని రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు గుడ్ న్యూస్ చెప్పారు. అర్హులు అయ్యి ఉండే ఇప్పటి వరకు రుణమాఫీ కాని రైతులందరికి త్వరలోనే రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి ఆందోళనకు గురికావొద్దని.. ధైర్యంగా వ్యవసాయం చేయండి మీకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని రైతాంగానికి భరోసానిచ్చారు. నా తల తాకట్టు పెట్టి అయిన రైతాంగానికి తోడుగా ఉంటానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారని.. సీఎం మాట ఇచ్చిన విధంగానే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయిన రుణమాఫీ చేశామని గుర్తు చేశారు. తుమ్మల మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ పండించని విధంగా తెలం గాణ రైతులు పంటలు పండిస్తున్నారని కొనియాడారు.

రైతాంగం మీద మీకు ప్రేమ ఉంటే అభినందించకున్నా సరే.. కానీ కాళ్లలో కట్టే పెట్టే విధంగా వ్యవహరించకండిని ప్రతిపక్షాలను కోరారు. మోసం చేసే పార్టీలను కాదని ప్రజలు కాంగ్రెస్‌ను విశ్వసించారని అన్నారు. రుణమాఫీ, రైతు బంధు ఎగ్గొట్టిన పార్టీలు నేడు దగా చేస్తున్నాయని.. వాటిని రైతులు ఎవరూ పట్టించుకోవద్దని సూచించారు. సిద్ధిపేట ఆయిల్ ఫామ్




ప్యాక్టరీ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ఆర్టికల్చర్, ఆయిల్ ఫామ్ సాగులో దేశంలోనే సిద్ధిపేట జిల్లా మొదటి స్థానంలో నిలవాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు. దేశానికి కావాల్సిన పామ్ ఆయిల్‌ని తెలంగాణ రాష్ట్రం ఇస్తుందని నేను కేంద్రానికి చెప్పానని పేర్కొన్నారు.



## దెబ్బతిన్న వ్యవస్థలను పునరుద్ధరించాలి: వీసీలతో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను సమూలంగా ప్రక్షాళన చేసి.. దెబ్బతిన్న వ్యవస్థలను పునరుద్ధరించాలని కొత్త వైస్‌ఛాన్సలర్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. కొత్తగా నియమితులైన ఉపకులపతులు సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కొంతకాలంగా యూనివర్సిటీలపై నమ్మకం తగ్గుతోందని, మళ్లీ విశ్వాసం పెంచేలా పనిచేయాలన్నారు. వ్యవస్థల పునరుద్ధరణకు ఏం చేయాలో అధ్యయనం చేయాలని ఉపకులపతులకు సీఎం సూచించారు. యూనివర్సిటీల్లో ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర అధ్యయనం కోసం అవసరమైతే కన్సల్టెన్సీలను నియమించుకొని నివేదిక తయారు చేసుకోవాలన్నారు. ఒత్తిళ్ల ప్రభావంతో వీసీలను నియమించలేదని.. ప్రతిభ, సామాజిక సమీకరణలనే పరిగణనలోకి తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. వీసీలు బాగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని.. తప్పులు చేస్తే ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. మంచి పని చేయడానికి వైస్ ఛాన్సలర్లకి స్వేచ్ఛ.. ప్రభుత్వ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. గతంలో వీసీలను విద్యార్థులు ఏళ్ల తరబడి గుర్తు పెట్టుకునే వారని.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని సీఎం వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయాల్లో డ్రగ్స్, గంజాయి విక్రయాలపై దృష్టి పెట్టాలని.. విద్యార్థులను గమనిస్తూ అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని రేవంత్ రెడ్డి సూచించారు.





# 'ప్రియమైన మోదీ జీ'..

# మా జనాలంతా సంతోషంగానే ఉన్నారు

## తెలంగాణ రాష్ట్రంపై కేంద్రం చేసిన వ్యాఖ్యలకు ధీటైన సమాధానం ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 2: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఎక్స్ వేదికగా స్పందించిన సీఎం.. తెలంగాణ రాష్ట్రంపై కేంద్రం చేసిన వ్యాఖ్యలపై ధీటైన సమాధానం ఇచ్చారు. కేంద్రం చేసిన అవాస్తవాలపై స్పష్టత ఇస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు.

కాంగ్రెస్ హయాంలో చీకట్లను తరిమేసి వెలుగులు నింపామని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, రుణమాఫీ, తక్కువ ధరకే గ్యాస్ సిలిండర్ ఇలా తదితర అంశాలను వివరిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు సీఎం. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఆనందం వెల్లువిరుస్తోందన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే రెండు వాగ్దానాలను నెరవేర్చామని.. 11 నెలల్లోనే దాదాపు 50వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పించామని సీఎం రేవంత్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

**సీఎం రేవంత్ పోస్టు ఇదే..** "ప్రియమైన నరేంద్ర మోదీ జీ. నా రాష్ట్రం, నా ప్రభుత్వం గురించి మీరు చేసిన ప్రకటనలలో అనేక అపోహలు, అవాస్తవాలపై స్పష్టత ఇవ్వడానికి నేను సంతోషిస్తున్నాను. డిసెంబర్ 7, 2023 నుంచి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి రాష్ట్రంలో ఆనందం ఆశలు వెల్లువెత్తాయి. దశాబ్దం బీఆర్ఎస్ దుష్పరిపాలన పోయి ప్రజల్లో సంతోషం వెల్లివిరిసిందన్నారు. బాధ్యతలు స్వీకరించిన రెండు రోజుల్లోనే, తెలంగాణ ప్రభుత్వం మొదటి, రెండవ వాగ్దానాన్ని నెరవేర్చింది. అన్ని టీజీఎస్ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద 10 లక్షల ఆరోగ్య సంరక్షణ, ఆసుపత్రి కవరేజీని విడుదల చేసింది. గత 11 నెలల్లో తెలంగాణాలోని సోదరీమణులు, తల్లులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా ప్రయాణించారు. రాష్ట్రవ్యాప్తంగా 101 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారు. ఒక సంవత్సరంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం 3,433.36 కోట్లు ఖర్చు చేశాం. మా మొదటి సంవత్సరం పూర్తి కాకముందే, మేము రైతులకి భరోసా ఇస్తూ రైతు రుణమాఫీని అమలు చేశాం. 22 లక్షల 22 వేల మంది రైతులు (22,22,365) ఇప్పుడు ఎలాంటి రుణం లేకుండా, రాజులా జీవిస్తున్నారు. రూ. 2,00,000 వరకు రైతుల రుణాలన్నీ మాఫీ చేయబడ్డాయి. 25 రోజుల్లో 18 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశాం" అని సీఎం చెప్పుకొచ్చారు. " ఇళ్లకు 200 యూనిట్ల వరకు గృహ విద్యుత్ ఛార్జీ లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. దీంతో మహిళలు మమ్మల్ని ఆశీర్వదిస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎక్కువగా ఉంటే, కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో కేవలం రూ.500 కే సిలిండర్ లభిస్తుండడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మా హయాంలో ఇప్పటివరకు 1.31 కోట్లకు పైగా గ్యాస్ సిలిండర్ రీఫిల్‌లు జరిగాయి. 42,90,246 మంది లబ్ధిపొంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. యువత కోసం ఉద్యోగ నియామకాలను చేపట్టాం. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించింది. అన్ని స్థాయిల పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. గ్రూప్ 1, 2, 3, 4 పరీక్షలను 11 నెలల కంటే తక్కువ సమయంలో నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వం 50,000 మంది అర్హులైన యువతకు ఉద్యోగాలు కల్పించింది. ఇది ఏ బీజేపీ రాష్ట్ర ప్రభుత్వం చేయని రికార్డు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ద కాలంగా పాఠశాల విద్యార్థులను విస్మరించింది. దశాబ్దం తర్వాత సంక్షేమ హాస్టళ్లలో పేద పిల్లలకు మెస్, కాస్మోటిక్ చార్జీలను 40 శాతానికి పైగా పెంచాం. గతంలో నిర్లక్ష్యానికి గురైన మూసీ నదిని శుభ్రం చేసి పునర్వైభవం తీసుకొస్తున్నాం. గత 10 ఏళ్లలో ఆక్రమణలకు గురై, ధ్వంసం చేసిన మా సరస్సులు, నాలాలు విలువైన నీటి వనరులను కూడా మేము పరిరక్షిస్తున్నాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్క అంగుళం సరస్సు కూడా ఆక్రమణకు గురికాలేదు. అలాగే మేము ఫ్యూచర్ సిటీని రూపొందిస్తున్నాం.

మాస్టర్‌ప్లాన్ ఖరారు చేయబడుతోంది. మేము యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ, YI స్పోర్ట్స్ యూనివర్శిటీ, YI ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల కోసం బాల్ రోలింగ్‌ను సెట్ చేశాం. గత 11 నెలల్లో మేము తెలంగాణలో చీకట్లను పారద్రోలి వెలుగులను నింపాం" అని రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్టు చేశారు.




హైదరాబాద్: ప్రధాని మోదీ విమర్శలకు 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి సమాధానమిచ్చారు. "అధికారంలోకి వచ్చిన 2 రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల సదుపాయాన్ని అమల్లోకి తీసుకొచ్చాం. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలకు రూ.3433 కోట్లు ఆదా అయింది. ఏడాది కాకముందే దేశంలోనే అతిపెద్ద రుణమాఫీ అమలు చేశాం. 22 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం. ఇందులో భాగంగా కేవలం 25 రోజుల్లోనే రూ.18 వేల కోట్లు జమ చేశాం. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాం. భాజపా పాలిత రాష్ట్రాల్లో గ్యాస్ ధరలు అధికంగా ఉన్నాయి. తెలంగాణలో రూ.500కే సిలిండర్ ఇస్తున్నాం. ఇప్పటివరకు 43 లక్షల మందికి సిలిండర్ పథకం ద్వారా లబ్ధి చేకూరింది. అధిక సంఖ్యలో ఉద్యోగ నియామకాలు చేపడుతున్నాం. గ్రూప్స్ పరీక్షలను రెగ్యులర్‌గా నిర్వహిస్తున్నాం. 11 నెలల్లోనే 50 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు చేపట్టాం. నియామకాల్లో ఏ భాజపా పాలిత రాష్ట్రంతో పోల్చినా మాదే రికార్డు. హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మోటిక్ ఛార్జీలను 40 శాతానికి పైగా పెంచాం. మూసీ పునరుజ్జీవానికి నడుం బిగించాం. కబ్జాకు గురైన నీటి వనరులను సంరక్షిస్తున్నాం.

ఫ్యూచర్ సిటీ కోసం మాస్టర్ ప్లాన్ ఖరారు చేస్తున్నాం. స్కిల్ వర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానంపై పవిత్రమైన నిబద్ధతతో ఉన్నాం." అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

**అసలేం జరిగిందంటే..** ఆర్థికంగా ఆచరణ సాధ్యమైన హామీలు మాత్రమే ఇవ్వాలని తమ పార్టీ నాయకులకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించిన నేపథ్యంలో ప్రధాని మోదీ తనదైన శైలిలో స్పందించారు. బూటకపు హామీలతో కాంగ్రెస్ చాలాచోట్ల ప్రజల ముందు దోషిగా నిలబడిందని, అందుకే వాస్తవాలను ఆ పార్టీ ఇపుడిపుడే గ్రహిస్తోందని శుక్రవారం ప్రధాని వరుస ట్వీట్లతో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణల్లో అభివృద్ధి కుంటుపడి, ఆర్థిక పరిస్థితి దిగజారిందని ప్రధాని విమర్శించారు. అంతర్గత రాజకీయాలు, దోపిడీలో బిజీగా ఉన్న కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే అమలులో ఉన్న పథకాలను సైతం ఉపసంహరించుకొంటున్నట్లు ఆరోపించారు. హిమాచల్ ప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదని, తెలంగాణలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన రుణమాఫీ అమలు కోసం రైతులు ఎదురుచూస్తున్నారని మోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఉత్తుత్తి హామీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని కోరారు. ఈ విమర్శల నేపథ్యంలో శనివారం తాజాగా రేవంత్‌రెడ్డి సమాధానమిచ్చారు.

## యూనివర్సిటీల గౌరవాన్ని పెంచాలి.. వైస్ ఛాన్స్‌లర్లకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు



హైదరాబాద్: యూనివర్సిటీలపైన నమ్మకం కలిగించేలా పని చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డితో యూనివర్సిటీల నూతన వైస్ ఛాన్సలర్లు, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి తెలంగాణ సచివాలయంలో ఇవాళ(శనివారం) భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్లకు సీఎం రేవంత్ దిశానిర్దేశం చేశారు. కొంత కాలంగా యూనివర్సిటీలపైన నమ్మకం తగ్గుతోందని...యూనివర్సిటీల గౌరవాన్ని పెంచాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. యూనివర్సిటీల్లో వ్యవస్థలు దెబ్బతిన్నాయని చెప్పారు. వ్యవస్థల పునరుద్ధరణకు ఏం చేయాలో అధ్యయనం చేయాలని సూచించారు. యూనివర్సిటీ ప్రస్తుత పరిస్థితి పైన సమగ్ర అధ్యయనం చేసి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైతే కన్సల్టెన్సీలను ఏర్పాటు చేసుకుని నివేదిక తయారు చేసుకోవాలని కోరారు. వైస్ ఛాన్స్‌లర్లకు ఎవరి ప్రభావితంతో పోస్టులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. మెరిట్, సామాజిక సమీకరణాల ఆధారంగా వైస్ ఛాన్స్‌లర్లను ఎంపిక చేశామని గుర్తుచేశారు. బాగా పని చేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తప్పు జరిగితే ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మంచిగా పని చేయడానికి వైస్ ఛాన్స్‌లర్లకు స్వేచ్ఛ ఉంటుందని... ప్రభుత్వ సహకారం ఉంటుందని మాటిచ్చారు. యూనివర్సిటీలను వందశాతం ప్రక్షాళన చేయాలని అన్నారు.

గతంలో యూనివర్సిటీల వైస్ ఛాన్స్‌లర్లను విద్యార్థులు ఏళ్ల తరబడి గుర్తు పెట్టుకునేవారని..ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెప్పారు. యూనివర్సిటీల్లో డ్రగ్స్, గంజాయి విక్రయాలపైనా దృష్టి సారించాలని అన్నారు. విద్యార్థులపై గమనించి కౌన్సెలింగ్ ఇవ్వాలని వైస్ ఛాన్స్‌లర్లకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

**ఉపాధి హామీ పనులపై మంత్రి సీతక్క సమీక్ష :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై డీఆర్డీవోలతో సచివాలయంలో మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చే ఐదు మాసాల్లో చేయాల్సిన పనులపై సమీక్షించారు. నిర్దేశించుకున్న గడువు లోపు పనులు పూర్తయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. మార్చి లోపు ఉపాధి హామీ పనుల కోసం రూ. 1372 కోట్ల నిధులు విడుదల చేసినట్టు మంత్రి సీతక్క ప్రకటించారు.

ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన పనులపై మంత్రి సీతక్క మార్గ నిర్దేశం చేశారు. మహిళలకు ఉపాధి భరోసా, పంట పొలాలకు బాటలు, పండ్ల తోటల పెంపకం, ఇంకుడు గుంతలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, స్వచ్ఛ భారత్ మిషన్ కోసం ఉపాధి నిధులు వెచ్చించేలా క్షేత్రస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు.

## మంత్రులు, ఎమ్మెల్యేలు స్వేచ్ఛగా పనిచేస్తున్నారు: మహేశ్‌కుమార్‌గౌడ్




హైదరాబాద్: నవంబరు 5న జరిగే పీసీసీ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పాల్గొంటారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే కులగణనపై రాహుల్‌గాంధీ వివరాలు తీసుకుంటారని వెల్లడించారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు. "ప్రధాని మోదీ ఎప్పుడూ వాస్తవాలు తెలుసుకునే ప్రయత్నం చేయరు. కానీ, విమర్శలను కూడా రాహుల్‌గాంధీ పాజిటివ్‌గా తీసుకుంటారు. కులగణన కోసం కనెక్టింగ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశాం. ఎమ్మెల్యేలు ఇన్‌ఛార్జిలుగా వెళ్తారు. కులగణన విషయంలో రాహుల్‌గాంధీ చిత్తశుద్ధితో ఉన్నారు. వంచించిన కేసీఆర్‌ను దించి ప్రజలు మాకు అధికారం కట్టబెట్టారు. సీఎం, మంత్రులు, పార్టీ నేతలు ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలు కోరుకున్న విధంగా ప్రజా పాలన అందిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు స్వేచ్ఛగా పనిచేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సజావుగా నడుస్తోంది. మహేశ్వర్‌రెడ్డికి బీజేఎల్పీ నాయకుడిగా భాజపాలో దక్కుతున్న గౌరవమేంటో ఆలోచించుకోవాలి. భాజపా కార్యాలయంలో ఆయనకు కుర్చీలేదు, ఒక స్థానం లేదు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ప్రజాస్వామిక స్వేచ్ఛ.. ఏ ఇతర పార్టీలోనూ లేదు. భాజపాలో అంతకన్నా లేదు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

## కాంగ్రెస్ కమీషన్ల సంస్కృతిని కొనసాగిస్తోంది.. బీజేపీ ఎంపీ అరవింద్ సంచలన వ్యాఖ్యలు

జగిత్యాల: కేసీఆర్ దుర్మార్గపు పాలననే కాంగ్రెస్ కొనసాగిస్తోందని బీజేపీ ఎంపీ అరవింద్ విమర్శలు చేశారు. ఇవాళ(శనివారం) జగిత్యాలలో అరవింద్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ...బిల్లుల విడుదలకు 7 శాతం కమిషన్ తీసుకుంటున్నారని ఆరోపించారు. కేసీఆర్ చేసిన దరిద్రాన్ని కాంగ్రెస్ ఇంకా దరిద్రం చేస్తోందని ఆరోపించారు.

కాంగ్రెస్ వచ్చి ఏడాది అయినా ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. పాదయాత్ర చేస్తే.. జనంతో కేటీఆర్ తన్నులు తింటారని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని మాజీ మంత్రి కేటీఆర్ దిగజార్చారని మండిపడ్డారు.పదేళ్లు కళ్లు నెత్తికి ఎక్కి పాలించారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకు ప్రత్యామ్నాయం బీజేపీనే అని అరవింద్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రోటోకాల్ పాటించలేదని, ప్రారంభోత్సవాలు లేవని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. చాలా రోజులకు ప్రోటోకాల్ కనబడిందని చెప్పారు.

కాంట్రాక్టర్లను బెదిరించడం, కమీషన్లు దండుకోవడం




గతంలో జరిగాయని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారుల మీద ఒత్తిడి తెచ్చిందని..పేరు ప్రఖ్యాతుల కోసం ప్రయత్నం చేసిందని అన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు, ఆ తర్వాత అభివృద్ధి మీద దృష్టి పెట్టాలని బండి సంజయ్ అన్నారు.

## ఉగ్రవాదులకు సరిగ్గా బదులిస్తాం: రాజ్‌నాథ్ సింగ్



లఖ్‌నవూ: జమ్మూకశ్మీర్‌లో వరుస ఉగ్ర ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. జమ్మూకశ్మీర్‌లో ఇలాంటి దాడులు దురదృష్టకరమని అన్నారు. ఉగ్రవాదులకు దీటైన బదులు ఇస్తామని హెచ్చరించారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో జరిగిన మీడియా సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. "జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడులు నిజంగా దురదృష్టకరం. గతంతో పోలిస్తే ఇటీవల కాలంలో ఈ దాడులు తగ్గుముఖం పట్టాయి. స్థానికంగా భద్రతాపరంగా ఎటువంటి లోపాలు లేవు. మన భద్రతా దళాలు అప్రమత్తంగా ఉన్నాయి. జమ్మూకశ్మీర్ వేగంగా అభివృద్ధి చేందుతోంది. అతి త్వరలోనే అక్కడ ఉగ్రవాద కార్యకలాపాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోతాయి. ఉగ్రవాదులకు మన సైన్యం తగిన బుద్ధి చెబుతోంది. ఇప్పటివరకు ఎందరో ఉగ్రవాదులను మట్టుపెట్టాం" అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. కాగా.. నేటి తెల్లవారుజామున బందిపోరా జిల్లాలో ఉగ్రవాదులు, భారత సైన్యానికి మధ్య ఎదురుకాల్పులు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. అంతకుముందు.. అఖ్నూర్ సెక్టార్‌లో ఆర్మీ వాహనంపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఇటీవల కాలంలో వరుసగా జరుగుతోన్న ఈ ఘటనలపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే అనంతనాగ్ జిల్లాలో ఇద్దరు ఉగ్రవాదులను సైన్యం మట్టుబెట్టింది.




## అమెరికా అలర్ట్.. అన్మోల్ బిష్ణోయ్‌ని భారత్‌కు రప్పించేందుకు రంగం సిద్ధం

ముంబయి: లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరు ఇటీవల కాలంలో దేశంలో మారుమోగిపోతోంది. ఈ సమయంలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. లారెన్స్ సోదరుడు అన్మోల్ గురించి అమెరికా అలర్ట్ చేయడంతో అతడిని భారత్‌కు రప్పించే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈనేపథ్యంలో అతడిని భారత్‌కు తీసుకొచ్చే ప్రయత్నాలను ముంబయి పోలీసులు వేగవంతం చేశారు. కొన్ని నెలల క్రితం బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ ఇంటి బయట కాల్పుల ఘటన సహా పలు కేసుల్లో అన్మోల్‌పై ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఇటీవల ముంబయిలో సంచలనం సృష్టించిన బాబా సిద్దిఖీ హత్య కేసు నిందితులతో టచ్‌లో ఉన్నట్లు పోలీసులు వెల్లడించిన సంగతి తెలిసిందే. దాంతో అతడిని భారత్‌కు రప్పించే ప్రక్రియను ప్రారంభించేందుకు అనుమతి కోరుతూ గత నెల ముంబయి పోలీసులు ప్రత్యేక న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. లారెన్స్ తరఫున అన్మోల్ పలు చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో భాగమయ్యాడని ఆ సందర్భంగా పోలీసులు పేర్కొన్నారు. ఈనేపథ్యంలో అన్మోల్ కదలికల గురించి అమెరికా అధికారులు ఉప్పందించడంతో ముంబయి క్రైమ్ బ్రాంచ్ అతడిని భారత్‌కు రప్పించే ప్రయత్నాలను మొదలుపెట్టిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇక, ఈ ఏడాది ఏప్రిల్ 14న సల్మాన్‌ఖాన్ ఇంటివద్ద కాల్పుల ఘటన చోటుచేసుకుంది.

దానికి బాధ్యత వహిస్తూ అన్మోల్ సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టాడు. ఆ కేసు విచారణలో భాగంగా ముంబయి పోలీసులు అతడిపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. అలాగే 2022లో ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. ఆ కేసులోను అభియోగాలు ఎదుర్కొంటున్నాడు. అతడిపై సుమారు 18 కేసులున్నాయి. భాను పేరుతో చెలామణి అవుతున్న అన్మోల్.. నకిలీ పాస్‌పోర్టును ఉపయోగించి దేశం విడిచిపారిపోయాడు. ఈ కేసుల విచారణలో భాగంగా అన్మోల్ గురించి సమాచారం ఇచ్చినవారికి రూ.10 లక్షల రివార్డు ఇస్తామని ఇటీవల జాతీయ దర్యాప్తు సంస్థ (%చీ×ూ%) ప్రకటించిన సంగతి తెలిసిందే.




## డబ్బా కొట్టుడు ఆపండి.. రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

ఎన్నికల హామీల అమలు విషయంలో రాష్ట్ర ప్రజలతో పాటు దేశ ప్రజలను కాంగ్రెస్ పార్టీ తప్పుదోవ పట్టిస్తోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత తొమ్మిదేళ్లలో 1,61,000 పోస్టులను భర్తీ చేసినప్పటికీ, ఉద్యోగ నియామకాలపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 50వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు డబ్బా కొట్టుకుంటున్నారని, వారు చెప్పే 50 వేల ఉద్యోగాలు గత ప్రభుత్వంలోనే నోటిఫై చేసి, పరీక్షలు నిర్వహించి, సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసినవేనని, ఎన్నికల కోడ్ కారణంగా నియామకపత్రాలు అందించడం ఆలస్యమైందన్నారు. పెండింగ్‌లో ఉన్న నియామక పత్రాలు ఇచ్చి, ఉద్యోగాలన్నీ తామే భర్తీ చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు.

**హామీలపై ప్రశ్నల వర్షం..** కాంగ్రెస్ పార్టీ మొదటి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటివరకు కేవలం పది శాతం ఉద్యోగాలను ఇవ్వలేదన్నారు. 2023 డిసెంబరు 9వ తేదీకి రుణమాఫీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా, అర్హులైన రైతుల్లో సగం మందికి రుణమాఫీ కాలేదని, కర్షకులు ఇంకా రుణమాఫీ డబ్బుల కోసం వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రతి నెలా రూ. 4,000 పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చినా, 11 నెలల తర్వాత కూడా అమలు చేయలేదన్నారు. 18 ఏళ్లు పైబడిన మహిళలకు ప్రతి నెలా రూ. 2,500 ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు ఆ పథకం ఆచరణలోకి రాలేదని తెలిపారు. ప్రతి విద్యార్థికి రూ. 5 లక్షలతో విద్యా భరోసా కార్డు ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రతి పంటకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి, సన్న రకాలకు మాత్రమే పరిమితం చేశారని ఆరోపించారు. కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం హామీ ఊసేలేదన్నారు. కళాశాల విద్యార్థినులకు ఎలక్ట్రిక్ వాహనాల హామీ గుర్తు లేదా అన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో హామీలు నెరవేరుస్తామని చెప్పారని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 300 రోజులు గడిచినా హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు విమర్శించారు.

**గత పథకాలపై..** కొత్త పథకాల సంగతి దేవుడెరుగు, గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన అన్ని పథకాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. రైతు బంధు, దళిత బంధు, బీసీ బంధు, కేసీఆర్ కిట్, పోషక కిట్, ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్, బతుకమ్మ చీరలు.. ఇలా ఎన్నో పథకాల అమలును ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. ఇచ్చిన హామీల అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందనే విషయం తెలంగాణ ప్రజలందరికీ తెలుసన్నారు.

వాస్తవాలు ఇలా ఉంటే రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, తెలంగాణ కాంగ్రెస్ మాత్రం తమ వైఫల్యాలను విజయాలుగా చూపించేందుకు విఫల యత్నాలు చేస్తూ దేశ ప్రజలను మభ్యపెడుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు.

## తెలంగాణ సీఎం మార్పు వార్తలపై మంత్రి పొంగులేటి

హైదరాబాద్, నవంబర్ 2: తెలంగాణలో సీఎం మార్పుపై గతకొద్ది రోజులుగా జరుగుతున్న ప్రచారంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ సీఎం మార్పు ఉండదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వానికి పీరియడ్ ఇంకా నాలుగేండ్ల ఒక నెల ఉందని.. పూర్తి కాలం రేవంత్ రెడ్డినే సీఎంగా ఉంటారని తెలిపారు. ప్రతిపక్షాలు ఏదో ఒకటి మాట్లాడాలి కాబట్టి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఏమైనా చిన్న చిన్నవి ఉంటే అవి టీ కప్పులో తుఫాను మాత్రమే అని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. మంత్రి ఇంకా మాట్లాడుతూ.. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోస్తామన్నారు. గ్రామ సభలు పెట్టి ఇండ్లను మంజూరు చేస్తామని.. నాలుగు విడతల్లో 5 లక్షలు పేమెంట్ చేస్తామన్నారు. ఫౌండేషన్ లెవల్‌కు లక్ష, లెంటల్ లెవల్‌కు 1.25 లక్షలు, స్లాబ్ లెవల్‌కు 1.75 లక్షలు, పూర్తి అయ్యాక లక్ష చెల్లిస్తామన్నారు. 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం ఉంటుందన్నారు. సొంత స్థలంలో ఇండ్ల నిర్మాణానికి మొదటి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఆ తర్వాత ప్రభుత్వం స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడతామన్నారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసి నిర్మాణం మొదలు పెట్టిన ఇండ్లకు కూడా సహాయం చేస్తామన్నారు. ఈ నెల 20లోపు ఇందిరమ్మ కమిటీలు లబ్ధిదారుల జాబితాను పంపిస్తాయన్నారు. ఈ నెలాఖరుకు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి అవుతుందని వెల్లడించారు. ఆ వెంటనే ఇండ్ల నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను కేటాయించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు ఫ్రీ ఇసుక ఇచ్చే అవకాశాలు



పరిశీలిస్తామన్నారు. కేంద్ర గృహ నిర్మాణ స్కీం అడాప్ట్ చేసుకుంటున్నామని.. పేద ప్రజలకు అన్యాయం జరగొద్దని కేంద్రం ఎన్ని కండిషన్‌లు పెట్టినా ఒప్పుకుంటున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లపై కేంద్రం లోగో పెట్టుకోవడానికి కూడా ఒప్పుకున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లింపులు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజలకు కేంద్ర మంత్రులను ఆహ్వానిస్తామన్నారు. రాష్ట్రంలోని ఇద్దరు కేంద్ర మంత్రులను కూడా ఆహ్వానించనున్నట్లు తెలిపారు. రాబోయే నాలుగేళ్లు 20 లక్షల ఇండ్ల నిర్మాణం టార్గెట్ పెట్టుకున్నామని.. తల తాకట్టు పెట్టైనా పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. మొదటి విడత ఇండ్లకు 26 వేల కోట్ల భారం ప్రభుత్వంపై పడుతుందన్నారు. సంక్రాంతి పండగ ముందు సర్పంచ్ ఎన్నికలు జరుగుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## 'నేను నోరు విప్పితే భారాస వాళ్లు ఇబ్బంది పడతారు': ఎంపీ అసదుద్దీన్



హైదరాబాద్: భారాస నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. "మూసీ ప్రక్షాళన కోసం భారాస ప్రణాళికలు చేయలేదా? ఆ ప్రణాళిక వద్దని నేను చెప్పలేదా? అప్పటి విషయాలన్నీ ఇప్పుడు బయటపెట్టాలా? నేను నోరు విప్పితే భారాస వాళ్లు ఇబ్బంది పడతారు. ఇళ్లు కదల్చకుండా మూసీ ప్రక్షాళన చేస్తే స్వాగతిస్తాం. భారాస విధానాలు స్థిరంగా ఉండాలి. ఆ పార్టీకి జీహెచ్ఎంసీలో ఎక్కువ సీట్లు మా చలవే. ఎంఐఎం మద్దతుతోనే ఎక్కువ సీట్లు వచ్చాయి. 24 మందిని మార్చి ఉంటే భారాస మళ్లీ గెలిచేది. అప్పట్లో ఆ పార్టీ నేతలకు అహంకారం ఉండేది. ఎక్కువ మంది సంతానం ఉండాలని చంద్రబాబు, స్టాలిన్ అంటున్నారు. అదే విషయాన్ని నేను చెప్పి ఉంటే రాద్ధాంతం చేసేవారు. దక్షిణ భారత్‌లో జననాల రేటు తక్కువగా ఉందని చంద్రబాబు గుర్తించారు. జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాదికి నష్టం. అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల సంఖ్య తగ్గుతుంది. బాగా పనిచేసిన రాష్ట్రాలను ప్రోత్సహించకుండా శిక్షిస్తే ఏం లాభం?" అని అసదుద్దీన్ ప్రశ్నించారు.

చురకలు


# "అకాల మృత్యు హరుడు... ధర్మపురి యముడు"

## భారతావనిలో అపురూప ఆలయం - యమ ద్వితీయ సందర్భంగా

"భూషణవికాస శ్రీధర్మ పుర నివాస దుష్ట సంహార నరసింహ దురితదూర" అనే మకుటంతో భక్తాగ్రేసరులు శేషప్ప రాసిన నరసింహ శతక పద్యాల మాధుర్యాన్ని ఆస్వాదించని, తెలుగువారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. భారతీయ ప్రాచీన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు పట్టు కొమ్మగా, హైందవ సనాతన సంప్రదాయాలకు నెలవుగా, అనాది కాలంగా హైందవ ధర్మ ప్రచారం కేంద్ర బిందువుగా, పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసి, ఆస్తిక ప్రపంచానికి వరదాయిగా, భక్తి ముక్తి ప్రదాయినిగా విరాజిల్లుతున్నది సుప్రసిద్ధ గోదావరి తీరస్థ తీర్థమైన ప్రాచీన ధర్మపురి క్షేత్రం. తెలుగునేలపై సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, దక్షిణ కాశీగా, నవ నారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమైనదిగా, హరి హర క్షేత్రంగా, పౌరాణిక, ఐతిహాసిక చారిత్రక ప్రాధాన్యతను సంతరించు కున్నది క్షేత్ర రాజ్యం. బ్రహ్మాండ, స్కందాది పురాణాలలో, ధర్మపురి క్షేత్ర ప్రాశస్త్యం నిక్షిప్తమై ఉంది. ఈ క్షేత్ర దేవస్థాన అంతర్గతంగా ఉన్న యమధర్మరాజు మందిరం, విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. భారతావనిలోనే అరుదుగా, అపురూపంగా, క్షేత్రంలో వెలసిన "యమధర్మరాజును దర్శిస్తే", "యమపురి" ఉండబోదని ప్రతీతి. హిరణ్యకశిపుని సంహరించిన అనంతరం ఉగ్ర నరసింహ స్వామిని శాంతింప చేసేందుకు, బ్రహ్మాది దేవతలు పుణ్యతీర్థం, పవిత్ర క్షేత్రము అయిన ధర్మపురిలో తపో, యజ్ఞ, ధ్యానం ఆది సత్కర్మలను ఒనరించి నట్లు స్థల పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఒకానొక సమయాన యమధర్మరాజు, తన లోకమునందు అనేక శారీరక బాధలను అనుభవించుచున్న పాపులను గాంచి, నిట్టూర్పులు విడిచి, తనలో తాను విచారిం చెను. పుణ్యాత్ములను దర్శించిన చో పుణ్యము, పాపాత్ములను చూచినచో పాపమే లభించునని, నిత్యము పాపులను దర్శించుట వల్ల, తనకు పాప సంచయమే కలుగుతున్నదని, తనయందు స్వయంకృత పాపం అనునది ఏమాత్రము లేకున్ననూ, పాపుల నిత్య దర్శనంతో మనశ్శాంతి కలగడం లేదని తలంచి, మనశ్శాంతిని పొందుటకు పుణ్యక్షేత్ర దర్శన ప్రయాణోన్ముఖు డై, సమస్త క్షేత్ర ములను తిరిగెను. చివరకు ధర్మపురికి రాగా ఈ క్షేత్రమున గోదావరి నది స్నానము ఆచరించ గానే, యమునకు మనశ్శాంతి కలిగెనని, పాపాత్ముల దర్శన దోషములు తొలగెగని, బ్రహ్మాండం, స్కాంద పురాణాంతర్గత "ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం" ఆధారంగా నైమిశారణ్యంలో సూత పౌరాణికుడు, శౌనకాది మహర్షులకు వివరించినట్లు నారదుడు పృథు మహారాజుకు క్షేత్ర మహిమను తెలిపినట్లు వివరించ బడింది. యమధర్మరాజు నరసింహుని మందిరానికి ఏగి, చేసిన పూజలకు ప్రసన్నుడైన నరసింహుడు, యమధర్మరాజును తన సన్నిధిలో నివసించమని తెలిపెనని పురాణాల ఆధారం. యముడు గోదావరిలో స్నానమాచరించిన స్థలమునకు "యమ కుండము" అని పేరు కలిగినట్లు, అచట స్నానమాచరించి,



నరసింహుని పూజించు వారికి యమ లోక బాధలు కలుగకుండా ఉండు నట్లు, సర్వ పాప విముక్తి కలుగునట్లు, నరసింహుడు వరం ఇచ్చినట్లు, యమ ధర్మరాజు తన అంశ రూపమును, నరసింహ మందిర పూర్వ భాగమున నిలిపెన ని, పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. దేవస్థానంలో యోగానంద నరసింహ ప్రధానాలయం ముందు భాగాన, ఉంది యమ ధర్మ రాజ మందిరం. కోరలతో, యమ దండాన్ని ధరించిన భీకరాకార ఆరు అడుగుల భారీ విగ్రహం ఇందుంది. "దక్షిణాభి ముఖీ గంగా, యత్ర దేవో నృకేసరి, తత్ర శ్రీర్విజయోర్భూతి: కాశ్య యశ్వత గుణం భవేత్", అని అని దక్షిణ అభి ముఖియై ప్రవహిస్తున్న గోదావరి తీరస్థమైన, ధర్మపురి క్షేత్రం విశిష్టతను కలిగి ఉన్నది. వేరే ఎక్కడ కాన రాని విధంగా, ధర్మపురి క్షేత్రం వద్ద గోదావరి దక్షిణ వాహినిగా ప్రవహిస్తు న్నది. అష్టదిక్పాలకులలో ఒకరైన యముడు, దక్షిణ దిశకు అధిపతి. అంతేకాక గ్రహాల దృష్ట్యా, కుజుడు దక్షిణ దిశకు అధిపతి. కుజ గ్రహానికి మూలాధిపతి నరసింహుడు అని పరాశరుడు బృహత్ పరాశర హెూరా శాస్త్రం నందు నుడివి ఉన్నాడు. కనుక ధర్మపురిలో దక్షిణ వాహినిగా ఉన్న గౌతమి యందు దక్షిణాభిముఖులై, స్నానాలు ఆచరిస్తే నరసింహుని దర్శిస్తే, నరక బాధలు ఉండవని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ధర్మపురిలో వెలసిన యమ ధర్మరాజును దర్శించే భక్తుల సంఖ్య, నానాటికీ అధికమవుతున్నది. ఇటీవల సంభవిస్తున్న అనూహ్య ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా, అకాల మృత్యు నివారణకై అధర్వణ వేదంలో పేర్కొనబడిన "ఆయుష్య సూక్తం" ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే భరణి నక్షత్రం, చతుర్దశి తదితర ప్రత్యేక దినాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. బుధ వారం యమ ద్వితీయ సందర్భంగా, అభిషేకం, ఆయుష్య సూక్తం, యమ సూక్త మంత్రం, పురుష సూక్తం, శ్రీసూక్తం, జ్వర హర స్తోత్ర పఠనాలు, రోగ నివారణ సూక్తాలు పూజలు, యమాష్టకాది నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ఖండాంతర ఖ్యాతిని ఆర్జించిన ఏల్చూరి

## - నవంబర్ 3... ఏల్చూరి విజయరాఘవ రావు జయంతి






ఏల్చూరి విజయరాఘవ రావు (నవంబర్ 3, 1925 - నవంబర్ 30, 2011) ఖండాంతర ప్రఖ్యాత భారతీయ సంగీత కారుడు, వేణుగాన విద్వాంసుడు, సంగీత దర్శకుడు, సంగీత బాణీలు సమ కూర్పులో నిష్ణాతుడు, నర్తకుడు, బహుభాషా కోవిదుడు, ప్రయోక్త, సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత, "పద్మశ్రీ" విజేతయైన అత్యంత ప్రతిభా వంతుడు. "రఘుపతి రాఘవ రాజారాం" పాట స్వరకర్త. మహాత్మా గాంధీనే తన రామధున్ కార్యక్రమం ద్వారా మెప్పించాడు. సర్దార్ పటేల్ కు స్వస్థత చేకూర్పు కోసం, కొంత కాలం సంగీతం వినిపించాడు. ఖండాంతర ఖ్యాతి నార్జించాడు. ప్రపంచంలో మూడు ఖండాలలో ఒకసారి కాదు, ఎన్నోసార్లు ఆయన సంగీత కచేరీలు నిర్వహించాడు. ఆయన వేణునాద రికార్డులు ఇంగ్లండు, పారిస్‌లోనూ లభిస్తాయి. ప్రాచుర్యం పొందాయి. బహు భాషావేత్త గా, వాద్య కారునిగా, నర్తకునిగా, స్వరకర్తగా, రచయితగా, ప్రాసంగికునిగా, ఆయన చేసిన కృషి అనన్య సామాన్యం. విజయ రాఘవరావు ఏల్చూరి రామయ్య, సుబ్బాయమ్మ దంపతుల ద్వితీయ సంతానంగా 1925, నవంబర్ 3 న జన్మించాడు. ఆయన పసి బిడ్డగా ఉండగానె తండ్రి మృతి చెందారు. అయన సోదరుడు నయాగరా కవుల్లో ఒకరైన శ్రీ ఏల్చూరి సుబ్రహ్మణ్యం. తండ్రి నుంచి ఆయనకు సంగీతా భిమానం సంక్రమించింది. ఆయన తెలుగు, ఇంగ్లీష్, హిందీ లతో బాటుగా బెంగాలీ వంటి ఇతర భాషలు కూడా క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. విజయ రాఘవ రావు తన కళాజీవితాన్ని భరత నాట్యంతో మొదలు పెట్టినప్పటికీ, ఆయన వేణువునే కాక, వాద్య బృంద నిర్వహణనూ, మెళుకు వలనూ, స్వరరచననూ, సంగీత ప్రసంగాలనూ అద్భుతంగా నిర్వహించాడు. తెలుగులో కవితలు అకాడమే కాదు, ఇంగ్లీషులో రచనలూ చేశాడు. నరసరావుపేటలో చెరువు కట్ట మీద యాదవుల పిల్లలతో కూడి వారి వద్దనే వేణువు వాయించడం నేర్చుకున్న విజయ రాఘవరావుకు ప్రాథమికంగా గురువు ఎవరూ లేరు. మద్రాసు వెళ్ళి కళా క్షేత్రంలో సంగీతం, రుక్మిణీదేవి అరండేల్ వద్ద భరత నాట్యం అభ్యసించాడు. అక్కడికి వచ్చిన ప్రఖ్యాత నర్తకులు ఉదయ శంకర్ దృష్టిని ఆకర్షించి వారి నృత్య బృందంలో నర్తకుడిగా చేరి, దేశ విదేశాలూ తిరిగాడు. ఆ ప్రదర్శనలు ఇస్తున్నపుడే ఒకసారి రష్యాలో నాట్య ప్రదర్శన అనంతరం వేణు గానంతో అక్కడి శ్రోతల్ని అబ్బుర పరిచగా, ఆ సందర్భంలోనే ఉదయ శంకర్ సోదరుడు పండిట్ రవి శంకర్ తన శిష్యుడిగా స్వీకరించి హిందూస్తానీ సంగీత ప్రపంచం లోకి ఆయన్ని ఆహ్వానించాడు. అలా ఆయన ప్రతిభ మరింతగా విస్తరించింది. సితార్ విద్వాంసుడైన రవిశంకర్ వద్ద సంగీతం నేర్చుకున్న విజయ రాఘవరావు ఆయనకు నికరమైన శిష్యుడు. రవిశంకర్ స్వయంగా సంగీతరచన చేసిన అనూరాధా, గోదాన్, మీరా మొదలైన హిందీ చిత్రాల రికార్డింగ్ లన్నిటిలోనూ రావు ప్రధానపాత్ర నిర్వహించాడు. ఫిల్మ్స్ డివిజన్‌వారి అసంఖ్యాకమైన డాక్యుమెంటరీల సంగీతంలో ఆయన రేడియో శబ్దాల దగ్గర్నుంచీ, రకరకాల ప్రపంచ వాద్యాల దాకా అనేకం వాడి విజయ వంతమైన ప్రయోగాలు చేశాడు. 1955 నుండి 1958 వరకు ఢిల్లీ ఆకాశవాణి కేంద్రంలో విజయ రాఘవరావు సంగీత ప్రయోక్తగా, వాద్యబృంద కార్యక్రమ సంవిధాన కర్తగా పనిచేశాడు. గాంధీజీ హత్య జరిగినపుడు 'రఘుపతి రాఘవ రాజారాం' అనే గీతాన్ని శృతిలయ బద్ధంగా ఎడతెగకుండా వాద్యసంగీత రూపంగా ప్రసారం చేయించాడు. 24 గంటలు ఈ ప్రార్థన సందేశ గీతిక ప్రసార మవుతూనే ఉంది. దీనిని స్వరపరచినది రాఘవరావే. ఆ తరువాత మహాత్మాగాంధీ సంస్మరణ నివాళిగా ఇది సంప్రదాయ నిబద్ధమైంది. 1950 ప్రాంతాలలో సర్దార్ పటేల్ కొద్ది రోజులు తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతుండేవారు. అప్పుడు వరసగా కొన్ని రోజులు తనను సంగీతంతో సేదదీర్చ వలసిందని పటేల్ విజయ రాఘవరావును కోరారు. సాయంకాలం ఒక గంట విజయ రాఘవరావు, ఉస్తాద్ అల్లారాఖా తబలా వాద్య సహ కారంతో పటేల్ మనస్సును స్వస్థ పరచేవారు, రంజింప జేసేవారు. అమెరికాలో వాషింగ్టన్, డి.సి.లో 'కార్నెజీ హాల్' అని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సభా భవనం ఉంది. ప్రపంచ ప్రసిద్ధులైన కళాకారుల గాన సభలు అక్కడ సంగీత కచేరీ నిర్వహించడం జీవిత సాఫల్యంగా భావిస్తారు. విజయ రాఘవరావు కార్నెజీ హాల్‌లో వారి ఆహ్వానంపై వేణునాదం విన్పించారు. అమెరికాలో జార్జియా రాష్ట్రంలో భారతీయ సంగీతం, సంస్కృతి, జ్ఞాన సాధన, చింతన ధారలను ప్రచారం చేసే ఒక పత్రిక వెలువడు తున్నది. ముఖ్యంగా ప్రవాస భారతీయులను ఉద్దేశించి కార్యక్రమ నిర్వహణ విశేషాలను ప్రకటిస్తుంది ఈ పత్రిక. పన్నెండేళ్ళ కిందట 'అట్లాంటా' నగరంలో 'ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ సొసైటీ ఆఫ్ గ్రేటర్ అట్లాంటా అనే సాంస్కృతిక సంస్థ విజయ రాఘవరావు సంగీత కచేరీ ఏర్పాటు చేసింది. ఆయన గొప్ప నర్తకుడు కూడా. దేశవిదేశాలలో అనేక నృత్యప్రదర్శన లిచ్చాడు. పసిపిల్లల వంటి పరమ ఉల్లాస ప్రవృత్తి ఆయనది. సోనీ కంపెనీ వాళ్ళు విజయ రాఘవరావు హంసధ్వని గంటన్నర సేపు ఆలపించగా రికార్డు చేశారు. 'భువన్ షోమ్' కూడా నాకు వారు ప్రదర్శించి చూపారు. ఏల్చూరి విజయ రాఘవరావు ఇంగ్లీషులో, తెలుగులో కవిత్వం రాశాడు, కథలు రాశాడు. 1991 జనవరి- ఫిబ్రవరి ఇండియన్ లిటరేచర్ (సాహిత్య అకాడమి)లో ఆయన సాహిత్య ప్రస్థాన వ్యాసం ప్రచురితం. అందులో సంగీత సాహిత్యాలలో ఆయన ప్రజ్ఞ, హృదయ వైశాల్యం ఎంతో గొప్పగా ఆవిష్కృతమైనాయి. ఆయనకు 1970 లో భారత ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక అవార్డు అయిన పద్మశ్రీ వచ్చింది. 1982 లో సంగీత నాటక అకాడమీ అవార్డు లభించింది. జాతీయ అంతర్జా తీయ స్వర్ణ పతక సమ్మానితుడు గా సంగీత ప్రపంచం లో నిలిచి పోయాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# అమూల్య భారత రత్నం అమర్త్య సేన్

## - నవంబర్ 3.. అమర్త్య సేన్ జన్మదినం



భారత దేశం గర్వించదగిన శాస్త్ర వేత్తలలో ప్రముఖులు అమర్త్యసేన్. ఆయన భారతీయ తత్త్వ శాస్త్రవేత్త, ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి స్వీకరించిన తొలి భారతదేశపు ఆర్థిక శాస్త్రవేత్త. 1998లో కరువు, మానవ అభివృద్ధి సిద్ధాంతము, సంక్షేమ ఆర్థిక శాస్త్రము, పేదరికమునకు కారణములు, పొలిటికల్ లిబరలిజం లలో చేసిన విశేష కృషికి 1999 లో నోబెల్ బహుమతి లభించింది. 1933 నవంబర్ 3న బెంగాల్‌లోని శాంతినికేతన్ లో జన్మించిన అమర్త్య సేన్ 1941లో ఉన్నత పాఠశాల విద్య ఢాకాలో పూర్తి చేసుకొన్నారు. 1947లో దేశ విభజన తర్వాత భారత దేశానికి తిరిగివచ్చి విశ్వభారతి, ప్రెసిడెన్సీ కళాశాలలలో అభ్యసించారు. కేంబ్రిడ్జిలోని ట్రినిటి కళాశాలలో 1956 గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నారు. 1959లో పి.హెచ్.డి పట్టా పుచ్చుకున్నారు. సేన్ మాతామహుడు క్షితిమోహన్ సేన్ మధ్య యుగ చరిత్రలో పండితుడు. ఆయన రవీంద్రనాథ్ టాగూర్ కు సన్నిహితుడు. సేన్ తల్లి అమితా సేన్, తండ్రి అశుతోష్ సేన్. తండ్రి ఢాకా విశ్వ విద్యాలయంలో రసాయన శాస్త్రము బోధించేవారు. 1971 లో ఆయన లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా చేరారు. అక్కడ 1977 వరకు బోధించాడు. 1977 నుండి 1988 వరకు, ఆక్స్ఫర్డ్ విశ్వ విద్యాలయంలో బోధించారు. అక్కడ మొదట ఎకనామిక్స్ ప్రొఫెసర్, నఫిల్డ్ కాలేజీ ఫెలో , తరువాత పొలిటికల్ ఎకానమీ ప్రొఫెసర్, ఫెలో ఆల్ సోల్స్ కళాశాల, ఆక్స్ఫర్డ్ 1980 నుండి 1987 లో, సేన్ థామస్ డబ్ల్యూ. లామోంట్ యూనివర్శిటీ ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా హార్వర్డ్‌లో చేరారు. 1998 లో కేంబ్రిడ్జ్‌ని మాస్టర్ ఆఫ్ ట్రినిటీ కాలేజీగా నియమించ బడ్డారు. ఆక్స్బ్రిడ్జ్ కళాశాల యొక్క మొదటి ఆసియా వాసిగా అధిపతి అయ్యారు . జనవరి 2004 లో, సేన్ హార్వర్డ్‌కు తిరిగి వచ్చారు. సంక్షేమ ఆర్థిక శాస్త్రం, సామాజిక ఎంపిక సిద్ధాంతం , ఆర్థిక మరియు సామాజిక న్యాయం, కరువు యొక్క ఆర్థిక సిద్ధాంతాలు , నిర్ణయ సిద్ధాంతం, అభివృద్ధి ఆర్థిక శాస్త్రం, ప్రజారోగ్యం మరియు దేశాల శ్రేయస్సు యొక్క చర్యలకు సేన్ కృషి చేశారు. సంక్షేమం వైపు, పేదరికం, నిరుద్యోగం వైపు అమర్త్య సేన్ కృషి అమోఘమైనది. సంక్షేమ అర్థశాస్త్రం వైపు దృష్టి సారించి ప్రజలకు కనీస అవసరాలు ఎలాగో ప్రజాస్వామిక హక్కులు కూడా అంతే ముఖ్యమని ఉద్ఘాటించాడు. ప్రపంచంలోని అన్ని దేశాలు తమతమ రక్షణ బడ్జెట్ ను తగ్గించాలని హితవు పలికారు. పేదరిక స్థాయిని నిర్ధారించడానికి అమర్త్య సేన్ సోషల్ ఛాయిస్ అనే నూతన సూత్రీకరణను ప్రవేశపెట్టారు. పేదరికానికి, కరువుకు ప్రధాన కారణం ఆహార ధాన్యాల కొరత కాదని, ఉపాధి లేక పోవడంతో ప్రజల వద్ద కొనుగోలు శక్తి లేక పోవడమే ప్రధాన కారణమని తమ అధ్యయనాల ద్వారా నిరూపించారు. ప్రాథమిక విద్య, ఆరోగ్యం ఏ దేశ అభివృద్ధిలో నైనా కీలక పాత్ర వహిస్తాయని ఉద్ఘాటించారు. నీతిశాస్త్రం, తత్వశాస్త్రాల వెలుగులో అభివృద్ధి అర్థశాస్త్రానికి కొత్త రూపం చేర్చారు. 1943లో బెంగాల్ లో కరువు సంభవించి నప్పుడు అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం నియమించిన ఎంక్వైరీ కమిషన్... సకాలంలో వర్షాలు లేక పోవడం, బర్మా నుండి ధాన్యం దిగుబటి కాకపోవడం వంటి కారణాలను చూపించగా, అమర్త్యసేన్ దానికి పూర్తిగా విరుద్ధమైన కారణాలను అర్థశాస్త్ర పరంగా విశ్లేషించారు. కరువు అనేది ఆహారం లేకపోవడం వల్లనే కాదు, ఆహారాన్ని పంపిణీ చేసే యంత్రాంగాల్లో నిర్మించిన అసమానతల నుండి అని వాదించారు. ఆహార ధరలను పెంచిన పట్టణ ఆర్థిక వృద్ధి కారణంగా బెంగాల్ కరువు ఏర్పడిందని, తద్వారా వేతనాలు అందనపుడు లక్షలాది మంది గ్రామీణ కార్మికులు ఆకలితో చనిపోతారని సేన్ వాదించారు. సంక్షేమ అర్థశాస్త్రానికి కొత్త రూపం ఇచ్చారు. కరువు కారణాలపై ఆయన చేసిన ముఖ్యమైన పనితో పాటు, ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం ప్రచురించిన " మానవ అభివృద్ధి నివేదిక " ను రూపొందించడంలో అభివృద్ధి ఆర్థిక శాస్త్రంలో సేన్ చేసిన కృషి గణనీయమైన ప్రభావాన్ని చూపింది. పౌరులు ఓటు వేసే సామర్థ్యాన్ని కలిగి ఉండాలంటే, వారు మొదట "విధులు" కలిగి ఉండాలని, ఈ "విధులు" విద్య లభ్యత వంటి చాలా విస్తృతమైనవని, ఎన్నికలకు రవాణా వంటి ప్రత్యేకమైనవి ఉండాలని, అలాంటి అడ్డంకులు తొలగించ బడినప్పుడు మాత్రమే పౌరుడు స్వేచ్ఛా వాతావరణంలో మనగలరని వివరించారు. జిడిపి లేదా తలసరి ఆదాయం వంటి కొలమానాలపై దృష్టి పెట్టడం కంటే, వ్యక్తులు అనుభవించే నిజమైన స్వేచ్ఛను అభివృద్ధి చేసే ప్రయత్నంగా అభివృద్ధిని చూడాలని సేన్ వాదించారు. రాజకీయ స్వేచ్ఛలు, ఆర్థిక సౌకర్యాలు, సామాజిక అవకాశాలు, పారదర్శకత హామీలు మరియు రక్షణ భద్రత అనే ఐదు నిర్దిష్ట రకాల స్వేచ్ఛలను సేన్ వివరించారు. రాజకీయ స్వేచ్ఛలు ప్రభుత్వంలో స్వరం కలిగి ఉండటానికి, అధికారులను పరిశీలించగల సామర్థ్యాన్ని సూచిస్తాయి. ఆర్థిక సౌకర్యాలు మార్కెట్‌లోని వనరులు మరియు మార్కెట్ విధానం రెండింటికీ సంబంధించినవి. దేశంలో ఆదాయం మరియు సంపదపై ఏదైనా దృష్టి పెడితే ప్రజలకు ఆర్థిక సౌకర్యాలు పెరుగుతాయి. సామాజిక అవకాశాలు ప్రజలకు ఆరోగ్య సంరక్షణ లేదా విద్య వంటి ప్రయోజనాలను అందించే సంస్థలతో వ్యవహరిస్తాయి, వ్యక్తులు మంచి జీవితాలను గడపడానికి వీలు కల్పిస్తాయి. పారదర్శకత హామీలు వ్యక్తులు కొంతవరకు నమ్మకంతో మరియు పరస్పర పరిజ్ఞానం గురించి సంభాషించడానికి అనుమతిస్తాయి. రక్షణ భద్రత అనేది సామాజిక భద్రత వలల వ్యవస్థ, ఇది పేదరికంతో బాధపడుతున్న సమూహాన్ని భయంకరమైన దు:ఖానికి గురిచేస్తుంది. అని నిర్దిష్ట స్వేచ్ఛలను సేన్ వివరించారు. పేదవారికి ఆర్థిక పరిస్థితులను మెరుగు పర్చడానికి ఉపయోగ కరమైన సమాచారాన్ని అందించే పేదరికాన్ని కొలిచే పద్ధతులను సేన్ రూపొందించారు. ప్రేమ పునాదిగా పంచబడే న్యాయం ఒడంబడిక ద్వారా పంచబడే న్యాయం కంటే విలువైనదని, అశోకుడు బుద్ధిస్టు సూత్రాలపై ఏర్పరచిన రాజ్యంలో 'ప్రజాసంక్షేమం బలంగా అంతర్లీనమై ఉంటుందని, అక్బర్ సెక్యులర్ న్యాయ పునాదులు వేసిన చక్రవర్తి అని, సర్వమత సమానత్వ సూత్రీకరణను రూపొందించిన తాత్వికుడని, ఇటలీలో 1600 సంవత్సరంలో బ్రూనోను మత విశ్వాసాలను ధిక్కరిస్తూ హేతుబద్ధ ఆలోచనలను ప్రకటించి నందుకు సజీవంగా కాల్చి చంపుతున్న కాలంలోనే... అక్బరు అద్భుత లౌకిక జాతీయ వాదానికి పునాదులు వేసాడని, భగవద్గీత లోని కృష్ణుని యుద్ధ నీతి పాజిటివ్ న్యాయ సిద్ధాంతం కాగా. గాంధీ అహింసలోనే హింసావాదం దాగి ఉందని అమర్త్య సేన్ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. 1998లో అత్యున్నతమైన నోబెల్ బహుమతి స్వీకరించారు. 1999లో భారత ప్రభుత్వపు భారత రత్న అవార్డుకు ఎంపికైనారు. 2000లో లియోంటీప్ ప్రైజ్, 2000లో అమెరికా దేశపు ఐసెన్ హోవర్ మెడల్ పొందారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# 15 దాటితే ఫోను, 18 దాటితే అప్పు.. తెలంగాణపై సర్వేలో సంచలన విషయాలు!




స్మార్ట్ ఫోన్లు, అప్పులు, చదువులు, ఆరోగ్య సమస్యలు, అక్షరాస్యత, ఇంటర్నెట్ వినియోగం... ఇలా మొదలైన అంశాలపై తెలంగాణలో పరిస్థితి ఎలా ఉందనే విషయాలపై ఓ ఆసక్తికర సర్వే తెరపైకి వచ్చింది. ఈ మేరకు జాతీయ శాంపుల్ సర్వే సంస్థ (ఎన్.ఎస్.ఎస్.వో) తాజాగా తన సర్వే నివేదికను వెల్లడించింది. అవును... తెలంగాణలో కొన్ని పరిస్థితులపై ఆసక్తికర నివేదికను జాతీయ శాంపుల్స్ సర్వే సంస్థ వెల్లడించింది. ఈ మేరకు జాతీయ స్థాయిలో 8,758 గ్రామాలు.. 6,540 పట్టణాల్లోని 3.02 లక్షల కుటుంబాలపై ఈ సర్వే నిర్వహించినట్లు తెల్లిపింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని పరిస్థితులనూ విశ్లేషించింది.

**చదవడం, రాయడం:** ఇందులో భాగంగా... తెలంగాణలో 15 నుంచి 24 ఏళ్ల మధ్యలోపు యువతలో 99.2 శాతం మంది పురుషులకు.. 98.3 శాతం మంది మహిళలకు చదవడం, రాయడంతో పాటు రోజువారీ లెక్కలు చేసే సామర్థ్యం ఉందని తెలిపింది. ఈ లెక్క.. జాతీయ స్థాయిలో పురుషుల్లో 97.8 శాతం.. మహిళల్లో 98.9 శాతంగా ఉందని వెల్లడించింది.

**బ్యాంక్ అకౌంట్:** ఇదే క్రమంలో... 18ఏళ్లు పైబడిన వారిలో 97.5 శాతం మంది ఇండివిడ్యువల్ లేదా కంబైన్డ్ బ్యాంక్ అకౌంట్ ను కలిగి ఉన్నారని.. వీరి సంఖ్య పట్టణాల్లో 96.9 శాతంగా ఉండగా.. అంతకంటే ఎక్కువగా గ్రామాల్లో 98శాతం మందికి బ్యాంక్ అకౌంట్స్ ఉన్నాయని వెల్లడించింది.

**స్కూల్స్ కి వెళ్తున్నవారు!:** అదేవిధంగా... తెలంగాణ రాష్ట్రంలో 6 నుంచి 10 ఏళ్ల లోపు చిన్నారుల్లో 94శాతం మంది బడికి వెళుతుండగా... వారి సంఖ్య పట్టణాల్లో 93.4 శాతంగా, గ్రామాల్లో అంతకంటే ఎక్కువగా 94.9 శాతంగా ఉంది. ఇక బాలురు, బాలికలుగా పరిశీలిస్తే... స్కూల్స్ కి వెళ్తున్న బాలురు 94.1 శాతంగా ఉండగా అంతకంటే ఎక్కువగా బాలికలు 94.5 శాతం ఉన్నారు.

**కెరీర్ విషయంలో..:** ఇక కెరీర్ పై ఆసక్తి విషయానికొస్తే... 21 నుంచి 35 ఏళ్లు ఉన్న యువతలో గరిష్టంగా 66.3 శాతం మంది సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సులు చదువుతుండగా.. వీరి సంఖ్య పట్టణాల్లో 71.5 శాతంగా.. గ్రామాల్లో 58.2 శాతంగా ఉంది.

**స్మార్ట్ ఫోన్ వినియోగం:** ఇదే సమయంలో... సెల్ ఫోన్, ఇంటర్నెట్ ల విషయానికొస్తే... తెలంగాణలో 15 ఏళ్లు పైబడినవారిలో పురుషుల్లో 96.4 శాతం, మహిళల్లో 88.2శాతం వెరసి సగటున నూటికి 92.3 మందికి స్మార్ట్ ఫోన్ వినియోగంపై అవగాహన ఉంది. ఈ సంఖ్య పట్టణాలో 94.5 శాతంగా ఉండగా.. గ్రామాల్లో 90.7 శాతంగా ఉంది.

**ఇంటర్నెట్ వినియోగించే స్కిల్స్:** ఇంటర్నెట్ విషయానికొస్తే... దీన్ని వినియోగించే స్కిల్స్ రాష్ట్రవ్యాప్తంగా 64.8 శాతం మందికి మాత్రమే ఉన్నాయి. ఈ సంఖ్య పట్టణాల్లో 78.9 శాతంగా ఉండగా.. గ్రామాల్లో 54.8 శాతంగా ఉంది. అయితే.. ఇది జాతీయ సగటు (49.8 శాతం) తో పోలిస్తే ఎక్కువే.

**18 ఏళ్లు దాటితే అప్పులు!:** అదేవిధంగా... రాష్ట్రంలోని 18 ఏళ్లు పైబడిన వారిలో ప్రతీ లక్ష మందికి 42,407 మందికి అప్పు / చేబదులు ఉందని తాజా నివేదిక వెల్లడించింది. గ్రామీణ ప్రాంతల్లో వీరి సంఖ్య ప్రతీ లక్షమందిలో 50,289గా ఉండగా.. పట్టణాల్లో 31,309 గా ఉంది. దేశవ్యాప్తంగా వీరి సంఖ్య గ్రామాల్లో 18,714.. పట్టణాల్లో 17,442గా ఉంది.

**వైద్య ఖర్చులు!:** ఇదే క్రమంలో... తెలంగాణ రాష్ట్రంలోని ఆసుపత్రుల్లో ప్రతీ కుటుంబానికీ సగటున అవుతున్న ఖర్చు గ్రామాల్లో రూ.5,088 గా ఉండగా.. పట్టణాల్లో రూ.5,648గా ఉంది. జాతీయ సగటు ఖర్చు రు.4,496 తో పోలిస్తే ఇది ఎక్కువగా ఉంది!

## చురకలు సంపాదకీయం

# రేవంత సర్కారులో పేలని పొలిటికల్ టపాసులు

ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. అందునా తెలంగాణ లాంటి ధనిక రాష్ట్రానికి (అప్పుడు ఉండొచ్చు. అది వేరే లెక్క) ముఖ్యమంత్రి కావట ఒక ఎత్తు. అదీ.. కేసీఆర్ లాంటి మాటల/చేతల మాంత్రికుడ్ని ఓడించి ఆయన చేతిలోని అధికార దండాన్ని అందుకోవటం అంత ఈజీ కాదు. కానీ.. ఆ పనిని విజయవంతంగా చేసిన రేవంత్.. ఓవర్ నైట్ స్టార్ చాంఫియన్ గా అవతరించారు. రేవంత్ లాంటి నేతకు అధికార దండం అందటాన్ని కేసీఆర్ జీర్ణించుకోలేని స్థితి. తన ఓటమి కంటే రేవంత్ విజయం గులాబీ బాస్ ను బాగా హర్ట్ చేసిందంటారు. వాస్తవాన్ని జీర్ణించుకోవటానికి ఆయనకు కాస్త ఎక్కువ సమయమే పట్టిందని చెబుతారు. ఇంతటి ఘన విజయాన్ని అందిపుచ్చుకున్న వేళ.. రేవంత్ మరింత అప్రమత్తంగా ఉండాలి. కేసీఆర్ ను మరిపించేలా ఆయన రాజకీయాన్ని పండించాలి. కానీ.. ఈ విషయంలో ఆయన ఎంత మేర సక్సెస్ అయ్యారు? అన్నది ప్రశ్న. క్యాలెండర్ లో కొత్త నెల వచ్చేసింది. అదే సమయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన రేవంత్ కు మొదటి ఏడాది పూర్తి చేయటానికి మరింత దగ్గరకు వచ్చేశారు. గత ఏడాది డిసెంబరు 7న ఆయన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతల్ని చేపట్టారు. అంట.. ఏడాది పూర్తి కావటానికి మరో 36 రోజులు మాత్రమే ఉన్నాయి. మరి.. ఇలాంటి వేళ.. ఆయన పాలన ఎలా సాగిందన్నది వేరే ముచ్చట. రాజకీయంగా ఆయన తన పరిణితిని ప్రదర్శించారా? కేసీఆర్ జాదూతనం రేవంత్ లో ఎంత ఉంది? ఆయన మాదిరి రేవంత్ తన మార్క్ ను చూపించారా? తనదైన ముద్రను వేశారా? లాంటి ప్రశ్నలు చాలానే వస్తాయి. మరి.. వాటికి సమాధానం వెతికినప్పుడు రేవంత్ పాస్ మార్కులకు దగ్గరగా మాత్రమే ఉండటంనిరాశకు గురి చేస్తుంది. పాలనలోనూ.. కలల ప్రాజెక్టులను ఆవిష్కరించటంలో.. పాలనలో తనదైన మార్క్ ను ప్రదర్శించటంలోనూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఒక సరైన షేప్ లోకి తీసుకురావటంలోనూ.. ఉద్యోగులకు నెల మొదటి రోజునే జీతాలు పడేలా చేయటంలోనూ.. ఎన్నికల వేళ ఇచ్చిన హామీల్ని అమలు చేయటం లోనూ.. ఇలాంటి వాటిల్లో ఆయన ఫెర్ ఫార్మెన్స్ ఎలా ఉందన్నది పక్కన పెడితే.. రాజకీయంగా ఆయన ఎలా వ్యవహరించారన్నది మాత్రం తప్పనిసరిగా చూడాల్సిందే. తెలంగాణ ఏర్పాటు వేళ.. కేసీఆర్ చేతికి పాలనా పగ్గాలు అందే సమయానికి అప్పటి టీఆర్ఎస్ కు ఉన్న ఎమ్మెల్యేల బలం అంతంత మాత్రమే. కాంగ్రెస్.. తెలుగుదేశం.. వైసీపీ.. బీజేపీ.. మజ్లిస.. ఇలా అన్ని పార్టీల పాత్ర ఉండేది. దాని నుంచి ఒక పద్దతి ప్రకారం ఒక్కోపార్టీని కనుమరుగు చేయటమే కాదు.. అదే సమయంలో తన పార్టీని తిరుగులేని శక్తిగా మార్చటంతో పాటు.. తెలంగాణలో మరెవరికి అవకాశం కనుచూపు మేరలో కనిపించకుండా చేశారని చెప్పాలి. టీఆర్ఎస్ తప్పించి మరే పార్టీకి భవిష్యత్ లేదన్నభావన కలిగించటంలో సూపర్ సక్సెస్ అయ్యారు. టార్గెట్ చేయాలే కానీ బంతి గోల్ పోస్టులోకి సూటిగా వెళ్లేలా వ్యవహరించిన ఆయన్ను చూసిన వారంతా ఆశ్చర్యానికి గురయ్యేవారు. పార్టీ పేరు ఏదైనా కావొచ్చు. నేతలు మరెవరైనా కావొచ్చు. తనకు దాసోహం అనేలా చేసుకోవటంలో కేసీఆర్ ప్రదర్శించిన పొలిటికల్ గేమ్ కు ఫిదా కానివారే లేరు. అయినప్పటికీ రెండో దఫా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి.. అజేయశక్తిగా మారిన తర్వాత చేసిన తప్పులకు ఆయన తన చేతిలోని అధికారాన్ని చేజార్చుకోవాల్సి వచ్చింది. రేవంత్ విషయానికి వస్తే.. పొలిటికల్ గా ఆయన చేతల కంటే మాటలే ఎక్కువగా చెప్పారని చెప్పాలి. ఆయన ప్రభుత్వంలోని కీలక మంత్రులు సైతం అదే పరిస్థితి. విపక్ష బీఆర్ఎస్ ను ఖాళీ చేయిస్తామన్న మాట కాకున్నా.. ప్రతిపక్ష హోదా అన్నది లేకుండా రేవంత్ చేయనున్నారన్న హైప్ క్రియేట్ కావటం.. అందుకు తగ్గట్లుగా అప్పుడప్పుడు సీఎం రేవంత్ నోటి నుంచి వచ్చిన మాటలు రాజకీయ సంచలనంగా మారాయి. మరి.. ముఖ్యంగా హైదరాబాద్ మహానగరంలో అధికార పార్టీకి ఒక్కరంటే ఒక్క ఎమ్మెల్యే లేని లోటును కంటోన్మెంట్ ఉప ఎన్నిక ద్వారా తీర్చుకున్నప్పటికి.. ఆపరేషన్ ఆకర్ష మాత్రం అట్టర్ ప్లాప్ అయ్యిందనే చెప్పాలి. లా తీసుకురావటానికి రేవంత్ చాలానే శ్రమించాల్సి వచ్చింది. స్వేదం చిందించాల్సి వచ్చింది. ఇంత చేసిన తర్వాత కూడా హైదరాబాద్ మహానగరంలో మెజార్టీ ఎమ్మెల్యేలు అధికార గూటికి తీసుకురావటంలో రేవంత్ సక్సెస్ కాలేకపోయారని చెప్పాలి. అంతేకాదు..గులాబీ కారును ఖాళీ చేస్తున్నట్లుగా ఇచ్చిన బిల్డప్ లు ఒకరోజు సంచలనానికి ఉపయోగపడ్డాయే కానీ.. మరెలాంటి ప్రభావాన్నిచూపించలేక పోయాయి. రేవంత్ బాటలోనే ఆయన ప్రభుత్వంలో కీలక మంత్రిగా పేరున్న పొంగులేటి పరిస్థితి కూడా. పొలిటికల్ బాంబ్ లు పేలనున్నట్లుగా చెప్పిన మాటకు.. దీపావళి అయ్యాక కూడా రాజకీయ టపాసు పేలటం తర్వాత.. దారుణంగా తుస్ మన్న తీరు రేవంత్ సర్కారు మీద ఉన్న గౌరవాన్ని తగ్గించేలా చేశాయని చెప్పాలి. మిగిలిన సంగతులు ఎలా ఉన్నా.. రాజకీయంగా ఒక లైన్ తీసుకున్న తర్వాత.. ముందుకు వెళ్లటమే తప్పించి వెనక్కి తగ్గటం అన్నదే ఉండకూడదు. ఈ విషయంలో ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ తన మార్క్ ను మాత్రం వేయలేదనే చెప్పాలి. పొలిటికల్ టపాసుల్ని పేల్చే విషయంలో ఆయన మరింత పరిణితిని ప్రదర్శించాల్సిన అవసరం ఉంది. ఒకవేళ అంతటి నైపుణ్యం ఇంకా రాలేదన్నప్పుడు.. టపాసులు పేల్చటం కంటే పాలన మీద ఫోకస్ పెట్టటమే తన ప్రాధాన్యత అన్న సంకేతాల్ని ఇచ్చినా బాగుండేది. అదీ కాక.. ఇదీ కాక పొలిటికల్ టపాసుల పేల్చటం ఎలానో గులాబీ బాస్ వద్ద రేవంత్ ట్రైనింగ్ తీసుకోవాలన్న భావనకు గురయ్యేలా చేయటం మంచిది కాదు. ఈ విషయాన్ని రేవంత్ గుర్తించారా?

# సౌభ్రాతృత్వానికి ప్రతిరూపం... భగినీ హస్త భోజనం - యమ ద్వితీయ సందర్భంగా

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతిరూపం భగినీ హస్త భోజనం. సౌభ్రాతృత్వానికి ప్రతీకగా అందరికీ ముందుగా గుర్తుకు వచ్చేది రక్షాబంధనం. కానీ, ఇంతటి ప్రాముఖ్యత పొందిన మరో పర్వదినాన్ని కూడా అన్నా చెల్లెళ్ల పండగగా జరుపుకొంటాం... అదే భగిని హస్త భోజనం. భగిని' అంటే... చెల్లెలు లేదా అక్క ఎవరైనా కావచ్చు. 'హస్త భోజనం' అంటే... చేతి భోజనము అని అర్థం. అంటే.. సోదరి చేతి వంట సోదరుడు తినడం అన్నమాటఈ రోజున అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ముల్ని ఇంటికి పిలిచి భోజనం పెట్టి, వారు ఎల్లప్పుడూ బాగుండాలని పూజలు చేస్తారు. దీనినే భగిని హస్త భోజనం అంటారు. స్మృతికౌస్తుభం దీన్ని యమ ద్వితీయగానే ప్రకటించింది. సోదరుడిపట్ల సోదరి ప్రేమకు ప్రతీకగా- దీన్ని 'భ్రాతృవిదియ'గా పరిగణించడమూ పరిపాటి అయింది. చతుర్వర్గ చింతామణి సహా అనేక గ్రంథాల్లో దీని ప్రస్తావన వస్తుంది. ఆమె చేతివంటకు ప్రత్యేకతను, పవిత్రతను ఆపాదిస్తూ 'భగినీ హస్తాన్న భోజనం' అని పిలవడం లోకంలో సంప్రదాయంగా స్థిరపడింది. భాతృ విదియ ఒక హిందువుల పండుగ. దీనిని కార్తీకమాసము నందు కార్తీక శుద్ధ ద్వితీయ రోజున జరుపు కుంటారు. మహారాష్ట్రలో ఈ పండుగను 'భయ్యా-దుజ్' అని పిలుస్తారు. నేపాల్ ప్రాంతంలో ఈ పండుగను 'భాయి-టికా' అని పిలుస్తారు. పంజాబ్ ప్రాతంలో ఈ పండుగను 'టిక్కా' అని పిలుస్తారు. దీపావళి అయినాక రెండో రోజు దీనిని చేసుకుంటారు. ఈ రోజున సోదరులను ఇంటికి పిలిచి వారి నుదుట బొట్టు పెట్టి, హారతి ఇచ్చి, మిఠాయిలు తినిపించి, ఇష్టమైన పిండి వంటలతో భోజనం పెట్టి తమ సోదరులు ఆరోగ్యంగా ఉండాలని దేవుడిని ప్రార్థిస్తారు. సూర్య భగవానుని కుమారుడు యముడు. ఆయన సోదరి యమి/ యమున. యమునా నది. యమున తన అన్న యముడిని, తన ఇంటికి రమ్మని చాలాసార్లు కోరుతుంది. తీరిక చిక్కని విధి నిర్వహణ మూలంగా ఆమె కోర్కె తీర్చలేక పోతాడు. తుదకు యముడు ఒకనాడు యమున యింటికి వెళ్తాడు. ఆనాడు కార్తీక శుక్ల విదియ. సపరివారంగా వచ్చిన సోదరుని ఆమె ఎంతో మర్యాద చేసింది. యమున్ని ఆయన ముఖ్య లేఖకుడైన చిత్రగుప్తుని, వారి దూతలను పూజించింది. స్వయంగా వంటచేసి అందరికీ వడ్డించింది. ఆమె చేసిన మర్యాదలకు సంతృప్తుడైన యముడు చెల్లెలికి



ఏదైనా వరం కోరుకో మంటాడు. దానికి ఆమె ఈ రోజున చెల్లెలి ఇంటికి వెళ్ళి చెల్లెలి చేతి వంట తినే సోదరునికి నరకాలోక ప్రాప్తి, అపమృత్యుదోషం లేకుండా వరం ప్రసాదించమని కోరింది. ఆమె కోరిన వరాన్ని ప్రసాదిస్తూ యముడు ఎవరైతే ఈనాడు సోదరుని తన ఇంటికి ఆహ్వానించి తన చేతివంటకాల్ని వడ్డించి తినిపిస్తుందో ఆమె వైధవ్యాన్ని పొందక చిరకాలము పుణ్యస్త్రీగా వుంటుందని కూడా వరమిచ్చారు. ఈ విధంగా దీపావళి తరవాత వచ్చే రెండో రోజును భగిని హస్తభోజనం పర్వదినంగా జరుపు కొంటారు. అలాగే కార్తిక శుద్ధ విదియ పర్వదినాన చిత్రగుప్త జయంతిని కూడా జరుపు కుంటారు. సృష్టిలోని 84 లక్షల జీవరాశుల చావు పుట్టుకలను నిర్దేశించే గ్రంథం చిత్రగుప్తుని చిట్టా అని పురాణాలు పేర్కొంటున్నాయి. ఈ పుస్తకంలో ఆయా జీవరాశుల జనన, మరణాల సమయం కూడా ఉంటుందని పౌరాణిక కథనం. చిత్రగుప్తుడి జననం, వంశం, విధి నిర్వహణ గురించి పలు పురాణాలు చెబుతున్నాయి. సృష్టి ఆదిలో ఆయువు తీరిన జీవులన్నీ పరలోకం చేరాయి. పాపపుణ్య విచారణలో యముడు తీవ్ర గందర గోళానికి గురయ్యాడు. బ్రహ్మకు తన బాధను మొరపెట్టు కున్నాడు. బ్రహ్మ ఆలోచిస్తూ సమాధి స్థితిలోకి వెళ్లిపోవడంతో 11 వేల సంవత్సరాలు గడిచి పోయాయి. అప్పుడు ఆయన శరీరం నుంచి నడుముకు ఒక కత్తి కట్టుకుని, కలం, కాగితాల కట్టను చేతుల్లో పెట్టుకుని ఒక దివ్యపురుషుడు ఉద్భవించాడు. బ్రహ్మ ఆయనను యమలోకంలో పద్దుల నిర్వహకుడిగా నియమించాడు. ఆయనే చిత్రగుప్తుడు. కార్తిక శుద్ధ విదియ పర్వదినాన చిత్రగుప్త పూజను జరపాలని వ్రత గ్రంథాలు పేర్కొంటున్నాయి. ప్రధానంగా ఉత్తర భారతదేశంలో వ్యాపారులు చిత్రగుప్త పూజను నిర్వహిస్తుంటారు. ఈ రోజున తమ ఆదాయ, వ్యయాల రికార్డులను చిత్రగుప్తుని పటం ముందు ఉంచి ప్రార్థిస్తారు. బిహార్లో జరిపే ఛత్ పూజ కూడా చిత్రగుప్తుడికి సంబంధించిందే. ఎర్రటి వస్త్రంపై కలం, సిరాబుడ్డి, కత్తి, ఖాతా పుస్తకాలను ఉంచి పూజిస్తారు. చిత్రగుప్త పూజలో పసుపు, తేనె, ఆవాలు, అల్లం, బెల్లం, చక్కెర, గంధం, సిందూరం సమర్పిస్తారు. కేతువు అనుగ్రహం కోసం ఓం శ్రీ చిత్రగుప్తే నమః అనే మంత్రాన్ని జపిస్తారు. జీవుల సంస్కారాన్ని అనుసరించి వారి పాపపుణ్యాలను లిఖించాలని, చిత్రగుప్తుని బ్రహ్మ ఆదేశించినట్లు బృహత్ బ్రహ్మ ఖండంలో ఉంది. యజ్ఞ యాగాదుల్లో హవిస్సులు చిత్రగుప్తునికి చెందుతాయని పద్మపురాణం పేర్కొంటోంది. న్యాయ దేవతగా కూడా ఆయనను అభివర్ణించారు. యమ సంహితలో అత్యంత బాధ్యతాయుత విధుల్లో యమునికి సహాయం చేస్తుంటాడని ఉంది. జీవుల పుట్టుక నుంచి మరణం దాకా ప్రతి చర్యనూ నిగూఢంగా పరిశీలించి లిఖిస్తుంటాడు. శారీరక పాపాలతో పాటు మానసిక దోషాలను కూడా సంగ్రహించగలిగే అతీంద్రియ జ్ఞానం ఆయనకు ఉంది. చిత్రగుప్తుడు లెక్కతేల్చిన అనంతరం యమ ధర్మరాజు ఆ ఆత్మకు తగిన శరీరాన్ని నిర్ణయించి పునర్జన్మను ప్రసాదిస్తాడు. ప్రస్తుత యాంత్రిక యుగంలో కుటుంబ సభ్యుల మధ్య పరస్పర అవగాహన, మానవ సంబంధాలు, సంబంధ బాంధవ్యాలు క్రమక్రమంగా సన్నగిల్లుతున్నాయి. వాటిని తిరిగి నెలకొల్పడానికి, పునరుద్ధరించడం ద్వారా భారతీయ కుటుంబ వ్యవస్థ మళ్లీ వెలుగొందేలా చేయడానికి ఇలాంటి పండుగలు దోహద పడతాయి. అందరూ ఒకరినొకరు ఆత్మీయంగా, ప్రేమ పూర్వకంగా కలుసు కోవడానికి, పలకరించు కోవడానికి వేదికలుగా నిలిచేవి ఇటువంటి పర్వదినాలే. ఇలాంటి సంప్రదాయాల ఆచరణ ద్వారా ప్రస్తుత, రానున్న తరాల వారికి ఆప్యాయతలు, ప్రేమానురాగాలు, ఆత్మీయతలు, పెంపొందించే అవసరం అనివార్యంగా ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# జర్నలిస్టులకు ఆదర్శం జి ఎస్ వరదాచారి - నవంబర్ 3... వరదాచారి వర్ధంతి



వయోధిక పాత్రికేయులు, వయోధిక పాత్రికేయ సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు, జి. ఎస్. (గోవర్ధన సుందర) వరదాచారి నిబద్ధత కలిగిన జర్నలిస్టు, ఎందరో గ్రామీణ జర్నలిస్టులకు మార్గ నిర్దేశనం చేశారు. చాలా మంది జర్నలిస్టులకు దిక్కూ, దిక్సూచి. వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్, హౌసింగ్ సొసైటీ , ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ తో పాటు తెలుగు యూని వర్సిటీలో కూడా తన సేవలను అందించారు. జి.ఎస్. వరదాచారి సీనియర్ తెలుగు భాషా సినీ విమర్శకుడు, పాత్రికే యులు. 1988లో పదవీ విరమణ చేసే వరకు ఆంధ్రభూమి పత్రికకు సహ సంపాదకుడిగా ఉన్నారు. వరదాచారి 1932, అక్టోబరు 24న నిజామాబాదు జిల్లాలోని ఆర్మూరులో జన్మించారు. నిజాం పాలనలో బాల్యమంతా గడిసిన వరదాచారి, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో డిగ్రీ, పి.జి. డిప్లమా ఇన్ జర్నలిజం చదివారు. తరువాత కొంతకాలం 'ది హిందూ' పత్రికలో ఇంటర్న్‌షిప్ చేశారు. 'కృష్ణా పత్రిక'ను తొలిసారిగా చదివిన వరదాచారి ఆ పత్రికకు పాఠకులుగా మారి, 1948లో ఆంధ్ర జనత పత్రికతో తన జర్నలిజం వృత్తిని ప్రారంభించారు. జర్నలిజం డిగ్రీతో ప్రవేశించిన అతికొద్ది మంది జర్నలిస్టులలో వరదాచారి ఒకరు. నాన్ ముల్కీ సంఘటనలు, ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత జరిగిన చరిత్రకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్న వరదాచారి రాసిన సంపాదక లేఖగా పంపిన 'స్వతంత్ర' అనే రచనను పత్రిక వ్యాసం రూపంలో ప్రచురించింది. అదే ఆయన తొలివ్యాసం. ఆంధ్రభూమి, ఈనాడు పత్రికల్లో జర్నలిస్టుగా పని చేశారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య ఉపాధ్యక్షుడిగా ప్రభుత్వంలో తెలుగు భాష వినియోగం కోసం పోరాడారు. తెలుగు విశ్వ విద్యాలయంలో జర్నలిజం విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాత్రికేయ రంగంలో తెలుగు విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. పత్రకార్ శిరోమణి బిరుదు (మొట్ట మొదటి హిందీ పత్రిక ఉదంత మార్తాండ్ 150వ వార్షికోత్సవం సందర్భంగా 1976, నవంబరు 26న కోల్‌కతాలో జరిగిన సర్వ భాష పత్రకార్ సమ్మేళనంలో), దాసరి గోల్డ్ మెడల్ ఉత్తమ ఫిల్మ్ జర్నలిస్ట్, (1986), పత్రీకా రచనాచార్య బిరుదు (అక్టోబర్ 24, 1992న షష్టిపూర్తి కార్యక్రమంలో కిన్నెర సంస్థ), తెలుగు విశ్వవిద్యాలయం జర్నలిజంలో ప్రతిభా పురస్కారం (1999), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉత్తమ జర్నలిస్ట్‌గా విఆర్ నార్ల జీవన సాఫల్య పురస్కారం – 2005, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉగాది పురస్కారం (2006), తెలుగు విశ్వ విద్యాలయం గౌరవ పురస్కారం (26 ఫిబ్రవరి 2007) అందుకున్నారు. 1956 జూన్ నుండి – 1961 మార్చి వరకు ఆంధ్ర జనత పత్రికలో అసిస్టెంట్ ఎడిటర్ గా, 1961నుండి 1982 వరకు ఆంధ్రభూమి దినపత్రికలో... న్యూస్ ఎడిటర్ గా విశ్రాంతులు (చాలాకాలం 'ఆయనే ఆంధ్రభూమి, ఆంధ్రభూమే ఆయన' అనే పేరు ఉండేది), 1983 నవంబర్ 21నుండి 1988 డిసెంబర్ 26 వరకు ఈనాడు దినపత్రిక ఉప సంపాదకులుగా,1963–64 జర్నలిస్టుల సహకార గృహ నిర్మాణ సంఘం అధ్యక్షుడుగా, 1964–1966 ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూని యన్ ప్రధాన కార్యదర్శిగా, 1980–1981 అధ్యక్షులుగా, 1980–81 ప్రెస్ క్లబ్ స్థాపక కార్యదర్శిగా, 1975–78 ఎ.పి. సినీగోయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, 1977 నుంచి. జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా, రచన జర్నలిజం కళాశాల నిర్వహణ మండలి సభ్యత్వం కలిగి, 23 డిసెంబర్ 1988 డిసెంబర్ 23 నుండి సుదీర్ఘ కాలం తెలుగు విశ్వ విద్యాలయంలో జర్నలిజంలో విజిటింగ్ ప్రొఫెసర్ గా పని చేశారు. రాష్ట్ర ప్రభుత్వ చలన చిత్ర సబ్సిడీ కమిటీ ఉన్నంత కాలం (1976–78) సభ్యత్వం,. జాతీయ చలన చిత్రాభివృద్ధి సంస్థ వారి స్క్రిప్టు కమిటీ సభ్యత్వం, తెలుగు అకాడమీ వారి పరిపాలనా న్యాయ పదకోశం – సలహా సంఘ సభ్యత్వం – 1981 రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన సాంస్కృతిక వ్యవహారాల రాష్ట్ర సలహా మండలి సభ్యత్వం 1981. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ సభ్యత్వం – 1999–2001 నందీ చలన చిత్రాల అవార్డుల కమిటీ సభ్యత్వం కలిగి ఉన్నారు. ఇలాగేనా రాయడం, దిద్దుబాటు , నార్ల వెంకటేశ్వరరావు , మన పాత్రికేయ వెలుగులు, జ్ఞాపకాల వరద, నూరేళ్ళ పత్రికా రచన, తెలుగు పత్రికల పుట్టుక ... తదితర రచనలతో పాటు జర్నలిజం కోర్సు పుస్తకాలు కూడా రాశారు. ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్సిటీ పి.జి.డిప్లొమా విద్యార్థుల కోసం భారత రాజ్యాంగం– డా. బి.ఆర్. అంబేద్కర్, పాఠ్యాంశం, సార్వత్రిక విశ్వ విద్యాలయం వారికోసం పత్రికా చట్టాలు పాఠ్యాంశం రాశారు. అనేక పుస్తకాలకు సంపాదక మండలి సభ్యులుగా (పత్రికా పదకోశం) ఉన్నారు. రేడియో టీవీలలో అనేక ప్రసంగాలు, చర్చా గోష్ఠులు, తదితర కార్యక్రమాలతో బాటు పొలికేక, ప్రజాతంత్ర, తరుణ, కిరీటి వంటి తెలుగు పత్రికలలో, స్కైలైన్ ఇంగ్లీషు దిన పత్రికలో సినిమా శీర్షిక నిర్వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, తిరుపతి మహిళా విశ్వ విద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, జర్నలిజం బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యత్వం కలిగి ఉన్నారు. నిజాన్ని నిర్భయంగా చెప్పటం ఆయన నైజం. తెలుగు దినపత్రికల్లో వస్తున్న భాషా దోషాలను, సంపాదకీయాల్లో దొర్లే గుణదోషాలను ఎత్తి చూపే ఒక శీర్షికను దిద్దుబాటు పేరుతో ఎంవిఆర్ శాస్త్రి సంపాదకత్వంలో నిర్వహించగా, ఆయన నాలుకకు పదును ఎక్కువ కాగా, తమ కలానికీ ఉన్న పదును ఎలాంటిదో చూపారు. 2022 నవంబర్ 3న వరదాచారి ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

**దివంగత పాత్రికేయ దిగ్గజం** వరదాచారికి హర్ష, శ్రీవాత్సవ ఇద్దరు కుమారులు, శుభ, సౌమ్య ఇద్దరు కుమార్తెలు. ధర్మపురి క్షేత్ర వైష్ణవ కుటుంబీకులు సరోజనను వివాహం చేసుకున్న వరదాచారి, తన కుమారునికి మళ్ళీ అదే కుటుంబ సంబంధం అమ్మాయిని కోడలుగా చేసుకోవడం ద్వారా క్షేత్రంతో విడదీయని సంబంధ బాంధవ్యాలు ఏర్పడ్డాయి. అలా సీనియర్ జర్నలిస్ట్ రామచంద్ర మూర్తి ద్వారా వరదాచారిని కలుసుకునే భాగ్యం పురాకృత సుకృతంగా నేను భావిస్తాను.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# హిందీ చిత్ర పరిశ్రమలో అగ్రగామి పృథ్వీరాజ్ - నవంబర్ 3 పృథ్వీ రాజ్ కపూర్ జన్మదినం

భారతీయ థియేటర్ యొక్క మార్గదర్శకుడు మరియు హిందీ చిత్ర పరిశ్రమలో అగ్రగామి అయిన పృథ్వీరాజ్ కపూర్ 1906 లో నవంబర్ 3 న జన్మించారు. పృథ్వీరాజ్ కపూర్ బాలీవుడ్ యొక్క ప్రసిద్ధ కపూర్ కుటుంబానికి పితృస్వామ్యుడు. అతను పాకిస్తాన్లోని లియాల్పూర్ (ఇప్పుడు ఫైసలాబాద్) లో జన్మించాడు. పృథ్వీరాజ్ కపూర్ తన స్వస్థలమైన లిల్లాపూర్ మరియు పెషావర్లలో థియేటర్ ఆర్టిస్ట్ గా తన నటనా వృత్తిని ప్రారంభించాడు. 1928 లో, పృథ్వీరాజ్ తన అత్త నుండి అరువు తెచ్చుకున్న కొంత డబ్బుతో బొంబాయికి (ఇప్పుడు ముంబై) వెళ్లి ఇంపీరియల్ ఫిల్మ్స్ కంపెనీలో చేరాడు. సంస్థలో, అతను సినిమాల్లో చిన్న పాత్రలు చేయడం ప్రారంభించాడు. 1929 లో కపూర్ తన మూడవ చిత్రం సినిమా గర్ల్ లో మొదటి ప్రధాన పాత్రను పొందాడు. దో ధారి తల్వార్ , షేర్-ఎ-అరా బి మరియు ప్రిన్స్ విజయకుమార్ వంటి తొమ్మిది నిశ్శబ్ద చిత్రాలలో పృథ్వీరాజ్ నటించారు. 1931 లో, భారతదేశం యొక్క మొట్టమొదటి టాకీ, ఆలం అరా విడుదలైంది. చారిత్రక చిత్రంలో కపూర్ సహాయక పాత్ర పోషించారు. ప్రఖ్యాత థియేటర్ నటుడిగా, పృథ్వీరాజ్ బ్రిటిష్ ప్లేహౌస్ అయిన గ్రాంట్ ఆండర్సన్ థియేటర్ కంపెనీలో చేరారు. ఏదేమైనా, అతను చేరిన వెంటనే కంపెనీ ఇంగ్లాండ్ కు మారింది. 1946 లో, పృథ్వీరాజ్ కపూర్ పృథ్వీ థియేటర్స్ అనే థియేటర్ సంస్థను స్థాపించారు, పృథ్వీరాజ్ పృథ్వీ థియేటర్లలో పెట్టుబడులు పెట్టారు, ఇది భారతదేశం అంతటా చిరస్మరణీయమైన ప్రదర్శ నలను అందించింది. ఈ నాటకాలు అత్యంత ప్రభావవంతమైనవి మరియు భారత స్వాతంత్ర్య ఉద్యమం మరియు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనడానికి యువతను ప్రేరేపించాయి. 16 సంవత్సరాల ఉనికిలో, థియేటర్ 2,662 ప్రదర్శనలను ప్రదర్శించింది. ఇందులో పృథ్వీరాజ్ ప్రధాన నటుడిగా నటించారు. 1996 లో, థియేటర్ యొక్క గోల్డెన్ జూబ్లీలో, ఇండియన్ పోస్ట్ రెండు రూపాయల పోస్టల్ స్టాంప్‌ను జారీ చేసింది. భారతీయ సినిమా యొక్క 100 సంవత్సరాల సందర్భంగా, అతని పోలికను కలిగి ఉన్న మరొక తపాలా బిళ్ళను ఇండియా పోస్ట్ 3 మే 2013 న విడుదల చేసింది. అతని ప్రసిద్ధ నాటకాల్లో ఒకటైన ఒక ముస్లిం మరియు అతని హిందూ స్నేహితుడి కథ. 13 ఏప్రిల్ 1947 న ప్రారంభమైన "పఠాన్" నాటకం. ఇది ముంబైలో దాదాపు 600 సార్లు వేదికపై ప్రదర్శించ బడింది. 1950 దశాబ్దం చివరి నాటికి, ట్రావెలింగ్ థియేటర్ యొక్క యుగం సినిమా ప్రభావ కారణంగా అంతిమ దశకు చేరుకుంది. క్రమంగా పృథ్వీ థియేటర్ కార్యకలాపాలను నిలిపివేసాడు. తన సొంత కుమారులతో సహా చిత్రనిర్మాతల నుండి అప్పుడప్పుడు ఆఫర్లను అంగీకరించాడు. తన కుమారుడు రాజ్‌తో కలిసి 1951 చిత్రం అవారాలో తన సొంత భార్యను తన ఇంటి నుండి బయటకు నెట్టివేసిన కఠినమైన న్యాయమూర్తిగా కనిపించాడు. తరువాత, పృథ్వీ థియేటర్ ఇండియన్ షేక్స్పియర్ థియేటర్ సంస్థ "షేక్స్పియర్నా" తో విలీనం అయ్యింది. సంస్థ 5 నవంబర్ 1978 న ముంబైలో పృథ్వీ థియేటర్ ప్రారంభోత్సవంతో శాశ్వత గృహాన్ని పొందింది. అతని చిత్రాలలో ఒకటి, కల్ ఆజ్ అవుర్ కల్ , కపూర్ కుటుంబానికి చెందిన మూడు తరాలు – కుమారుడు రాజ్ కపూర్, మనవడు రణధీర్ కపూర్ మరియు పృథ్వీరాజ్. పృథ్వీరాజ్ తండ్రి, దేవాన్ బాషేశ్వర్నాథ్ కపూర్ కూడా రాజ్ కపూర్ చిత్రం అవారాలో అతిథి పాత్రలో నటించారు . ఈ విధంగా, కపూర్ కుటుంబం భారతదేశంలో ఐదు తరాల సినీ కళాకారులను కలిగి ఉన్న ఏకైక కుటుంబంగా మిగిలిపోయింది. ఆలం ఆరా (1931) (భారత మొదటి టాకీ సినిమా)బీ విద్యాపతి (1937)బీ సికందర్ (1941)బీ ఆవారా (1951)బీ ఆనంద్ మఠ్ (1952)బీ పర్దేశీ (1957)బీ మొఘల్ ఎ ఆజం (1960) (అక్బర్ చక్రవర్తి పాత్ర)బీ జిందగీ (1964)బీ ధాకూ మంగళ్‌సింగ్ (1966)బీ హీర్ రాంఝా (1970)బీ కల్ ఆజ్ ఔర్ కల్ (1971)బీ సాక్షాత్కార – (కన్నడ) (1971)బీ తదితరాల్లో భిన్నమైన పాత్రలలో ప్రతిభ కనబరిచిన నటునిగా గుర్తింపు పొందారు. అతను పంజాబీ చిత్రాలలో నానక్ దుఖియా సబ్ సంసార్ (1970) మరియు మేలే మిత్రాన్ దే (1972) లలో కూడా నటించాడు .మొఘల్ ఎ ఆజం (1960)లో అక్బర్ పాత్ర మరువ లేనిది. 1954 లో ఆయనకు సంగీత నాటక అకాడమీ



ఫెలోషిప్ , మరియు 1969 లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డులను ప్రదానం చేసింది. ఎనిమిదేళ్లపాటు నామినేటెడ్ రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. 1972 మే 29న (వయసు 70) మరణించాడు. పృథ్వీరాజ్ కు కుమారులు షంషేర్ రాజ్ (షమ్మీ) మరియు బల్బీర్ రాజ్ (శశి) (వారు ప్రసిద్ధ నటులు మరియు చిత్ర నిర్మాతలుగా మారారు), కుమార్తె ఉర్మిలా సియాల్. 1949– రాష్ట్రపతి మెడల్‌బీ 1954%–% సంగీత నాటక అకాడమీబీ ఫెలోషిప్. (సంగీత నాటక అకాడమీ ద్వారా)బీ 1956 – సంగీత నాటక అకాడమీ అవార్డు (సంగీత నాటక అకాడమీ ద్వారా)బీ 1969– భారత ప్రభుత్వం నుండి పద్మభూషణ్ అవార్డులను అందు కున్నారు. ఆయనకు మరణానంతరం 1971 సంవత్సరానికి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు లభించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పొదుపు.. భవితకు మేలిమలుపు

సిద్దిపేట : నీటి చుక్కను ఒడిసిపడితే భవిష్యత్తుకు మేలు చేస్తుంది.. ధనాన్ని దాచిపెట్టుకుంటే రేపటి తరానికి, ఆపత్కాలంలో పనికొస్తుంది.. అదే పొదుపుగా మాట్లాడితే అందరూ మిత్రులే అవుతారు. ఇంతకన్నా పొదుపు గురించి చెప్పేది ఏముంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఖర్చులను తగ్గించుకుని భవిష్యత్తు అవసరాలకు ఎంతోకొంత మిగుల్చుకోవడం ప్రధానం. నేడు 'ప్రపంచ పొదుపు దినోత్సవం' సందర్భంగా దాని ఆవశ్యకతపై ప్రత్యేక కథనం.

చిన్నతనంలోనే పొదుపు అలవాటు చేస్తే వారి భవితకు ఉపయోగపడుతుంది. కష్టకాలంలో అది ఆదుకుంటుందని పిల్లలకు లు గ్రహించేలా అవగాహన కల్పించాలి. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో విద్యార్థులతో డబ్బు జమ చేయించారు. దీన్ని పునరుద్ధరిస్తే మేలు చేకూర్చినట్లే.

వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం హుసేన్‌పూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు క్రాంతికుమార్ విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ నేర్పించాలన్న ఉద్దేశంతో అడుగేశారు. అమ్మానాన్నలు ఇచ్చే డబ్బును ఎలా ఖర్చు చేయాలో అవగాహన కల్పిస్తున్నారు. బడిలో మొత్తం 47 మంది చదువుకుంటున్నారు. వీరిలో 30 మందికి పైగా పొదుపు బాట పట్టారు. నిత్యం వారిచ్చే సొమ్మును నిజాయతీ పెట్టెలో వేస్తారు. ఉపాధ్యాయులు ఆ లెక్కలను పక్కాగా రాస్తున్నారు. వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఖర్చు చేస్తున్నారు. పిల్లలకు అవసరమైనప్పుడు ఇస్తుంటారు. దీన్ని అన్ని పాఠశాలల్లో అమలు చేస్తే రేపటి పౌరులకు కష్టసమయాల్లో పొదుపు ఎంత అవసరమో గుర్తించగలరు.

**అందరికీ అవసరమే.. చైతన్యంతో అడుగేసి..**

పొదుపు అనగానే మహిళా సంఘాలు గుర్తుకొస్తాయి. ఇది అన్ని వర్గాలకు అవసరమే. ప్రతి నెలా ఆదాయంలో కొంత దాచుకుంటే భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని నిపుణుల సూచన. దీన్ని అందరూ పాటించాలి. సిద్దిపేట జిల్లాలో పురుషులు సంఘంగా ఏర్పడి ఇదే బాటలో నడుస్తుండటం విశేషం.

సిద్దిపేట, రాజగోపాలపేట, కోహెడ, హుస్నాబాద్‌లో చైతన్య పురుషుల పొదుపు సమితులు కొనసాగుతున్నాయి. 1999లో ఏర్పాటయ్యాయి. 48 గ్రామాల నుంచి 20 వేల మంది సభ్యులున్నారు. ప్రతి నెలా రూ.100 చొప్పున జమ చేస్తున్నారు. రూ.5 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు రుణంగా రూపాయి వడ్డీపై అందిస్తారు. ఏటా రూ.10 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతున్నాయి. నాలుగు సమితులకు రూ.30 కోట్లు సొంత నిధులు కలిగి ఉన్నాయి. పొదుపు చేసింది రూ.20 కోట్లు కాగా, బోనస్ రూ.10 కోట్లు. ప్రతి నెలా పాలకవర్గ సభ్యులతో సమావేశం నిర్వహిస్తూ రుణాలు మంజూరు చేస్తున్నారు. ఆన్‌లైన్ సేవలకు పెద్దపీట వేస్తున్నారు. వీటి స్ఫూర్తిగా మిగతా మూడు జిల్లాల్లోనూ అడుగేయాలి.

**ఊరి బాగుకు కృషి సమాజ సేవకు ఊతం..**

ఒకరు చేసే పొదుపు సమాజానికి ఉపయోగపడేలా చేస్తే మరింత మేలు చేకూర్చడం తథ్యం. సామాజిక సేవకు ఇదే ఊతమిస్తుంది. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో యువజన సంఘాల సభ్యులు తాము పొదుపు చేసే డబ్బు నుంచి వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. దీన్ని అందరూ అందిపుచ్చుకోవాలి. సంగారెడ్డి జిల్లా నస్తీపూర్‌లోని గ్రామైక్య సంఘం ఆర్థిక అభివృద్ధి వైపు అడుగులేస్తూనే సమాజసేవలో పాలుపంచుకుంటున్నారు. సమష్టి నిర్ణయాలతో ఊరి బాగుకు ముందుకు సాగుతున్నారు. సొంత భవనాన్ని నిర్మించుకున్నారు. ఆడపిల్ల పుడితే ఊరంతా పండగ నిర్వహిస్తున్నారు. యువకులు వరకట్నం తీసుకోకుండా వివాహాలు చేసుకునేలా చైతన్యం తీసుకొస్తున్నారు. గ్రామంలో మద్య నిషేధం అమలుచేస్తున్నారు. వయోవృద్ధులకు ఆశ్రయం ఇస్తున్నారు. అనాథలు మరణిస్తే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఇదే కదా సమాజానికి కావాల్సింది. ఇలాంటి పొదుపు సంఘం ఊరికి ఒక్కటుంటే మార్పు తథ్యం.

**ఉపాధిగా మలుచుకొని.. సొంతంగా నిలదొక్కుకుంటూ..**

గ్రామాల్లో కొందరు మహిళలు బృందంగా పొదుపు చేపట్టి రుణాలతో వ్యాపారాలు నిర్వహిస్తూ సొంతంగా నిలదొక్కుకుంటున్నారు. ప్రభుత్వం వీరికి పెద్దపీట వేస్తోంది. ఇందిరాశక్తి పథకంతో అండగా నిలుస్తోంది. సిద్దిపేట జిల్లా ఇర్కోడుకు చెందిన సంఘం దేశ, విదేశాల్లోనూ వ్యాపారం చేసే స్థాయికి చేరడం విశేషం. శిక్షణలో నేర్చుకున్న అంశాలను వ్యాపారంలో రాణించేందుకు ఉపయోగించుకుంటున్నారు సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలకు చెందిన మాతృమూర్తి సంఘానికి చెందిన సభ్యులు. వీరు కాయర్ బోర్డు ఆధ్వర్యంలో కొబ్బరిపీచుతో వివిధ రకాల వస్తువుల తయారీ శిక్షణ పొందారు. దీని ద్వారా ఉపాధి పొందేందుకు అడుగేశారు. కొబ్బరి పీచుతో మొక్కలను పెంచడానికి తొట్లు తయారు చేశారు. ఇంటి అలంకరణకు ఉపయోగపడే వివిధ వస్తువులు రూపొందిస్తున్నారు. వాటిని పలు సమావేశాల్లో ప్రదర్శించి ఆకట్టుకుంటున్నారు. ఇదే వారికి ఉపాధి కల్పిస్తోంది. సంఘం సభ్యురాలు నిర్మల సంఘం నుంచి రూ.లక్ష రుణం తీసుకొని ఈ దిశగా అడుగేశారు.

# తగ్గని దగ్గు!

పెద్దపల్లి: అస్వస్థతకు గురైన ముత్తారం కేజీబీవీ విద్యార్థుల్లో ముగ్గురిని దగ్గు తీవ్రత తగ్గకపోవడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తీవ్రమైన దగ్గుతో 53 మంది విద్యార్థినిలురాత్రి పెద్దపల్లి ఆస్పత్రిలో చేరగా.. ఆరోగ్యం కుదుట పడటంతో సోమవారం 39 మందిని, 6 గురిని డిశ్చార్జి చేశారు. 8 మందిలో నలుగురికి దగ్గు తీవ్రత తగ్గకపోవడంతో కరీంన గర్‌కు తరలించారు. అక్కడ కూడా ఆరోగ్య పరిస్థితి మెరుగు పడకపోవ డంతో మంత్రి శ్రీధర్‌బాబు సూచన మేరకు రేవతి, సునీత, రక్షితలను హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించినట్లు జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్, డీసీహెచ్ శ్రీధర్‌లు తెలిపారు. ఈ ముగ్గురితో పాటు కరీంనగర్‌లో చికిత్స పొందుతున్న ఆరాధ్య, పెద్దపల్లిలో చికిత్స పొందుతున్న నలుగురి ఆరోగ్యంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.

**కారణాలేమిటి?**ముత్తారం కేజీబీవీ సమీపంలో పంచాయతీ డంపింగ్‌యార్డు ఉండటం, తరచూ లీకవుతున్న పాఠశాల సెప్టిక్ ట్యాంక్ నుంచి వాసన కారణంగానే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు అధికారులు చెబుతున్నారు. డంపింగ్‌యార్డు కొనేళ్ల నుంచి ఉంటుండగా.. ఎప్పుడు ఇలాంటి ఘటనలు జరగలేదు. డంపింగ్‌యార్డు వల్లే అయితే 300 మంది విద్యార్థుల్లో కొందరు మాత్రమే అస్వస్థతకు గురవడం అనుమానాలకు తావిస్తోంది. విద్యార్థుల నుంచి రక్త నమూనాలు సేకరించిన అధికారులు సాధారణ పరీక్షలే చేయించారు. దగ్గుకు కారణం.. పాఠశాల ఆవరణలో గడ్డి మందు పిచికారీ చేసిన పిచ్చిమొక్కలను విద్యార్థులచే ఎందుకు తొలగించారనే అంశాలపై విచారణ చేయకపోవడం సందేహాలకు ఆస్కారమిస్తుంది.

# సొంతింటి కల నెరవేరేనా!

కరీంనగర్: దీపావళి కానుకగా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో ఉమ్మడి జిల్లాలోని ఆశావహుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఏళ్ల తరబడి గూడు కోసం ఎదురుచూస్తున్న ఎందరికో ఈ నిర్ణయం ఆశలు రేకెత్తిస్తోంది. రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం మేరకు పండుగ తర్వాత ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. సంబంధిత మార్గదర్శకాల కోసం జిల్లా అధికార యంత్రాంగం వేచి చూస్తోంది. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల పరిధిలో చాలా మంది పేదలు సొంతింటి కోసం నిరీక్షిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రెండు పడక గదుల ఇళ్ల మంజూరుపై ఆశలు కల్పించినా నెరవేరలేదు. ఎన్నికల సమయంలో ఇందిరమ్మ ఇళ్ల పేరిట కాంగ్రెస్ హామీ ఇవ్వడంతో ప్రస్తుత ప్రభుత్వంపై గంపెడాశలు పెట్టుకున్నారు. గతేడాది డిసెంబరు 7న అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ దాదాపు 11 నెలల తరువాత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక దిశగా కసరత్తు ప్రారంభించడంతో అర్హులైన పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

**తొలి విడతలో 45,500**

ఇందిరమ్మ పథకం కింద తొలి విడతలో ప్రతి శాసనసభ నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు మంజూరు చేయనున్నారు. ఈ లెక్కన 13 స్థానాల పరిధిలో మొత్తం 45,500 గృహాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కులమతాలకతీతంగా నిరుపేదలను ఎంపిక చేయాలని భావిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా 1218 పంచాయతీలతో పాటు కరీంనగర్, రామగుండం నగరపాలక సంస్థలు, మరో 14 పురపాలికల్లో ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికి 4-5 వేల ఇళ్లు మంజూరు చేసినా అందులో సగం కూడా నిర్మించలేదు. స్థలాలు దొరకకపోవడం, సామూహికంగా ఒకే చోట నిర్మిస్తున్నవి పూర్తి కాకపోవడం, గుత్తేదారు మధ్యలో చేతులెత్తేయడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయి. దీంతో లబ్ధిదారుల ఎంపికకు ముందే నిర్మాణాల్లో తీవ్ర జాప్యం జరిగింది. గతానికి భిన్నంగా ఈ సారి ఇందిరమ్మ ఇళ్లు త్వరితగతిన నిర్మించి లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. పూర్తి పారదర్శకంగా ప్రక్రియను కొనసాగించేలా కసరత్తు చేస్తోంది.

**కమిటీల ఏర్పాటులో ఉత్కంఠ** ఇళ్ల నిర్మాణం, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో గ్రామాలు, డివిజన్లు, వార్డుల్లో ఏర్పాటు చేయనున్న ఇందిరమ్మ కమిటీలే కీలకంగా మారనున్నాయి. ఇప్పటికే ఊరూరా కమిటీలు ఏర్పాటు చేసి కలెక్టరేట్‌లకు పంపించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదం తర్వాత అధికారికంగా ప్రకటించనున్నారు. భారాస ఎమ్మెల్యేలున్న చోట ఎంపిక ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి. కమిటీల కోసం ఒకటికన్నా ఎక్కువ ప్రతిపాదనలు రావడంతో ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఏకాభిప్రాయం కుదిరిన వాటికి ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదం తెలిపారనే చర్చ జరుగుతుండగా, కొన్నింటి విషయంలో ఎటూ తేల్చలేకపోతున్నారనే మాటలు అధికారుల నుంచి వినిపిస్తున్నాయి. ఈ నెలాఖరులోగా కమిటీలకు ఆమోద ముద్ర వేసి వాటి లబ్ధిదారుల ఎంపికకు సన్నాహాలు చేస్తున్నారు. త్వరలో గ్రామసభలు నిర్వహించి అర్హులను గుర్తించనున్నారు.

# ఇక్కడ అధ్వానం.. పక్కన అద్దంలా



ముస్తాబాద్: రెండు జిల్లాలను అనుసంధానం చేసే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. అయినా పట్టించుకున్న నాథుడు లేడు. జిల్లా పరిధిలో ఉన్న ఇదే రహదారి గుంతలు పడి రవాణాకు ఇబ్బందికరంగా మారగా, పక్క జిల్లా పరిధిలో మాత్రం అద్దంలా మారింది. అక్కడి నేతలు ప్రజల కల నెరవేర్చినా, ఇక్కడి ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో రవాణా కష్టాలు తీరలేదు. ముస్తాబాద్ మండల కేంద్రం నుంచి దుబ్బాక వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉంది. రోడ్డుకు మోక్షం ఎప్పుడు వస్తుందోనని ఇరు జిల్లాల వాహనదారులు, ప్రజలు ఎదురు చూస్తున్నారు. ముస్తాబాద్-దుబ్బాక రోడ్డు కోసం అప్పటి ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి నివేదించారు. ఎట్టకేలకు అప్పటి మంత్రి కేటీఆర్ చొరవతో ముస్తాబాద్ నుంచి మోహినికుంట మీదుగా దుబ్బాక వరకు 2023 జనవరిలో రహదారి మంజూరు చేశారు.

ముస్తాబాద్ నుంచి దుబ్బాక వరకు 14 కిలోమీటర్లకుగాను రూ. 26 కోట్లు కేటాయించారు. దుబ్బాక నుంచి రాజక్కపేట శివారు వరకు 8.4 కిలోమీటర్లకు గాను రూ. 12 కోట్లు విడుదల కాగా పనులు ప్రారంభించి పూర్తి చేశారు. ముస్తాబాద్ నుంచి మోహినికుంట శివారు వరకు 5.6 కిలో మీటర్ల రహదారికి గాను రూ. 14 కోట్లు కేటాయించారు. 2023 జనవరిలో నిధులు మంజూరు కాగా, 2024 ఫిబ్రవరిలో వెనక్కి మళ్లాయి.

భారాస హయాంలో నిధులు రాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు అయ్యాయి. పనులు చేపట్టకపోవడంతో ఈ సమస్య నెలకొంది. మళ్లీ నిధుల కోసం కృషి చేసిన నాథుడు కనిపించడం లేదు. దీంతో రహదారి పనులకు ఎప్పుడు మోక్షం కలుగుతుందో తెలియని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని నిధుల కోసం కృషి చేయాలని రెండు జిల్లాల ప్రజలు కోరుతున్నారు. ప్రతి చిన్న పనికీ మండల కేంద్రానికి రావాలి మాది సరిహద్దు గ్రామం. చిన్న గ్రామం కావడంతో ప్రతి పనికీ, నిత్యావసర వస్తువుల కోసం మండల కేంద్రానికి రావాలి. మండల కేంద్రం నుంచి మా గ్రామ శివారు వరకు రహదారి బాగాలేదు. రాత్రనక, పగలనక మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తాం. రాత్రి వేళలో వాహనదారులు రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. భారాస హయాంలో నిధులు వచ్చాయి. పనులు చేపట్టకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. అప్పుడే పనులు ప్రారంభిస్తే లక్ష్యం నెరవేరేది.
మేర్గు సతీశ్‌గౌడ్, మోహినికుంట

**ముస్తాబాద్‌కు రావాలంటే భయమేస్తోంది**

మాది సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేట. జిల్లా సరిహద్దు గ్రామం. దుబ్బాక నుంచి రాజక్కపేట వరకు రోడ్డు పూర్తి చేశారు. బాగానే ఉంది. ముస్తాబాద్ రావాలంటే భయమేస్తుంది. మా బంధువులంతా ఈ మండలంలో ఉండటంతో ఈ మార్గంలో రాక తప్పడం లేదు. ద్విచక్రవాహనంపై వస్తుంటే గుంతలతో ఒళ్లు గుల్లవుతుంది. ఈ రోడ్డుకు మోక్షమెప్పుడు వస్తుందో, వాహనదారుల కష్టాలు ఎప్పుడు తీరుతాయో ఆ పాలకులకే తెలియాలి. పాతూరి బాల్‌రెడ్డి, ద్విచక్రవాహనదారుడు, రాజక్కపేట

**నడుమునొప్పి వస్తోంది**

మాది సిద్దిపేట. ముస్తాబాద్ నుంచి దుబ్బాక వెళ్లే రోడ్డు దాదాపు అయిదు కిలోమీటర్ల వరకు అధ్వానంగా ఉంది. ముస్తాబాద్ మండలం శివారు నుంచి దుబ్బాక వరకు రోడ్డు బాగుంది. ఈ రోడ్డు వెంట రెండు సార్లు నడిపితే చాలు నడుము నొప్పి వస్తోంది. ఎదురుగా వచ్చే వాహనానికి సైడ్ ఇవ్వాలంటే భయంగా ఉంది. ఒక వాహనం వెళ్తే, మరో వాహనం వెళ్లని పరిస్థితి నెలకొంది. భయంగా వాహనాలు నడపాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి రెండు వరుసల రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలి. ముత్తినేని రాజు, డీసీఎం వ్యాన్ డ్రైవర్

# కాయ్ రాజా కాయ్.. 'క్యాసినో ఆడేయ్'!



హైదరాబాద్ : కాలాపత్తర్‌కు చెందిన ఖదీర్‌పై మూడు కమిషనరేట్ల పరిధిలో గ్యాంబ్లింగ్ కేసులున్నాయి. తరచూ ప్రాంతాలు మార్చుతూ పోలీసులను ఏమార్చుతుంటాడు. తాజాగా బావమరిది ఇంటినే జూద గృహంగా మార్చాడు. దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడుల్లో పట్టుబడ్డాడు. 22 మందిపై కేసులు నమోదు చేశారు. రూ.46.55 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు ఖదీర్ గోవా, శ్రీలంక, నేపాల్‌లో క్యాసినో కేంద్రాలకు ఏజెంట్. దేశ, విదేశాల నుంచి అమ్మాయిలు, మద్యం రుచులతో ఆహ్వానం పలుకుతున్నారు. ఇటీవల నగరంలోని రెండు హోటళ్లలో ప్రైవేటు పార్టీల ముసుగులో క్యాసినో నిర్వహించారు.

**అక్కడ ఏజెంట్లు.. ఇక్కడ నిర్వాహకులు**

నగరంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల నుంచి సామాన్యుల వరకూ చాలామంది జూదంలో అదృష్టం పరీక్షించుకోవాలనుకుంటారు. సరదాగా మొదలైన అలవాటుకు బానిసలై రూ.లక్షలు కుమ్మరించేందుకు సిద్ధపడతారు. బంజారాహిల్స్‌లోని కార్పొరేట్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగి జూదం కోసం అడ్డదారి తొక్కాడు. సంస్థకు జమచేయాల్సిన రూ.25 లక్షలు క్యాసినోలో నష్టపోయాడు. విషయం బయటపడితే కుమారుడి జీవితం పాడవుతుందనే ఉద్దేశంతో తల్లిదండ్రులు ఆ సొమ్ము చెల్లించి అతడిని కాపాడుకున్నారు. నగరం నుంచి జూద ప్రియులను గోవా, కొలంబో తీసుకెళ్లేందుకు ఇక్కడ పదుల సంఖ్యలో ఏజెంట్లున్నారు. వీరికి ముందస్తుగా రూ.లక్ష చెల్లిస్తే అంతే విలువైన క్యాసినో కాయిన్‌లను అందజేస్తారు. విమాన టిక్కెట్లు సమకూర్చటం నుంచి.. దిగగానే కారు, నక్షత్రాల హోటల్, ఆహారం, మద్యం ఇలా అంతా క్యాసినో నిర్వాహకులే చూసుకుంటారు. ఇక్కడి నుంచి ఆటగాళ్లను పంపినందుకు క్యాసినో నిర్వాహకులు ఏజెంట్లకు పెద్దఎత్తున కమీషన్ ఇస్తారు. క్యాసినో కేంద్రాల నిర్వాహకులకు తెలుగు రాష్ట్రాల్లో చాలామంది మిత్రులున్నారు. అంతదూరం వెళ్లలేని వారికి క్యాసినో ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారు.

**డబ్బుంటే చాలు.. దగ్గరికే**కొందరు ఏజెంట్లు.. హోటళ్లు, ఫామ్‌హౌస్‌లను ప్రైవేటు పార్టీల కోసం అద్దెకు తీసుకుంటున్నారు. మూడ్రోజులపాటు అక్కడ విందు, వినోద కార్యక్రమాలు. జూదశాలలు నిర్వహిస్తున్నారు. ఇటీవల మొయినాబాద్ సమీపంలోని ఫామ్‌హౌస్‌లో రూ.2.5 కోట్ల మేర పందేలు జరిగినట్టు సమాచారం. రాష్ట్ర సరిహద్దులోని కర్ణాటకలో క్యాసినో నిర్వాహకుడు ఇటీవల మేడ్చల్ పరిధిలోని ఒక పోలీసు అధికారిని కలిసి క్యాసినో ఆడుకొనేందుకు అనుమతి తీసుకున్నట్టు సమాచారం.. దీనికోసం అనువైన ఫాంహౌస్ కోసం వెతుకుతున్నట్టు తెలుస్తోంది. ఇతడి ఆధ్వర్యంలోనే కొద్దిరోజుల క్రితం నగరంలో క్యాసినో ఆడించినట్లు సమాచారం. అనుమతి ఉన్న వారిని మాత్రమే ఈ క్యాసినోకు అనుమతించారు. బిగ్ డాడీ టేబుల్‌లో ఆడాలంటే పెద్దమొత్తంలో డబ్బులు కట్టాలి. దానికి అనుగుణంగా అక్కడ క్యాసినో కాయిన్స్ ఇస్తారు. నగరంలో బిగ్‌డాడీ టేబుల్‌కే ఫుల్ డిమాండ్ ఉంటుందని నగరానికి చెందిన ఏజెంట్ తెలిపారు.

# పశుజాతి వృద్ధి.. క్షీర సిద్ధి

మెదక్ : రైతులు ఆర్థిక వృద్ధి సాధించేందుకు పంటల సాగుతో పాటు పాడిపరిశ్రమ వైపు మొగ్గు చూపుతున్నారు. వీరిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా పశుజాతి వృద్ధికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకాన్ని తీసుకొచ్చింది. కృత్రిమ గర్భధారణ(ఏఐ) ద్వారా పశువులకు ఎక్కువగా ఆడ దూడలే పుట్టిస్తున్నారు. ఈ పథకంలో భాగంగా గోపాలమిత్రలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో పశుగణాభివృద్ధి సంస్థ(డీఎల్‌డీఏ) గేదెలకు కృత్రిమ గర్భధారణలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయి గుర్తింపు డీఎల్‌డీఏ ఆధ్వర్యంలో జూన్ నుంచి ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పథకాన్ని అమలు చేస్తున్నారు. కృత్రిమ గర్భధారణ విధానంలో 90 శాతం ఆడ దూడలే పుట్టే అవకాశం ఉంది. ఆడ దూడల సంఖ్య పెరిగితే పాల దిగుబడి వృద్ధి చెంది పశు పోషకులకు ఆదాయం సమకూరుతుంది. ఇప్పటి వరకు మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో కలిపి మొత్తం 1432 గేదెలకు కృత్రిమ



గర్భధారణ చేశారు. సాంకేతిక సమస్యల కారణంతో వీటిలో 1004 మాత్రమే అంతర్జాలంలో నమోదు చేశారు. కృత్రిమ గర్భధారణలో ఆన్‌లైన్ పరంగా ఉమ్మడి మెదక్ జిల్లా రాష్ట్రంలో ద్వితీయ స్థానం, ఆఫ్‌లైన్ పరంగా ప్రథమ స్థానంలో ఉంది.

మూడేళ్లకే పాల దిగుబడి

ఈ పథకంలో భాగంగా పుట్టిన ఆడ దూడ 18 నెలలకే చూడికి వస్తుంది. మూడేళ్లకే మరో దూడకు జన్మనిస్తుంది. దీంతో రైతుకు కేవలం మూడేళ్లకే పాల దిగుబడి ప్రారంభమై ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం కలుగుతుంది. ఈ పథకానికి జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ నోడల్ మానిటరింగ్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది.

సద్వినియోగం చేసుకోవాలి

డీఎల్‌డీఏ పథకం ద్వారా మేలు జాతి దూడలు జన్మిస్తున్నాయి. ఇలాంటి వాటిని బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాలంటే అధిక వ్యయమవుతుంది. ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన గేదెలు ఇక్కడి వాతావరణానికి సర్దుబాటు కాకపోవడంతో పాల దిగుబడి తగ్గుతుంది. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశంతో రైతులు కేవలం రూ.250 వ్యయంతో గేదెకు కృత్రిమ గర్భధారణ చేయించవచ్చు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి. - డాక్టర్ రాంజీ, సీఈవో(డీఎల్‌డీఏ), ఉమ్మడి మెదక్

# వెలవెలబోతున్న విపణులు

జహీరాబాద్: ఆహార, పప్పు ధాన్యాలు, తృణధాన్యాల లాంటి సంప్రదాయ పంటల సాగులో గతంలో ఉమ్మడి మెదక్ జిల్లా మేటిగా ఉండేది. ఎక్కువ మంది రైతులు పత్తి, సోయాబీన్ లాంటి వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతుండటంతో గత మూడేళ్లుగా సంప్రదాయ పంటల సాగు క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఈ ఏడాది మరింత తగ్గింది. ఉన్న కాస్త పంటలు కోతకు వచ్చినప్పటికీ వరుసగా కురుస్తున్న వర్షాలతో.. ఆ పంటలు దెబ్బతిన్నాయి. దిగుబడులు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. ఏటా వినాయక చవితి నుంచి దసరా, దీపావళి వరకు ఆయా పంటల కోతలు, దిగుబడులతో గ్రామాల్లో సందడి ఉండేది. ధాన్యం బస్తాలు, అమ్మకం దారులు, కొనుగోలు దారులతో విపణులు కిటకిటలాడేవి. ఇప్పుడు ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ఆ పరిస్థితి కనిపించడం లేదు.

ఆహార ఉత్పత్తుల కొరత

సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్, అందోలు నియోజకవర్గాల్లో ఎక్కువ మంది రైతులు వానాకాలం సీజన్‌లో ప్రధానంగా పెసర, మినుము, కందులు, జొన్నలు, మొక్కజొన్న తదితర సంప్రదాయ పంటలు వేస్తుంటారు. సెప్టెంబరు రెండో వారం నుంచి అక్టోబరు మొదటి వారం వరకు పెసర, మినుము పంటలు కోతలు వస్తుంటాయి. అక్టోబరు నెలాఖరు వరకు సోయాబీన్, మొక్కజొన్న ఉత్పత్తులు చేతికి వస్తుంటాయి. దాదాపు నెలన్నరగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆయా పంటలు తడిసి.. 30శాతం దిగుబడులయినా రావడం లేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క జహీరాబాద్ విపణికి గతంలో రోజుకు 4 వేల నుంచి 5వేల బస్తాల దిగుబడులు వివిధ పంటలకు సంబంధించి వచ్చేవి. దీంతో కొనుగోళ్లు, తూకాలతో అర్ధరాత్రి వరకు సందడి ఉండేది. ప్రస్తుతం రోజుకు 500 బస్తాలైనా రావడం లేదంటే పరిస్థితిని అంచనా వేయవచ్చు.

# గృహ ప్రవేశాలు ఎప్పుడు..!

నర్సాపూర్: నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్మాణం పూర్తయిన రెండు పడక పూర్తయినా పంపిణీలో తీవ్ర జాప్యంల ఇళ్లకు లబ్ధిదారుల ను ఎంపిక చేసి, పంపిణీ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో అర్హులైన పేదల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. పూర్తయ్యి ఏళ్లు గడుస్తున్నా.. నిర్వహణ లేక అవి అధ్వానంగా మారాయి. అయినా అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

పాడైపోతున్నా.. పట్టింపేది..

సొంతంగా స్థలం ఉన్నవారికి ఇళ్లు నిర్మించుకునేందుకు రుణం అందిస్తామని ప్రస్తుత ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇందుకు సంబంధించి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇళ్ల సంగతి ఏంటనేది ఇంకా స్పష్టత రావడం లేదు. దీంతో ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా పేదలకు పంపిణీ చేయలేని దుస్థితి నెలకొంది. ఇళ్లు లేని నిరుపేదలు మాత్రం ఆశగా ఎదురు చూస్తున్నారు. పూర్తయిన ఇళ్లను సైతం పంపిణీ చేయకపోవడంతో పేదల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. పట్టణంలో వెల్దుర్తి వెళ్లే మార్గంలో ఏఎంసీకి ఎదురుగా నిర్మిస్తున్న 256 ఇళ్లు పూర్తయ్యాయి. కిటికీలకు అద్దాలు అమర్చడం, విద్యుదీకరణ, రంగులు వేయడం వంటి చిన్న పనులు పూర్తి చేస్తే పంపిణీ చేయవచ్చు. గుత్తేదారుకు రూ.35లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. వాటిని చెల్లిస్తేనే మిగతా పనులు పూర్తిచేస్తానని గుత్తేదారు నిలిపివేశారు.

వివిధ దశల్లో నిలిచిన 248 ఇళ్లు..

నర్సాపూర్‌లో ఏఎంసీ వెనక భాగంలో నిర్మాణంలో ఉన్న మరో 248 ఇళ్ల పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. వీటిని పూర్తి చేయడానికి జిల్లా అధికారులు ఎన్నో గడువులు విధించగా అవికాస్తా దాటిపోయాయి. గుత్తేదారుకు రూ.కోటిన్నరకు పైగా బిల్లులు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. బిల్లులు చెల్లిస్తేనే అతను పనులు చేస్తానని అంటున్నారని తెలిపారు.

ఐదు వేల దరఖాస్తులు నర్సాపూర్‌లో గృహాల కోసం ఐదువేల మంది వరకు దరఖాస్తు చేసుకు న్నారు. వాటిని వార్డుల వారీగా విభజించి రెవెన్యూ సిబ్బంది విచారణ చేపట్టారు. కొంతమంది అర్హులను ఎంపిక చేశారు. ఇది జరిగి ఏళ్లు గడుస్తున్నా ఎలాంటి చర్యలు లేవు. పూర్తయిన ఇళ్లను పేదలకు పంచాలని అన్ని పార్టీల నాయకులతో పాటు పురపాలిక సాధారణ సమావేశంలోనూ తీర్మానించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే సునీతారెడ్డిలకు పుర అధ్యక్షుడు వినతి పత్రాలు ఇచ్చారు. పీఆర్ డీఈ రాధికాలక్ష్మీ వద్ద ప్రస్తావించగా పనులు చేసిన గుత్తేదార్లకు బిల్లులు రాకపోవడంతో చిన్నచిన్న పనులు సైతం పూర్తిచేయడం లేదు. బిల్లులు చెల్లిస్తేనే పనులు పూర్తయ్యే అవకాశం ఉందని అన్నారు.

# మోకిల.. ముందుకెలా?

హైదరాబాద్ : అత్యంత ఖరీదైన మోకిల లేఅవుట్‌లో వసతుల కల్పనకు కొత్త చిక్కులు ఎదురవుతున్నాయి. అసైనీలకు కేటాయించిన ప్లాట్ల అభివృద్ధికి సమస్యలు తలెత్తడంతో వారంతా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీంతో మొత్తం లేఅవుట్ అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతోంది. తొలుత తమ సంగతి తేల్చాలని అసైనీలు పట్టుబడుతుండటంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ఈ లేఅవుట్ వ్యవహారం ప్రభుత్వం దృష్టికి వెళ్లింది.

**రైతుల నుంచి 165 ఎకరాలు..**

మోకిల వద్ద గతంలో హెచ్ఎండీఏ 165 ఎకరాల్లో లేఅవుట్ తీర్చిదిద్దింది. అసైన్ భూమి కావడంతో తొలుత ఆయా రైతులతో ఒప్పందం కుదుర్చుకుంది. వారినుంచి భూమి సమీకరించి అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో ప్రతి ఎకరానికి 600 గజాలు కేటాయించేందుకు హెచ్ఎండీఏ నిర్ణయించడంతో రైతులంతా ముందుకొచ్చి భూమి అప్పగించారు.



హెచ్ఎండీఏ వాటా ప్లాట్లను ఆన్‌లైన్ ద్వారా గతేడాది విక్రయాలు చేపట్టింది. తొలుత 50 ప్లాట్లను వేలం వేయగా అనూహ్య స్పందన వచ్చింది. ఇటీవలే రూ.50 కోట్లతో ఈ లేఅవుట్‌లో మౌలిక వసతుల కల్పనకు హెచ్ఎండీఏ శ్రీకారం చుట్టింది.

**రిజిస్ట్రేషన్‌కు ఆటంకంతో...**

వేలంలో ప్లాట్లు దక్కించుకున్న వారు భవనాలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి సిద్ధమవుతున్నారు. అయితే అసైనీలకు కేటాయించిన భూమికి సంబంధించి ఇప్పటికే హెచ్ఎండీఏ ధ్రువీకరణపత్రం అందించింది. బ్యాంకు నుంచి రుణాలు తెచ్చుకోవాలంటే ఆ ధ్రువీకరణ సరిపోదంటున్నారు. ప్లాటు రిజిస్ట్రేషన్ అయినప్పుడు మాత్రమే ఆ సేల్‌డీడ్‌తో బ్యాంకుల రుణం తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. మరోవైపు అసైనీల పేరుతో ఆయా ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాలంటే స్టాంపు డ్యూటీ, ఇతర ఛార్జీలు రూ. లక్షల్లో అవుతుంది. తమ నుంచి భూమి తీసుకున్నందుకు హెచ్ఎండీఏనే ఛార్జీలు భరించి రిజిస్ట్రేషన్ చేయాలని వారంతా కోరుతున్నారు. ఈ విషయాన్ని హెచ్ఎండీఏ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యతో మౌలిక వసతుల కల్పన పనులు వేగంగా సాగడంలేదు.

# చదువరులకు వరాలు

హైదరాబాద్: కొత్త గ్రంథాలయాల నిర్మాణాల పనులు వడివడిగా సాగుతున్నాయి. గతేడాది జనవరిలో రూ.17 కోట్లతో 13 నూతన భవనాలు నిర్మించడంతోపాటు 33 వాటిల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసే దిశగా పనులు చేపట్టగా 2 నెలల్లో ఇవి పాఠకులకు అందుబాటులోకి రానున్నాయి.

**కొత్త భవనాలు ఇక్కడే..**

ఆగాపురా, అజంపురా, బాకారం, బతుకమ్మకుంట, ఎల్ఐసీ కాలనీ, దూద్‌బౌలీ, మైసారం, మొఘల్‌పురా, రుప్‌లాల్‌బజార్, షేక్‌పేట్, రామ్‌గోపాల్‌పేట్, ఉప్పుగూడ, సుల్తాన్‌షాహీ.

బతుకమ్మకుంటలో, ఓల్డ్ గోల్కొండ ప్రాంతాల్లో నిర్మించే గ్రంథాలయాలకు జిల్లా కలెక్టరేట్లు ఇప్పటికే భూమి కేటాయించాయి. బతుకమ్మకుంటలో రూ.84లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టగా తుదిదశకు చేరుకున్నాయి. మరోవైపు ఆగాపురా, బాకారం, ఎల్ఐసీ కాలనీ, సుల్తాన్‌షాహీ ప్రాంతాల్లో పురాతన భవనాలను అధికారులు కూల్చేసి కొత్త నిర్మాణాలు చేపట్టారు. తెలంగాణ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతిపాదనలు సిద్ధం చేసి నిర్మాణ పనులను




పర్యవేక్షిస్తోంది. అశోక్‌నగర్‌లోని నగర కేంద్ర గ్రంథాలయం కూడా ప్రస్తుతం నవీకరణ దిశగా అడుగులు వేస్తోంది. వేగవంతంగా అంతర్జాలం, పోటీ పరీక్షలకు అవసరమైన అన్నీ మెటీరియళ్ల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

**మరమ్మతులు చేస్తున్నవి..**

అడిక్‌మెట్, బోయిగూడ, భోళాశంకర్ మక్తా, సిటీ సెంట్రల్ లైబ్రరీ, ఈదీ బజార్, ఇసామియా బజార్, ఫిరోజ్‌గాంధీ పార్క్, గోల్కొండ, గౌలిగూడ, గన్‌ఫౌండ్రీ, హిందీనగర్, జంగమ్మెట్, కాచిగూడ, కట్టెల్‌గూడ, కవాడిగూడ, ఖైరతాబాద్, మలక్‌పేట్, మంగళ్‌హాట్, మెట్టుగూడ, మీరాలం మండి, ముసారాంబాగ్, ఓల్డ్‌మలక్‌పేట్, రహ్మత్‌నగర్, రామ్‌నగర్, సనత్‌నగర్, పూల్‌బాగ్, నల్లకుంట, ఓమ్‌నగర్, తిలక్‌నగర్, తకరా బస్తీ, విజయ్‌నగర్‌కాలనీ, యాకుత్‌పురా ప్రాంతాల్లో పునరుద్ధరణ పనులు చేపట్టారు.

# కమ్యూనిటీల్లో విద్యుత్తు వాడకం పైపైకి

హైదరాబాద్: ఆధునిక జీవనశైలికి నగరంలో గేటెడ్ కమ్యూనిటీలు అద్దం పడుతున్నాయి. దీంతో వాటిల్లో విద్యుత్తు వినియోగం ఏటా పెరుగుతోంది. ఆరేళ్ల క్రితం 11 కేవీలో 90.23 మిలియన్ యూనిట్ల (ఎం.యూ) వార్షిక వినియోగం ఉండగా ప్రస్తుతం 221 ఎం.యూకు పెరిగింది. వచ్చే ఐదేళ్లలో రెట్టింపు స్థాయిలో 504 ఎం.యూకు చేరుకుంటుందని డిస్కం అంచనా వేసింది. గేటెడ్ కమ్యూనిటీలు ఒక్కోచోట 500 నుంచి 4 వేల వరకు ఉన్నాయి. భారీఎత్తున కట్టిన బహుళ అంతస్తుల నివాసాలకు హెచ్‌టీ కనెక్షన్లు జారీ చేస్తున్నారు. లోడ్ సామర్థ్యాన్నిబట్టి తొలుత 11కేవీ కనెక్షన్ ఇచ్చేవారు. తర్వాత 33కేవీకి పెరిగింది. ఇప్పుడు అధిక లోడ్ కారణంగా ఏకంగా 132 కేవీ కనెక్షన్ కూడా ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీరికి శ్లాబ్‌లు కాకుండా ఏకరూపంగా యూనిట్ ఛార్జీ రూ.7.30 డిస్కం వసూలు చేస్తుంది. అంతర్గత మీటర్లతో బిల్లులు.. డిస్కం ఆయా కమ్యూనిటీ, టౌన్‌షిప్‌లకు బల్క్ కనెక్షన్ ఇస్తుంది. అక్కడి నుంచి అంతర్గతంగా విద్యుత్తు మీటర్లు ఏర్పాటు చేసుకుని వాటికి బిల్లులను రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు (ఆర్‌డబ్ల్యూఏస్) నియమించుకునే నిర్వహణ సంస్థలు జారీ చేస్తాయి. ఈ తరహా బల్క్ కనెక్షన్లు సిటీలో ఐదేళ్లలో భారీగా పెరిగాయి. దీంతో విద్యుత్తు వినియోగం పెరిగింది. వార్షికంగా 16.66 శాతం వృద్ధి నమోదైంది.

# ప్రతిపాదనలు ఘనం.. ప్రగతి గగనం



పెద్దపల్లి :పురపాలక, నగరపాలక బడ్జెట్ కేటాయింపులకు, నిధుల విడుదలకు పొంతన ఉండటం లేదు. ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం లేకపోవడం, సాధారణ నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తుండటంతో అభివృద్ధికి అవరోధంగా మారింది. ఆర్థిక సంస్థల నిధుల లభ్యత అంతంత మాత్రంగానే ఉండటంతో నిర్వహణ భారమైంది. బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఆదాయం సమకూరకపోవడం, ఆస్తి పన్ను వసూళ్లలో ఇబ్బందులు తదితర సమస్యలతోపాటు ప్రభుత్వ గ్రాంట్లు కూడా సకాలంలో రావడం లేదు.

పెద్దపల్లి పట్టణంలో పలు అభివృద్ధి పనులు నిధుల కొరతతో నిలిచిపోయాయి. బంధంపల్లిలో వైకుంఠధామం నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోగా, నిట్టూరు రోడ్డులోని మరో వైకుంఠధామానికి రూ.కోటి నిధులు విడుదలైనప్పటికీ పనులు మొదలు కాలేదు. రూ.2.75 కోట్లతో చేపట్టిన సమీకృత మార్కెట్ సముదాయ నిర్మాణం కూడా అసంపూర్తిగా నిలిచింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన పనులు నిధుల కొరతతో రద్దయ్యాయి.

**నిధుల మళ్లింపు**

అసలే నిధుల కొరత వెంటాడుతుండగా పురపాలిక భవనానికి సామర్థ్యానికి మించి నిధులు వెచ్చించడం గుదిబండగా మారింది. 2013లో రూ.2 కోట్ల అంచనాతో భూమిపూజ నిర్వహించారు. అనంతరం 2017లో అంచనా వ్యయం పెంచి రూ.3.50 కోట్లతో మరోసారి శంకుస్థాపన చేశారు. రెండు సార్లు ఇద్దరు మంత్రుల చేతుల మీదుగా శిలాఫలకాలు ఆవిష్కరించారు. నిర్మాణానికి కేవలం రూ.21 లక్షలు మాత్రమే విడుదల కాగా వ్యయం రూ.5 కోట్లకు పెరిగింది. గుత్తేదార్లకు రూ.2 కోట్ల వరకు చెల్లించాల్సి ఉండగా మిగతా సొమ్మును సాధారణ, ఎల్ఆర్ఎస్ నిధుల నుంచి వెచ్చించారు.

**పెండింగ్ బిల్లులు.. రూ.77.36 లక్షలు**

సుల్తానాబాద్: సుల్తానాబాద్ పురపాలక సంఘానికి వివిధ పన్నుల ద్వారా ఏటా దాదాపు రూ.92.15 లక్షల ఆదాయం సమకూరుతోంది. బడ్జెట్ ప్రతిపాదనల మేరకు ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా రూ.5 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులు, పట్టణ ప్రగతి కింద రూ.19.30 లక్షలు, అమృత్ రూ.18.40 కోట్లు, ఎస్‌డీఎఫ్ రూ.10 లక్షలు రావాల్సి ఉంది. నిధులు మంజూరు కాక పట్టణ ప్రగతి, ఎస్‌డీఎఫ్ పనులు నిలిచిపోయాయి. చేసిన పనులకు సంబంధించి గుత్తేదార్లకు రూ.77.36 లక్షలు చెల్లించాల్సి ఉంది.

**నగరపాలిక ఆదాయం నిర్వహణకే సరి**

రామగుండం నగరపాలక ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వ నిధులు విడుదల కాకపోవడంతో అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఇందులో రెండు సమీకృత మార్కెట్ భవనాలు, సామాజిక భవనాలు, అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం, బహుళ ప్రయోజనకర భవనం తదితర నిర్మాణాలున్నాయి. ఒక్కొక్క భవనానికి రూ.కోటి నుంచి రూ.8 కోట్ల వరకు మంజూరు చేశారు. రూ.కోటికి పైగా వెచ్చించి పనులు చేసినా బిల్లులు రాకపోవడంతో గుత్తేదార్లు పనులు వదిలేశారు. నగరపాలిక నిధులతో చేపట్టిన పనులకు కూడా బిల్లులు రావడం లేదు. నగరంలో దాదాపు రూ.8 కోట్ల వరకు బకాయిలున్నాయి. వివిధ రకాల పన్నులతో వచ్చే సాధారణ ఆదాయం ఒప్పంద కార్మికుల వేతనాలు, నగరపాలిక నిర్వహణకే సరిపోతోంది. ఇప్పటికే పనులు నిలిచిపోగా కొత్తగా అభివృద్ధి పనులను ప్రకటిస్తూ, ప్రారంభించడం గమనార్హం.

# శిక్షణ పొంది.. కొలువు కొట్టి



కరీంనగర్ : విద్యార్థులకు పాఠాలతోపాటు.. నైతిక విలువలు నేర్పే ఉపాధ్యాయ కొలువు సాధించాలనుకునే వారికి ప్రభుత్వ బీసీ, ఎస్సీ స్టడీ సర్కిళ్లు బాటలు వేశాయి. ఆఫ్‌లైన్‌తోపాటు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వడంతో డీఎస్సీ అభ్యర్థులకు ఎంతో ఉపయోగంగా మారింది. ఇంటిని.. పనులను చూసుకుంటూ చదివారు. పలువురు ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో మెరిశారు. శిక్షణ కేంద్రాలు అందుబాటులో లేని వారు.. గ్రామీణ అభ్యర్థులు.. తర్ఫీదుకు రుసుం చెల్లించలేని వారికి ఈ స్టడీ సర్కిళ్లు నిచ్చెనల నిలిచాయి.

**ఆన్‌లైన్‌లో కూడా..**

కరీంనగర్‌లోని బీసీ, ఎస్సీ స్టడీ సర్కిళ్లలో డీఎస్సీ-2024 కోసం ప్రత్యేకంగా పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల జిల్లాల అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చారు. ఆఫ్‌లైన్‌తోపాటు ఆన్‌లైన్ ద్వారా దాదాపు మూడు నెలల వరకు శిక్షణ అందించారు. స్టడీ మెటీరియల్, వివిధ రకాల పుస్తకాలు, నిపుణులతో తరగతులు చెప్పించారు. బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన 17 మంది, ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన 12 మంది ఉద్యోగాలు సాధించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సన్నద్ధత కరీంనగర్‌కు చెందిన రహీమొద్దీన్, ఫర్జానాల కుమారుడు ఎండీ అఫ్రోజ్ సాంఘిక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. ఎస్జీటీగా చేస్తున్న తమ్ముడి సహకారం, నాన్న టైలర్‌గా పడుతున్న కష్టాన్ని చూసి ఎలాగైనా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలని.. బీసీ స్టడీ సర్కిల్‌లో మూడు నెలలు శిక్షణ పొందాడు. ఇక్కడి గ్రంథాలయంలోని పుస్తకాలు, సన్నద్ధత ఉద్యోగ సాధనకు తోడ్పడ్డాయని ఆయన పేర్కొన్నారు. స్టడీ సర్కిల్‌లో సమకూర్చిన భోజనంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడే ఉంటూ సన్నద్ధమయ్యానని చెప్పారు.

**ఏడాది కష్ట ఫలితం**

రాయికల్‌కు చెందిన బూర్గు శ్రీకాంత్ తండ్రి బాల్యంలోనే మరణించగా.. తల్లి రాజేశ్వరి బీడీలు చుడుతూ చదివించింది. పేద కుటుంబం కావడంతో శ్రీకాంత్ ప్రభుత్వ విద్యాసంస్థలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఉపాధ్యాయ కొలువు కొట్టి అమ్మకు అండగా నిలవాలనే సంకల్పంతో డీఎస్సీకి బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఆన్‌లైన్‌లో సన్నద్ధమయ్యారు. మాదిరి పరీక్షల ద్వారా సామర్థ్యాలను అంచనా వేసుకుంటూ.. ఏడాది పాటు కష్టపడ్డాడు. చివరికి స్కూల్ అసిస్టెంట్(బయోసైన్స్)గా ఎంపికై కష్టానికి తగ్గ ఫలితం పొందారు.

**నాన్న కల నెరవేరింది శిరీష**

జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన శిరీష తండ్రి శేఖర్ కార్పెంటర్, తల్లి కవిత బీడీ కార్మికురాలు. శేఖర్ కూతురుని టీచర్‌గా చూడాలని శిరీషను బీఈడీ చేయించారు. ఇందుకు అనుగుణంగానే కష్టపడి బీఈడీ పూర్తి చేసిన శిరీష.. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా డీఎస్సీకి ఆన్‌లైన్‌లో శిక్షణ తీసుకుంది. శిక్షణకు తోడు స్వతహాగా సన్నద్ధమై ఎస్జీటీగా ఎంపికైంది. ఇందుకు భర్త సహకారం కూడా తోడైందని ఆమె చెప్పింది.

**అవగాహన పెంచుకొని..**

శంకరపట్నం మండలం కేశవపట్నంకు చెందిన జూల వేణుగోపాల్ తండ్రి శ్రీనివాస్ హమాలీ, తల్లి వెంకటలక్ష్మి వ్యవసాయ కూలీ. పేదకుటుంబం కావడంతో విద్యాభ్యాసమంతా ప్రభుత్వ విద్యాసంస్థల్లో సాగింది. ప్రైవేటు విద్యాసంస్థలో బీఈడీ చేసిన అనంతరం ఎస్సీ స్టడీ సర్కిల్‌లో వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకున్నారు. డీఎస్సీకి కూడా శిక్షణ పొందారు. తోటి అభ్యర్థులతో శిక్షణలో పాల్గొనడం ద్వారా ఎలా సన్నద్ధమవ్వాలనే విషయంపై అవగాహన పెంచుకుని స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యానని వేణుగోపాల్ తెలిపారు.

# ఆహ్లాదం దరిచేరేలా.. ఆనందం పంచేలా..

పరిగి : నేడు మనిషి జీవనం యాంత్రికంగా మారింది. ఉదయం లేచింది మొదలు నిద్రపోయే వరకు ఒకటే పరుగు.. కనీసం వారాంతాల్లోనైనా కుటుంబంతో ఆహ్లాదంగా గడిపేందుకు వసతులు లేవు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు అడవులను చరవాణుల్లో చూపుతున్నారు. ఇవన్నీ కళ్లముందు సహజసిద్ధంగా సాక్షాత్కరిస్తే అద్భుతంగా ఉంటుంది కదూ. అర్బన్ పార్కుల ఏర్పాటుతో వీటిని ప్రారంభించేందుకు అటవీశాఖ కార్యాచరణ చేపట్టింది. జిల్లా వాసులకు ఆహ్లాదాన్ని అందించేందుకు ఇవి అందుబాటులోకి రానున్నాయి. హెచ్ఎండీఏలోని అర్బన్ ఫారెస్ట్రీ విభాగం, నగర్వన్ యోజన పథకం కింద అటవీశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. క్షేత్రస్థాయిలో ఇప్పటికే పనులు ప్రారంభించిన అధికారులు వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఒక్కో పార్కుకు రూ.2కోట్ల చొప్పున మంజూరయ్యాయి. వ్యవసాయ ప్రాంతంగా ఉన్న జిల్లాను అభివృద్ధి చేసేందుకు స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు ఇందుకు వినియోగిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో వనరుల సద్వినియోగానికి పోటీపడుతున్నారు.

**ఎక్కడెక్కడ అంటే..:** పరిగి మండలం జాఫర్‌పల్లి రిజర్వు ఫారెస్టులో 50హెక్టార్లు, కొడంగల్ పరిధి అప్పాయిపల్లిలో 180 హెక్టార్లు, వికారాబాద్ అనంతగిరిలో 80హెక్టార్ల చొప్పున ఏర్పాటు కానున్నాయి. వీటితో పాటు తాండూరులోని గొల్లపల్లిలో గతేడాది మంజూరైన పార్కు పనులు ఇప్పటికే 20శాతం పూర్తయ్యాయి. మిగతా ప్రాంతాల్లోనూ పార్కుల ఏర్పాటులో భాగంగా మొక్కల పెంపకం పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి.

వసతులు ఇలా: జాఫర్‌పల్లిలో 3.5 కి.మీ దూరం, అప్పాయిపల్లిలో 6కి.మీ, అనంతగిరిలో 6కి.మీ తాండూరులో 4కి.మీ చొప్పున పాదచారులను ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేయనున్నారు. శౌచాలయాలు, తాగునీరు, సందర్శకులు అడవి





అందాలను ఆస్వాదించేందుకు వాచ్‌టవర్లు, వాహనాల పార్కింగ్, కూర్చునేందుకు బెంచీలు, సైన్‌బోర్డులు, అక్కడక్కడా పర్కులేషన్ ట్యాంకులు, చెక్‌డ్యాంల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వాటికి రక్షణ కల్పిస్తారు.

**సహజ వాతావరణాన్ని కల్పిస్తాం-జ్ఞానేశ్వర్, జిల్లా అటవీ అధికారి**

అర్బన్ పార్కుల్లో సహజ వాతావరణం ఉట్టి పడే విధంగా తీర్చిదిద్దుతాం. ప్రజాప్రతినిధుల సహకారంతో ఐదు ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయి. ప్రజలను ఆకట్టుకునే విధంగా వివిధ రకాల సదుపాయాలను కల్పిస్తాం. యాంత్రిక జీవనానికి దూరంగా పెద్దలు, పిల్లలు ఉండే విధంగా మనసుకు ఉల్లాసాన్ని, ఉత్తేజాన్ని కలిగించే విధంగా కృషి చేస్తున్నాం.

# ఉపాధి వేట ..ముళ్ల బాట

జగిత్యాల : జిల్లా మేడిపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన వినోద్ ఉపాధి కోసం బెహరాన్ వెళ్లి నిబంధనలకు విరుద్ధంగా కంపెనీ నుంచి బయటకు వచ్చాడు. అక్కడ ఎవరూ సహకరించకపోవడంతోపాటు గుర్తుతెలియని వారు దాడి చేయడంతో చేయి విరిగింది. అక్కడే అనారోగ్యం పాలై మానవతావాదుల సాయంతో ఇల్లు చేరాడు. రోజురోజుకూ ఆరోగ్యం మరింత క్షీణించి రెండ్రోజుల కిందట మృతిచెందాడు. వినోద్ లాగే చాలా మంది అభాగ్యులు కంపెనీ నిబంధనలు పాటించకుండా చిక్కుల్లో పడుతున్నారు. ఇబ్బందులు ఎదురయ్యాక తమకు సాయం చేసేవారు లేరంటూ ఆవేదన చెందుతున్నారు.

సాంకేతికంగా అభివృద్ధి పెరుగుతున్నా గల్ఫ్ దేశాలకు వెళ్లాలనుకునే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. వీసాలు, వైద్య పరీక్షల పేరిట నకిలీ ఏజెంట్లు మోసం చేస్తూనే ఉన్నారు. ఇటీవల బాధితుల సంఖ్య పెరగడంతో జగిత్యాలలో పోలీసుశాఖ, వలసదారుల రక్షణ అధికారి(ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్), భారత విదేశాంగ శాఖ వారు అవగాహన, శిక్షణ ఏర్పాటు చేశారు. నకిలీల బారిన పడొద్దని, ఎలాంటి మోసం జరిగినా తమకు ఫిర్యాదు చేయాలని పోలీసులు చెబుతున్నారు. ఆర్మూరుకు చెందిన ఓ ఏజెంటు వైద్య పరీక్షలు చేయించి పలువురిని దుబాయి పంపగా అవి చెల్లవని చెప్పడంతో ఆర్మూరు, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన పలువురు తాము మోసపోయామని గుర్తించి లబోదిబోమన్నారు. గల్ఫ్ వెళ్లేవారికి అక్కడి కంపెనీల నిబంధనల మేరకు వైద్య పరీక్షలు చేయించాల్సి ఉండగా చాలా మంది ఏజెంట్లు తమకు అనుకూలమైన డయాగ్నోస్టిక్ కేంద్రాల్లో పరీక్షలు చేయించి పంపుతున్నారు. కొందరు వైద్య పరీక్షలు చేయించుకోకుండా అక్కడికి వెళ్లి తీరా కంపెనీలు పరీక్షలు చేయించడంతో అనారోగ్య సమస్యలు బయటపడి స్వగ్రామాలకు తిరిగి వస్తున్నారు.

ఫిర్యాదులకు అవకాశం

జగిత్యాలలో పోలీసులు నిర్వహించిన అవగాహన సమావేశంలో రాయబార కార్యాలయ అధికారులు కూడా ఉండటంతో పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా లైసెన్స్ కలిగిన ఏజెంట్ల ద్వారా గల్ఫ్ దేశాలకు వెళ్తే అక్కడి కంపెనీల్లో సదరు ఏజెంటు చెప్పిన జీతభత్యాలు, ఉపాధి లేకపోతే భారత రాయబార కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే ఏజెంట్‌పై చర్యలు తీసుకునే అవకాశముంది. కేంద్ర ప్రభుత్వం కూడా నకిలీలు, కంపెనీలపై వచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తోంది. జగిత్యాల జిల్లాకు చెందిన ఓ వ్యక్తి దుబాయిలో రోడ్డు ప్రమాదంలో గాయపడగా కంపెనీ యాజమాన్యం పట్టించుకోక పోవడంతో గల్ఫ్ సంక్షేమ సంఘాల సహకారంతో కంపెనీపై ఫిర్యాదు చేశాడు. దీంతో కంపెనీ వారు నష్టపరిహారం చెల్లించాల్సి వచ్చింది.

నకిలీలతో ఇబ్బందులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలో లైసెన్స్ కలిగిన ఏజెంట్లు 33 మంది మాత్రమే ఉన్నారు. గల్ఫ్ ఏజెంట్లు ఇమ్మిగ్రేషన్ చట్టం 1983 నిబంధనలకు లోబడి పనిచేయాలని పోలీసులు పేర్కొంటున్నారు. అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించే కంపెనీల వివరాలు, జీతభత్యాలు ఏజెంట్లు తెలపాలని సూచిస్తున్నారు. గల్ఫ్ వెళ్లాలనుకుంటున్న వారు అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నంబర్ 1800113090 74283 21144ను సంప్రదించాలని చెబుతున్నారు. సరైన ధ్రువపత్రాలు పరిశీలించి అభ్యర్థులను గల్ఫ్ దేశాలకు పంపాలని పోలీసులు వివరించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి లైసెన్స్ పొందాలని, ఏమైనా ఫిర్యాదులు వస్తే ఏజెంట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

బాధితులు సంప్రదిస్తే చర్యలు

గల్ఫ్ లాంటి దేశాలకు వెళ్లేవారు మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నకిలీ ఏజెంట్ల బారిన పడి మోసపోవద్దు. బాధితులు నేరుగా సమీపంలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలువురు నకిలీ ఏజెంట్లపై కేసులు కూడా నమోదు చేశాం. అత్యవసర సమయాల్లో టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే సాయం అందుతుంది. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నాం. ఆన్‌లైన్‌లోని సమగ్ర సమాచారాన్ని పరిశీలిస్తే మోసాల నుంచి తప్పించుకోవచ్చు.- అశోక్‌కుమార్, ఎస్పీ, జగిత్యాల

# ప్రాథమిక విద్య.. వారికి మిథ్య

ఆసిఫాబాద్ : మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా అసలే అంతంత మాత్రంగా నడిచే గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లడం, మరొకరు అక్కడికి రాకపోవడంతో బడులన్నీ మూతపడ్డాయి. ఈ ఏకోపాధ్యాయ పాఠశాలలకు చాలాచోట్ల ఉపాధ్యాయుల హాజరు అత్యంత తక్కువగా ఉంటుంది. వీరిని పర్యవేక్షించేందుకు అన్ని మండలాల పరిధిలో ఎస్ఆర్పీ (స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్)లను నియమించారు. కొందరు ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న ఎస్ఆర్పీలను కొన్ని చోట్ల మారుమూల ప్రాంతాల్లో తమకు అనుకూలంగా మలుచుకుని పాఠశాలలకు వెళ్లడం లేదు. ఈ నేపథ్యంలో పల్లెల్లో పాఠశాలలు రోజుల తరబడి మూతపడే ఉంటున్నాయి.

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం బాబేఝరి పంచాయతీలోని చిత్తగూడ ప్రాథమిక పాఠశాల ఇది. ఇక్కడ 18 మంది విద్యార్థులు ఉన్నారు. పక్షం రోజుల నుంచి ఉపాధ్యాయుడు లేకపోవడంతో చిన్నారులు పాఠశాలకు వచ్చి వెళ్లిపోతున్నారు.

ఇంద్రవెల్లి మండలంలోని పొల్లుగూడ ప్రాథమిక పాఠశాలలో 12 మంది విద్యార్థులు ఉండగా.. ఇక్కడ ఉపాధ్యాయుడు లేరు. సిరికొండ మండలంలోని లక్ష్మీపూర్ పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి సైతం ఉపాధ్యాయుడు లేక మూతపడే ఉంటుంది.

గోవెన గొండుగూడ పాఠశాల

కుమురం భీం జిల్లా తిర్యాణి మండలంలో జెండగూడ, బొజ్జుగూడ, గోపెర, నాగగూడ గోపెర, గోవెన గోండుగూడ, కుర్సిగూడ, పాడిగూడ, కుంటగూడ, తాళ్లపేటగూడ, అర్జున్‌లొద్ది గ్రామాల్లో పాఠశాలలు ఈ విద్యా సంవత్సరం ఆరంభం నుంచి తెరుచుకోవడం లేదు.

43 పాఠశాలల మూత' కథనం ప్రచురితం కాగా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా స్పందించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఐటీడీఏ అధికారులతో ఉట్నూర్‌లో సమావేశం నిర్వహించారు. బదిలీ అయిన చోట, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న ప్రాంతాల్లోని పాఠశాలల వివరాలను సేకరించి, ఆయా ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే సీఆర్పీలను వెంటనే సర్దుబాటు చేయాలని ఆయా జిల్లాల గిరిజన సంక్షేమాధికారులను ఆదేశించారు. సర్దుబాటుతోపాటు విద్యను అందించాలి

మూతపడిన పాఠశాలలకు వారం అనంతరం ఉపాధ్యాయులు వెళతారని అధికారులు అంటున్నారు. సర్దుబాటు చేసిన వారితోపాటు, మిగతా ఏకోపాధ్యాయ పాఠశాలలు సక్రమంగా నిత్యం తెరుచుకునే విధంగా ఐటీడీఏ అధికారులు చూడాలని గిరిజనులు కోరుతున్నారు. వీటి పర్యవేక్షణ కోసం నియమించిన సీఆర్పీల ద్వారా పక్కాగా నివేదికలు అందేలా చూడాలి.



## రుషికొండ ప్యాలెస్.. గుండె చెదిరిపోయే నిజాలు బయటికొస్తున్నాయి: చంద్రబాబు

విశాఖపట్నం: ఒక ముఖ్యమంత్రి విలాసం కోసం పర్యావరణాన్ని విధ్వంసం చేసి ప్యాలెస్ కట్టుకోవడం ఎక్కడా చూడలేదని సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గత వైకాపా ప్రభుత్వం హయాంలో రుషికొండపై నిర్మించిన భవనాలను మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం చంద్రబాబు పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "ఎవరూ కలలో కూడా ఊహించనిది జరిగింది. ఒక వ్యక్తి విలాసవంతమైన జీవితం కోసం ఏవిధంగా కార్యక్రమాలు చేస్తాడనేది ఇక్కడి భవనాలు చూశాకే తెలిసింది. గుండె చెదిరిపోయే నిజాలు బయటకు వస్తున్నాయి. గతంలో.. మీడియా, ఇతరులు ఎంత ప్రయత్నించినా రుషికొండపై ఏం చేస్తున్నారో తెలియకుండా చేశారు. ఎన్జీటీ, హైకోర్టు, కేంద్ర ప్రభుత్వాన్ని మభ్యపెట్టారు. ఒక రాష్ట్ర ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని ఏ విధంగా చేయగలరో అనే దానికి ఇక్కడి పరిస్థితి ఒక ఉదాహరణ. నేను, నా మిత్రుడు పవన్ కల్యాణ్ కూడా ఇక్కడకు రావాలని ప్రయత్నించాం. ఎవరినీ రానీయకుండా చేశారు. ఇవాళ ఇక్కడ ఏం జరిగిందో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉంది.. ఆ అధికారం ప్రజలే మాకు ఇచ్చారు. రుషికొండ బీచ్.. విశాఖలోనే అత్యంత అందమైన ప్రాంతం. భవనాల్లో ఎక్కడ కూర్చున్నా సముద్రం వ్యూ కనిపించేలా కట్టారు. పూర్వం రాజులు, చక్రవర్తులు కూడా ఇలాంటి భవనాలు నిర్మించుకోలేదు" "ఒక వ్యక్తి తన స్వార్థం కోసం ఇలాంటి పనులు చేశారు. ఇలాంటి విలాసవంతమైన భవనాలు నిర్మిస్తున్నారని ఊహించలేం. ప్రజాధనంతో ఇలాంటి భవనాలు కట్టుకోవడం దారుణం. ఈ భవనాలు చూసి ఆశ్చర్యం, ఉద్వేగం కలిగింది. బాత్ టబ్ కోసం రూ.36లక్షలు ఖర్చు చేశారు. ఫ్యాన్సీ ఫ్యాన్లు పెట్టారు. ఇలాంటి షాండ్లియర్లు కూడా నేనెక్కడా చూడలేదు. భవనాలకు మార్బుల్స్ విదేశాల నుంచి తీసుకొచ్చారు. చాలా దేశాలు తిరిగా.. ఎంతో మంది నేతలను చూశాను కానీ, ఎవరూ ఇలాంటి ప్యాలెస్‌లు కట్టుకోలేదు. దిల్లీ పెద్దలు కూడా విశాఖలోని నేవీ గెస్ట్‌హౌస్‌లోనే ఉన్నారు. పర్యాటకశాఖ కోసమే నిర్మించామని అనేకసార్లు చెప్పారు. పేదలను ఆదుకుంటామనేవారు ఇలాంటివి కట్టుకుంటారా" "గత ప్రభుత్వం ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు రూ.400 కోట్లు కూడా ఖర్చు చేయలేదు. ఈ నిధులు ఖర్చు పెడితే రోడ్లపై గుంతలు పూడ్చటం పూర్తయ్యేది. ఇలాంటి వ్యక్తులు రాజకీయాల్లో పనికివస్తారా? ప్రజలు ఆలోచించాలి. ఈ భవనాలు అందరికీ చూపిస్తాం. వీటిని దేనికి వాడుకోవాలో నాకు అర్థం కావడం లేదు. ఇక్కడ క్యాంప్ ఆఫీస్ కట్టడం ఏమిటో అర్థం కాలేదు. ప్రజలంటే ఎంతో కొంత భయం ఉంటే సమాధానం చెప్పాలి. ప్రజాధనం దోచుకుని గతంలో ఊరికొక ప్యాలెస్ కట్టుకున్నారు. అధికారంలో శాశ్వతంగా ఉంటాననే భ్రమలతో ఇలాంటివి కట్టారు. విశాఖ ప్రజలను మోసం చేసేందుకు ఇలాంటి తప్పుడు పనులు చేశారు" అని చంద్రబాబు విమర్శించారు.

## మూడేళ్ల బాలికపై హత్యాచార ఘటన.. నిందితులపై కఠిన చర్యలు: సీఎం చంద్రబాబు



అమరావతి: తిరుపతి జిల్లా వడమాలపేటలో మూడేళ్ల బాలికపై హత్యాచార ఘటనపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. చిన్నారి కుటుంబానికి రూ.10 లక్షలు అందజేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఆదివారం మధ్యాహ్నం బాధిత కుటుంబానికి హోం మంత్రి అనిత ఇందుకు సంబంధించిన చెక్కును అందజేయనున్నారు.

**ఘటనపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి..** తిరుపతి జిల్లా వడమాలపేట మండలంలో మూడేళ్ల బాలికపై హత్యాచారం ఘటనపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

అభం శుభం తెలియని చిన్నారికి చాక్లెట్లు ఆశ చూపి దారుణానికి పాల్పడటం హేయమన్నారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మృతి చెందిన బాలిక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ ఘటనపై సత్వరమే విచారణ జరిపి నిందితుడికి శిక్ష పడేలా చేస్తామని అనిత తెలిపారు.

## ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంపై మంత్రి కొలుసు పార్థసారథి కీలక వ్యాఖ్యలు



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం ఎట్టి పరిస్థితుల్లోనూ నవంబర్ 1వ తేదీన కాకపోవచ్చు అని మంత్రి కొలుసు పార్థసారథి కీలక వ్యాఖ్యలు చేశారు. తూర్పు నియోజకవర్గంలో ఇవాళ(శనివారం) సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ... ప్రజాస్వామ్య బద్ధంగా ఆలోచించే ఏకైక పార్టీ తెలుగుదేశం అని ఉద్ఘాటించారు. కుటుంబ సభ్యులకు కాకుండా వేరే సామాజిక వర్గానికి చెందిన వారిని టీడీపీ అధ్యక్ష పదవి కట్టబెట్టిన ఘనత చంద్రబాబుకే దక్కిందని మంత్రి కొలుసు పార్థసారథి కొనియాడారు. బలహీన వర్గాలకు తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి పెద్దపీట వేస్తుందని వివరించారు. ప్రజాస్వామ్యబద్ధంగా తెలుగుదేశం పార్టీ ఆలోచిస్తుంటే... వైసీపీ మాత్రం జీవితకాలం అధ్యక్షుడిని తానేనని విస్తృత స్థాయి సమావేశంలో పెట్టుకున్న వ్యక్తి జగన్ అని విమర్శించారు. చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి కోసం దూర దృష్టితో ఆలోచిస్తారని తెలిపారు. గతంలో ఎక్కడ చూసినా అసభ్యంగా మాట్లాడే వైసీపీ నేతలను చూసేవాళ్లమని.. నాలుగు నెలల నుంచి అటువంటివి ఏమీ లేవని చెప్పారు. ఏపీ అభివృద్ధి గురించి ఖూనీకోరులు కూడా మాట్లాడటం దెయ్యాల వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని మంత్రి కొలుసు పార్థసారథి విమర్శలు చేశారు.

పొట్టి శ్రీరాములుకు వైసీపీ ప్రభుత్వం ఏ విధంగా గౌరవం ఇచ్చింది అనేది అందరికీ తెలుసునని విమర్శించారు. పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతి కూడా ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీన నిర్వహించాలా లేదా పొట్టి శ్రీరాములు వీరమరణం పొందిన అక్టోబర్ 1వ తేదీన జరపలా అన్న అంశంపై ఆలోచన చేస్తున్నామని అన్నారు. ప్రతి అంశాన్ని రాజకీయం చేయాలని వైసీపీ నాయకులు చూస్తున్నారని మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు. నెల్లూరులోని పొట్టి శ్రీరాములు నివాసాన్ని మ్యూజియంగా చేసే ప్రయత్నం కూడా చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ... టీడీపీలో సభ్యత్వం తీసుకోవడం అంటే అదొక గర్వకారణంగా ఉంటుందని నారాయణ వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పార్టీని నమ్ముకుంటే బలుగు బలహీన వర్గాలకు కచ్చితంగా న్యాయం జరుగుతుందని కొనకళ్ల నారాయణ పేర్కొన్నారు.

## వైసీపీ ప్రభుత్వం రోడ్లను పట్టించుకోలేదు: మంత్రి గొట్టిపాటి రవికుమార్



పశ్చిమగోదావరి: వైసీపీ ప్రభుత్వం రోడ్లను పట్టించుకోకుండా నిర్వీర్యం చేసిందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. భీమవరంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఇవాళ(శనివారం) పర్యటించారు. ఇన్‌చార్జి మంత్రి హోదాలో తొలిసారి పశ్చిమ గోదావరి జిల్లాలో గొట్టిపాటి పర్యటించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు సమావేశం కానున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా సమస్యలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ... భీమవరంలో మిషన్ హోర్ట్ టోల్ ఫ్రీ ఏ.పీ (గుంతలు లేని రోడ్లు సాధనగా ప్రభుత్వం ముందడుగు )కార్యక్రమాన్ని ఈరోజు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు.
రాష్ట్రంలో రూ.826 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. కూటమి నాయకులతో కలిసి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

## ఏపీలో రోడ్లకు మహర్దశ : మంత్రి నిమ్మల



పశ్చిమగోదావరి: కూటమి ప్రభుత్వంలో ఏపీలో రోడ్లకు మహర్దశ కల్పిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. యలమంచిలి మండలం అడవిపాలెం వద్ద పాలకొల్లు- దొడ్డిపట్ల ప్రధాన రహదారి మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ... వచ్చే సంక్రాంతి నాటికి రూ. 600 కోట్లతో గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. సాక్షి ప్రకటనలకు ఖర్చుపెట్టిన రూ.300 కోట్లు కూడా కనీసం రోడ్లకు జగన్ ప్రభుత్వం ఖర్చు పెట్టలేదని ఆరోపించారు.

గత ఐదేళ్ల పాలనలో అధ్వాన రోడ్లతో ప్రమాదాలకు గురై ఆస్పత్రి పాలవడం, వాహన మరమ్మతులకు జేబులు గుల్లవడం చూశామని అన్నారు. జగన్ పాలనలో మ్యాప్‌ని చూసి కాకుండా గుంతల రోడ్లను చూసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గుర్తించే స్థాయికి జగన్ దిగజార్చారని మంత్రి రామానాయుడు మండిపడ్డారు.



## రష్యా పైకి క్షిపణులు ప్రయోగిస్తాం అనుమతివ్వండి..

కీవ్: రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య కొనసాగుతున్న సుదీర్ఘ యుద్ధంలో రష్యా కీవ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతోంది. రాజధాని కీవ్‌ను నేలమట్టం చేయడమే లక్ష్యంగా గత నెలలో 20సార్లు రష్యా డ్రోన్ దాడులకు పాల్పడినట్లు ఉక్రెయిన్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఉక్రెయిన్‌పై యుద్ధానికి రష్యాకు మద్దతుగా ఉత్తరకొరియా వేల సంఖ్యలో సైనికులను ఆ దేశానికి పంపింది. ఈవిషయంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ(%వశ్రీవఅంఎం%) మాట్లాడుతూ రష్యా పైకి క్షిపణులు ప్రయోగించడానికి తమ మిత్ర దేశాలు అనుమతివ్వాలని కోరారు. రష్యాకు మద్దతుగా మోహరించిన ఉత్తర కొరియా సేనలను దీటుగా ఎదుర్కోవాలంటే క్షిపణులు ప్రయోగించాలన్నారు. రష్యా తన భూభాగంలో సిద్ధంగా ఉంచిన ఉత్తరకొరియా సైనికుల స్థావరాలను తాము చూసి, వాటిపై నిఘా పెడతామని జెలెన్‌స్కీ అన్నారు. తమవద్ద సుదూర లక్ష్యాలను ఛేదించే క్షిపణుల సౌలభ్యం ఉంటే వారిని అడ్డుకోవడానికి వినియోగిస్తామని వెల్లడించారు. రష్యా కర్మాగారాల్లో ఉత్తర కొరియా ఆయుధాలు, సైనికులు మాత్రమే కాకుండా.. తమ ఆక్రమిత ప్రాంతాలైన కుర్స్క్‌లోను వారి సైనికులే ఉన్నారని వారు ఉక్రెయిన్‌పై దండెత్తడానికి సిద్ధమవుతున్నారని జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తంచేశారు. అయితే మిత్రదేశాలు తమకు ఆయుధ సహాయం చేయకుండా ఉత్తర కొరియా సైన్యం మాపై దాడి చేసేవరకు వేచి చూద్దాం అనే ధోరణిలో ఉన్నారని జెలెన్‌స్కీ మండిపడ్డారు. అక్టోబర్ నెలలో ఉక్రెయిన్‌పై 2 వేల డ్రోన్లతో దాడి చేసినట్లు రష్యా వెల్లడించింది. నెల రోజుల వ్యవధిలో రష్యా 2,023 డ్రోన్లను ప్రయోగించినట్లు ఉక్రెయిన్ జనరల్ స్టాఫ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో 1,185 డ్రోన్లను సమర్థంగా అడ్డుకున్నట్లు చెప్పారు. మరో 738 డ్రోన్ల వల్ల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. "ఈ ఏడాది ప్రారంభం నుంచి ప్రత్యర్థి రష్యా మా దేశంపై 6,987 డ్రోన్లను ప్రయోగించింది. జనావాసాలు, మౌలిక సదుపాయాలను దెబ్బతీయడమే లక్ష్యంగా దాడులు చేస్తోంది" అని తెలిపారు. అయితే, ఉక్రెయిన్ ఆరోపణలను రష్యా ఖండించింది. జనావాసాలే లక్ష్యంగా దాడులు చేస్తున్నామనడం సరికాదని స్పష్టంచేసింది. తమ దేశానికి ముప్పు పొంచిఉందనే కారణంతో ఉక్రెయిన్ మిలిటరీ మౌలిక సదుపాయాలను, ఇంధన వ్యవస్థను దెబ్బతీసేందుకే దాడులు చేస్తున్నామని పేర్కొంది.

## కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డ వైఎస్ షర్మిల



విజయవాడ, నవంబర్ 2: కూటమి ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించిన మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి స్పందిస్తూ.. ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తూ పేద కుటుంబాల్లో దీపం పెట్టామని గప్పాలు కొట్టుకుంటున్న కూటమి సర్కార్... విద్యుత్ సర్దుబాటు చార్జీలతో మరోవైపు వాతలు పెడుతోందని మండిపడ్డారు. "ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో లాక్కోవడం అంటే" ఇదే మరి అంటూ ఎద్దేవా చేశారు. ఉచిత సిలిండర్ల పథకం కింద ఏడాదికి ఇచ్చేది రూ.2685 కోట్లు ఖర్చు అవుతుంటే... ప్రజల దగ్గర నుంచి కరెంటు బిల్లుల రూపంలో ముక్కుపిండి అదనంగా వసూలు చేసేది రూ.6 వేల కోట్లు అని అన్నారు. ఇంకా రూ.3 వేల కోట్లు ప్రజలపైనే అదనపు భారం పడుతుంది కదా అని అన్నారు. దీపం - 2 కింద వెలుగులు పక్కన పెడితే.. కరెంటు బిల్లుల రూపంలో కుటుంబాల్లో కూటమి ప్రభుత్వం నింపేది కారు చీకట్లు అంటూ వ్యాఖ్యలు చేశారు. గత వైసీపీ చేసిన పాపమే ఇదని.. ఈ ప్రభుత్వానికి సంబంధం లేదని, బిల్లుల వసూళ్లకు అనుమతి ఇచ్చింది ఏపీఈఆర్సీ తప్పు.. మేము కాదంటూ ప్రభుత్వ పెద్దలు చెప్తున్నవి కుంటి సాకులు తప్ప మరోటి కాదన్నారు. గత ప్రభుత్వం 9 సార్లు చార్జీలు పెంచిందన్నారు. తాము అధికారంలోకి వచ్చాక.. ఒక్క రూపాయి కూడా అదనపు భారం మోపమని.. అవసరం అయితే 35 శాతం చార్జీలు తగ్గిస్తామని హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. "వైసీపీ ప్రభుత్వం 5 ఏళ్లలో 9 సార్లు చార్జీలు పెంచితే.. మీరూ మొదలుపెట్టారు కదా" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీకు వాళ్లకు ఏంటి తేడా ? 5 ఏళ్లలో వైసీపీ ప్రభుత్వం రూ.35 వేల కోట్లు ప్రజలపై భారం మోపితే.. మీరు కూడా భారం మోపడం మొదలు పెట్టారు కదా. మీకు వాళ్లకు ఏంటి తేడా" అని ప్రశ్నించారు. రూ.6 వేల కోట్లు ప్రజలపై మోపడం భావ్యం కాదన్నారు. బీజేపీకి మద్దతు ఇస్తున్నారు కదా సాయం తీసుకురావాలన్నారు. ప్రభుత్వమే ఈ భారం మోయాలని డిమాండ్ చేశారు. ప్రజలపై సర్దుబాటు చార్జీల భారాన్ని మోపినందుకు నిరసనగా ఈ నెల 5 న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిస్తుందని వైఎస్ షర్మిల పేర్కొన్నారు.

## అందుకే జగన్, షర్మిల మధ్య ఆస్తుల పంచాయితీ.. నారాయణ షాకింగ్ కామెంట్స్




ఢిల్లీ: మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి కేసుల వ్యవహారం కేంద్ర ప్రభుత్వం చేతుల్లోనే ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సంచలన ఆరోపణలు చేశారు. జగన్ అక్రమాస్తుల కేసు 11 ఏళ్లుగా తేలలేదు కాబట్టే.. షర్మిల జగన్ మధ్య ఇప్పుడు ఆస్తుల పంచాయితీ వచ్చిందని నారాయణ ఆరోపించారు. ఢిల్లీ వేదికగా నారాయణ మీడియాతో మాట్లాడారు. జగన్ అక్రమస్తుల కేసును మోదీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని నారాయణఅన్నారు. అప్పుడు అన్నా చెల్లెళ్ల పంచాయితీ కూడా తేలిపోతుందని చెప్పారు. 11 ఏళ్ల నుంచి జగన్ బెయిల్‌పై ఉన్నారని గుర్తుచేశారు. ఆయన కోర్టుకు కూడా వెళ్లడం లేదని విమర్శించారు. మాయల పకీర్ ప్రాణం పక్షిలో ఉన్నట్లుగా జగన్ కేసుల వ్యవహారం బీజేపీ చేతిలో ఉందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కారం చేయకుండా రాజకీయం చేస్తుందని మండిపడ్డారు. తమిళనాడు, కేరళ, ఢిల్లీ రాష్ట్రాలను లెఫ్ట్ నెంట్ గవర్నర్ల ద్వారా ఇబ్బందులు పెడుతున్నారని నారాయణ ధ్వజమెత్తారు. సమాఖ్య వ్యవస్థను దెబ్బ తీసేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఒక దేశం - ఒకే ఎన్నిక అనేది దేశానికి మంచిది కాదని అన్నారు. అధికారం కోసం దేశం వినాశనమైనా ఫరవాలేదు అనేలా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రాంతీయ పార్టీలు బలపడేకొద్దీ జాతీయ పార్టీలు నష్టపోతున్నాయని అన్నారు. సీపీఐ పార్టీ ప్రజాక్షేత్రంలో ఎదురీదుతుందని చెప్పారు. తమ పార్టీ క్షేత్ర స్థాయిలో బలపడటానికి కార్యాచరణ రూపొందిస్తున్నామని నారాయణ తెలిపారు. జార?ండ్‌లో సీపీఐ పార్టీ 9 సీట్లలో సొంతగా పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. మహారాష్ట్రాలో ఇండియా కూటమి పొత్తులో భాగంగా ఒక స్థానంలో పోటీ చేస్తుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీ కాంగ్రెస్ రాష్ట్రాలను విమర్శించడం సిగ్గుచేటు అని అన్నారు. అధికారం కోసం సౌత్, నార్త్ అని బీజేపీ ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అన్ని సక్రమంగా ఉన్నాయా అని ప్రశ్నించారు. మూసీ నది ప్రక్షాళనను వ్యతిరేకిస్తే హైదరాబాద్‌కు ద్రోహం చేయడమేనని అన్నారు. మూసీ ప్రక్షాళన విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు పోటా పోటీగా పోరాటం చేస్తున్నాయని సీపీఐ నారాయణ పేర్కొన్నారు.

## నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం వరకు లాంచీ ప్రయాణం.. టికెట్ ధరలివే..!



నాగార్జునసాగర్: పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ఎదురుచూస్తున్న నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం వరకు బోటు ప్రయాణాన్ని కార్తిక మాసం తొలిరోజున తెలంగాణ పర్యాటక శాఖ ప్రారంభించింది. గత ఐదేళ్లుగా ప్రణాళికలు వేసినప్పటికీ.. సాగర్‌లో సరైన స్థాయిలో నీరు లేకపోవడం, కరోనా మహమ్మారి తదితర కారణాలవల్ల వాయిదా పడుతూ వచ్చింది. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణానదిలో.. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్ వరకు గరిష్ఠ స్థాయిలో నీటి లభ్యత ఉంది. దీంతో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ లాంచీ ప్రయాణాన్ని ప్రారంభించింది. దాదాపు 120 కిలోమీటర్ల దూరం ఉండే ఈ ప్రయాణానికి మొదటి రోజు రాష్ట్రంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. నాగార్జున సాగర్ నుంచి నందికొండ మీదుగా ఏలేశ్వరం, సలేశ్వరం, తూర్పు కనుమలు, నల్లమల అటవీ ప్రాంత అందాలను వీక్షించేలా లాంచీ ప్రయాణానికి పర్యాటక శాఖ శ్రీకారం చుట్టింది. మరొక మార్గంలో నాగర్ కర్నూల్ జిల్లా సోమశిల నుంచి శ్రీశైలం వరకు లాంచీ సేవలను కూడా పర్యాటకాభివృద్ధి సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. కొల్లాపూర్ మండలం సోమశిల తీరంలో 120 మంది ప్రయాణించేలా ఏసీ లాంచీని అధికారులు ఇవాళ ప్రారంభించారు. అక్కణ్నుంచి శ్రీశైలం వరకు 120 కిలోమీటర్ల మేర 7 గంటలపాటు ఈ ప్రయాణం ఉంటుంది. లాంచీ ప్రయాణానికి పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1,600గా టికెట్ ధరలు నిర్ణయించారు. నాగార్జునసాగర్ డ్యాంలో నీటి మట్టం 575 అడుగులు ఉన్నంత వరకు, ప్రయాణికుల రద్దీని బట్టి శ్రీశైలానికి లాంచీలు నడపనున్నట్లు పర్యాటకాభివృద్ధి సంస్థ తెలిపింది.

# బాదుడు తగ్గిస్తూ.. భారం సరిచేస్తూ..

అనకాపల్లి : అనకాపల్లి ఆవఖండంలో దాదాపు 250 ఎకరాల భూములున్నాయి. ఇక్కడ ఎకరాకి రూ. 1.20 కోట్లుగా రిజిస్ట్రేషన్ విలువను నిర్ణయించారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న సుమారు 30 ఎకరాల వరకు ఆ విలువ ఒకే. రహదారికి దూరంగా శివారునున్న భూములకు కూడా రూ. 1.2 కోట్ల విలువను అమలు చేస్తున్నారు. వాస్తవానికి ఆ భూముల విలువ బహిరంగ మార్కెట్‌లో ఎకరా రూ. 50 లక్షలు నుంచి రూ.70 లక్షలే పలుకుతుంది. రిజిస్ట్రేషన్ ఫీజు మాత్రం రూ.1.2 కోట్లకు చెల్లించాల్సి రావడంతో ఆ భూములను కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
మునగపాక మండలం తిమ్మరాజుపేట, అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట కలిసే ఉంటాయి. మునగపాక మండలం తిమ్మరాజుపేట భూముల విలువ ఎకరా రూ.62 లక్షలుగా నిర్ణయిస్తే అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట భూముల విలువ రూ.42 లక్షలుగా నిర్ణయించి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఒక అడుగు దూరంలోనే రూ.20 లక్షల మార్కెట్ విలువ తేడా కనిపించడం విశేషం.
అనకాపల్లి పట్టణంలో 26,642 ఇళ్లు ఉన్నాయి. వీటిలో దాదాపు 4 వేల ఇళ్లకు ఇంటి నంబర్లు లేవు. ఇళ్ల నంబరు ఆధారంగానే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ధరలు ఉంటాయి. దీంతో తక్కువ విలువ కలిగిన భవనం నంబరు వేసి ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వం ఆదాయం కోల్పోతోంది.

**ప్రాంతాల అభివృద్ధి..** మౌలిక సదుపాయాలు.. ఆహార, వాణిజ్య పంటల సాగు ఆధారంగా భూముల రిజిస్ట్రేషన్ విలువలను నిర్ణయిస్తుంటారు. ఈ ప్రక్రియ శాస్త్రీయంగా జరగాలి లేకుంటే ప్రభుత్వం, భూ యజమానుల్లో ఏదోక వర్గం నష్టపోయే అవకాశం ఉంది. వైకాపా హయాంలో అసంబద్ధంగా భూముల విలువలను పెంచేశారు. రహదారులను ఆనుకుని ఉన్న భూముల విలువనే శివారు ప్రాంతాలకు వర్తింపజేయడంతో భూ విక్రయాలపై ప్రభావం పడి స్థిరాస్తి వ్యాపారం మందగించింది. కొన్నిచోట్ల తక్కువ మార్కెట్ విలువున్న అసెస్‌మెంట్ నంబర్లతో విలువైన ఆస్తులను రిజిస్ట్రేషన్లు చేయడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఈ అసమానతలను తొలగించేలా ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువలను హేతుబద్ధీకరణ చేయడానికి కూటమి ప్రభుత్వం చర్యలు మొదలుపెట్టింది. రిజిస్ట్రేషన్, రెవెన్యూ, పురపాలక శాఖల అధికారులు సమన్వయంతో భూముల వాస్తవ మార్కెట్ విలువలను నిర్ణయించి నివేదించాలని సూచించింది. ఆ మేరకు ఉమ్మడి జిల్లాలో అధికారులు గత నెలరోజులుగా రెవెన్యూ గ్రామాల్లో తిరుగుతూ స్థానికుల అభిప్రాయాలను సేకరిస్తున్నారు.

**అభివృద్ధి ఆధారంగా విలువలు పెంపు..**
వైకాపా ప్రభుత్వం నాలుగు పర్యాయాలు ఎలాంటి పరిశీలన లేకుండా 20 నుంచి



30 శాతం రిజిస్ట్రేషన్ విలువలు పెంచింది. మార్కెట్ విలువల నిర్ధారణలో లోపాలున్నా సవరించిన పాపాన పోలేదు. ఆ ప్రభావం భూముల క్రయ విక్రయాలపై పడింది. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఆదాయం తగ్గడంతో వాటి గ్రేడ్లు మారిపోయాయి. కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత భూముల విలువలు సవరించేందుకు కసరత్తు మొదలుపెట్టారు. క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేసి గతంలో పెంచిన మార్కెట్ విలువలు కొన్ని ప్రాంతాల్లో అసంబద్ధంగా ఉన్నట్లు గుర్తించారు. వాటిని ఏవిధంగా సరిచేయాలి. కొత్తగా ఏయే ప్రాంతాల్లో పెంచాలి అనే విషయమై సంబంధిత శాఖలతో చర్చిస్తు న్నారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు, కొత్తగా వెలిసిన స్థిరాస్తి లేఅవుట్లు, పారిశ్రామికవాడలు, కొత్త రహదారుల నిర్మాణం, పంటల సాగులో మార్పుల ఆధారంగా భూముల విలువలను పెంచేందుకు నిర్ణయించారు. నర్సీపట్నం, ఎలమంచిలి, నక్కపల్లి, చోడవరం పరిసరాల్లో ఇప్పటికే పరిశీలనలు చేశారు. భూములు విలువల పెంపు వల్ల ప్రభుత్వానికి ఆదాయమొక్కటే కాదు, రైతులకు రుణ పరిమితి పెరుగుతుంది. భూసేకరణ వంటి విషయాల్లో పరిహారం పెరగనుంది.

**వాస్తవ అంశాలు ఆధారంగానే..:** అసంబద్ధంగా ఉన్న రిజిస్ట్రేషన్ విలువలను హేతుబద్ధీకరించేలా చర్యలు తీసుకుంటున్నాం. దీనికోసం గ్రామాలు, పట్టణాల్లో వాస్తవ పరిస్థితులను పరిశీలించి భూములు విలువలను నిర్ణయించడం జరుగుతుంది. ఆ మేరకు పురపాలక, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకుంటున్నాం. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈ సవరణ ఉంటుంది.
కె.మన్మథరావు, జిల్లా రిజిస్ట్రార్, అనకాపల్లి

# అనుకూలతలే అనంతబలం



అనంతపురం : గతంలో నిర్దేశించుకున్న లక్ష్యం, ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీల మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాను ఆటోమొబైల్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ముందడుగు వేస్తున్నారు. ముఖ్యంగా విద్యుత్తు వాహనాలు, బ్యాటరీ తయారీ పరిశ్రమలను జిల్లాకు తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఈ మేరకు అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి లోకేశ్.. టెస్లా కంపెనీ ప్రతినిధులతో భేటీ అయ్యారు. అనంతపురం జిల్లాలో తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. బ్యాటరీ తయారీ పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను పలు కంపెనీల ప్రతినిధులకు వివరించినట్లు తెలుస్తోంది. మంత్రి ప్రయత్నాలు ఫలిస్తే ఉమ్మడి అనంతపురం జిల్లా భవిష్యత్తు పూర్తిగా మారుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**లక్ష ఎకరాలకు పైగా లభ్యత..**
అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో సుమారు లక్ష ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది. ఇందులో ఏపీఐఐసీ ద్వారా 7 వేల ఎకరాలను ఇప్పటికే సేకరించారు. 33 పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం 5,112 ఎకరాల భూమి ఏపీఐఐసీ వద్ద సిద్ధంగా ఉంది. హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారి ఆనుకుని వేలాది ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయి. కొత్తగా కావాలన్నా వేగంగా భూసేకరణ చేసేందుకు అవకాశాలు ఉన్నాయి.

**రెండు నుంచి మూడు గంటల్లోనే బెంగళూరు విమానాశ్రయానికి..**
బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కడి నుంచైనా 2 నుంచి 3 గంటల్లో చేరుకోవచ్చు. శ్రీసత్యసాయి జిల్లాలోని పెనుకొండ, హిందూపురం, మడకశిర ప్రాంతాల నుంచి కేవలం గంట, గంటన్నరలోనే వెళ్లవచ్చు. బెంగళూరు నుంచి చిక్కబళ్లాపుర వరకు భూమి అందుబాటులో లేకపోవడం ఉమ్మడి అనంతకు కలిసొచ్చే అంశం. అంతర్జాతీయ సంస్థల ఏర్పాటుకు అనంత అత్యంత అనువైన ప్రాంతంగా మారనుంది. ఇప్పటికే నాసిన్, బీహెచ్‌ఈఎల్ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఏర్పాటయ్యాయి. గుంతకల్లు రైల్వేజంక్షన్ ఉండటం అనుకూల అంశంగా పేర్కొనవచ్చు. తమిళనాడు, కర్ణాటకలోని పోర్టులను కలిపేలా గుంతకల్లు నుంచి రైల్వే మార్గాలను అనుసంధానం చేశారు.

**నీటి సమస్యకు ఆనాడే పరిష్కారం**
అనంతకు కరవు ప్రాంతంగా పేరుంది. ఈక్రమంలో కియా కంపెనీ కోసం అతి తక్కువ సమయంలోనే గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి చంద్రబాబు పూర్తి చేయించారు. హంద్రీనీవా ద్వారా గొల్లపల్లిని నింపి కియాకు నీరందించారు. హంద్రీనీవాను దాదాపుగా పూర్తిచేసి నీటితో జిల్లాలోని ప్రధాన చెరువులను నింపుతున్నారు. రాప్తాడు, పెనుకొండ, హిందూపురం, మడకశిర, కదిరి, పుట్టపర్తి ప్రాంతాల్లో ఏర్పాటయ్యే పరిశ్రమలకు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు. కరవు ప్రాంతమనే పేరున్నా.. నీటి సమస్య లేకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

**జాతీయ రహదారులతో అనుసంధానం**
బెంగళూరు, హైదరాబాద్ నగరాలను కలిపే జాతీయ రహదారి–44 అనంతపురం జిల్లా మీదుగా వెళ్తుండటం పరిశ్రమల ఏర్పాటుకు కలిసొస్తోంది. గుత్తి దగ్గర మొదలై చిలమత్తూరు మండలం కొడికొండ వరకు సుమారు 180 కిలోమీటర్లు మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. దీన్ని 12 వరుసలుగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. కర్ణాటకలోని రామనగర నుంచి ఏపీలోని కృష్ణపట్నం పోర్టును కలిపే ఎన్‌హెచ్–67, బళ్లారి నుంచి ఏపీ మీదుగా తమిళనాడును కలిపే ఎన్‌హెచ్–42, కర్ణాటక నుంచి నంద్యాల మీదుగా విజయవాడను కలిపే ఎన్‌హెచ్–544డీ, ఎఫ్ తదితర రహదారులు ఉమ్మడి అనంత జిల్లా మీదుగానే వెళ్తున్నాయి. ప్రస్తుతం ఈ మూడు రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్నాయి. విస్తరణ పూర్తయితే సరకు రవాణా మరింత సులభం కానుంది.
అనంతపురం జిల్లాకు నా మనసులో ప్రత్యేక స్థానం ఉంది. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలన్నదే ఏకైక లక్ష్యం. అందుకే కియాను అనంతపురం జిల్లాకు తీసుకొచ్చాం. వైకాపా పాలనలో అనంతపురం అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయింది. మళ్లీ అధికారంలోకి రాగానే అన్నింటినీ గాడిలో పెడతాం. జిల్లాను ఆటోమొబైల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. ఈఏడాది మార్చిలో పెనుకొండలో జరిగిన సభలో చంద్రబాబు దేశంలోని ప్రధాన రాష్ట్రాలన్నీ కియా మోటార్స్ కోసం పోటీ పడ్డాయి. నారా చంద్రబాబు నాయుడు ఎంతో కష్టపడి అనంతపురం జిల్లాలో యూనిట్ ఏర్పాటుకు కియా ప్రతినిధుల్ని ఒప్పించారు. నీటి సమస్యను పరిష్కరించడం కోసం గొల్లపల్లి రిజర్వాయర్‌ను యుద్ధప్రతిపాదికన పూర్తి చేశారు. అనంతపురాన్ని ఆటోమొబైల్ హబ్‌గా తీర్చిదిద్దాలనేది చంద్రబాబు కల. మళ్లీ అధికారంలోకి రాగానే ఆ దిశగా చర్యలు తీసుకుంటాం. గతేడాది మార్చిలో యువగళం పాదయాత్ర సందర్భంగా లోకేశ్

# నిర్లక్ష్యం ఖరీదు.. రూ.9 కోట్లు!

టెక్కలి : ఉన్నత లక్ష్యంతో పేదలకు పక్కా గూడు అందించాలని రూ.కోట్లాది నిధులతో తెదేపా హయాంలో టెక్కలి నియోజకవర్గంలో గృహ సముదాయాలు నిర్మిస్తే అనంతర కాలంలో అధికారంలోకి వచ్చిన వైకాపా సర్కారు వాటి పంపిణీని సైతం అడ్డుకుని పేదలకు ఇళ్లు చేరువ కాకుండా చేసింది.. దీనివల్ల వచ్చిన ప్రయోజనం లేకపోగా, నేడు అవి లబ్ధిదారులకు అందాలంటే రెట్టింపు శ్రమ, సమయం, ప్రజాధనం సమకూర్చుకోవాల్సిన దుస్థితి దాపురించింది.
టెక్కలి నియోజకవర్గంలో హుద్‌హుద్ తుపాను తర్వాత టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండల కేంద్రాల్లో ఒక్కోచోట 192 ఇళ్లు చొప్పున 576 ఇళ్లు నిర్మించారు. సర్వాంగ సుందరమైన గృహ సముదాయాలు చూసి అంతా ముచ్చటపడ్డారు. వాటికోసం ఎందరో ప్రయత్నం చేశారు. అర్హులైన వారికే అందాలని అప్పటి మంత్రిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికలయ్యాక అర్హులను గుర్తించి పంపిణీ చేయాలని భావించారు. నిర్మాణాలు పూర్తయినా 2019 ఎన్నికల ముందు పేదలకు అందించలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా నేతలు ఇళ్ల పంపిణీని అర్హులకు కాకుండా తమ అనుయాయులపై ఫలహారంగా ఇచ్చేందుకు



ప్రయత్నాలు చేశారు. ఎప్పటికప్పుడు అధికారులను హెచ్చరిస్తూ అనర్హులకు చేరకుండా అచ్చెన్న కొంత నిలువరించగలిగారు. ఐదేళ్లకాలం వృథా కావడంతో అందమైన గృహ సముదాయాలు అధ్వానంగా మారాయి.

**నిర్వహణకే శిరోభారం..**
ఐదేళ్లపాటు ఎలాంటి నిర్వహణ లేక ఖాళీగా ఉన్న హుద్‌హుద్ గృహసముదాయాలు ఆకతాయిలకు అడ్డాగా మారాయి. వీటిలోని విలువైన విద్యుత్తు ఉపకరణాలు, తలుపులు, కిటికీలు ఎత్తుకెళ్లారు. అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా చేశారు. రూపు కోల్పోయిన గృహ సముదాయాలను మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలంటే రూ.9.05 కోట్లు అవసరమవుతాయని గృహనిర్మాణశాఖ అధికారులు తాజాగా అంచనాలు తయారు చేశారు. ఆ ప్రాంతాలకు విద్యుత్తు సౌకర్యం, తాగునీరు, రహదారులు వంటి మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నారు.

**సౌకర్యాల్లేక అగచాట్లు..**
టెక్కలిలో జీప్లస్2 విధానంలో నిర్మించిన 192 ఇళ్లలో 90 గృహాలను గతేడాది నవంబరు 30న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పంపిణీ చేశారు. పదినెలలు దాటినా ఇక్కడ నేటికీ విద్యుత్తు, తాగునీటి సౌకర్యం కల్పించలేదు. పాడైన విద్యుత్తు తీగలు, కిటికీలు, తలుపులను లబ్ధిదారులే రూ.వేలల్లో ఖర్చుచేసి బాగుచేసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు ఏర్పాటుకు రూ.10 లక్షలు నిధులు సమకూర్చలేక చేతులెత్తేశారు. కనీస రహదారి సౌకర్యం సైతం లేక అంధకారంలోనే కొంతమంది తలదాచుకుంటున్నారు.

**రాత్రివేళ భయమేస్తోంది- పల్లేల మంగమ్మ, లబ్ధిదారు, టెక్కలి**
రెండు కాళ్లు పనిచేయని వికలాంగురాలిని. సొంత ఖర్చులతో గృహాలకు మరమ్మతులు జరిపించుకున్నాం. విద్యుత్తు సౌకర్యం లేక చీకటి పడితే దీపం బుడ్డీ వెలుగులోనే ఉంటున్నాం. రాత్రివేళ ఆకతాయిల సంచారంతో భయమేస్తోంది. ఏ సౌకర్యాలు లేకపోయినా 30 వరకు కుటుంబాలు ప్రస్తుతం నివాసం ఉంటున్నాం. ప్రభుత్వం స్పందించి ఇబ్బందులు తీర్చాలి.

**ప్రతిపాదనలు పంపించాం-నగేష్, పీడీ, గృహనిర్మాణ సంస్థ, శ్రీకాకుళం**
టెక్కలి, పలాస ప్రాంతంలో హుద్‌హుద్ ఇళ్లు నిర్మించి చాలాకాలం వదిలేయడంతో సామగ్రి ధ్వంసమైంది. వాటికి మరమ్మతులు, ఇతర మౌలిక వసతుల కల్పనకు రూ.9.05కోట్లతో అంచనాలు రూపొందించి ఇటీవల ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు జరిపిస్తాం.

# పేదలకు అండగా ఆరోగ్యానికి తోడుగా!!





విశాఖపట్నం: విశాఖలోని హనుమంతువాక వద్ద ఉన్న 'విమ్స్'లో అత్యాధునిక వైద్యుసేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. గతంలో ఉన్న సమస్యలను అధిగమిస్తూ ఒక్కో విభాగాన్ని బలోపేతం చేస్తున్నారు.ఆరు నెలల్లో 1016 ఎండోస్కోపీలు: విమ్స్‌లో న్యూరో సర్జరీ విభాగంలో రూ.4 కోట్ల విలువైన ఎండోస్కోపిక్, క్యూసా, నేవిగేషన్, మైక్రోస్కోప్ తదితర అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. న్యూరాలజీ విభాగంలో అయిదుగురు వైద్య నిపుణులున్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.3 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చయ్యే ఎండోస్కోపీ, కొలనోస్కోపీ, ఈఆర్‌సీపీ, ఎండో అల్ట్రాసోనోగ్రఫీని ఉచితంగా చేస్తున్నారు. గత ఆరు నెలల్లో 1016కు పైగా ఎండోస్కోపీలు నిర్వహించారు. జిల్లాలో సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం విమ్స్‌లో మాత్రమే అందుబాటులో ఉంది. ఇక్కడ క్లిష్టమైన శస్త్రచికిత్సలను లాప్రోస్కోపీ ద్వారా చేస్తున్నారు.
ఇక్కడికి తీసుకువస్తే: బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన వ్యక్తికి వెంటనే చికిత్స అందిస్తే కోలుకునే అవకాశాలు ఎక్కువని వైద్యులు చెబుతున్నారు. ఆలస్యం చేస్తే ఆ వ్యక్తి పూర్తిగా మంచానికే పరిమితమయ్యే ప్రమాదముందంటున్నారు. పక్షవాతానికి గురై కుప్పకూలిపోయినవారికి తొలి మూడు గంటలు గోల్డెన్ అవర్‌గా పేర్కొంటారు. ఆ సమయంలోగా రోగికి సీటీ స్కాన్ చేసి, 'టెనెక్టప్లాస్' ఇంజక్షన్ చేస్తే ప్రాణాపాయం నుంచి బయటపడతారు. దీంతోపాటు కార్పొరేట్ ఆసుపత్రుల్లో భారీగా ఖర్చయ్యే వైద్య సేవలను విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్)లో ఉచితంగా అందిస్తున్నారు.

**ఈ లక్షణాలు కనిపిస్తే:** మూతి వంకరపోవడం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు రావడం, మాటల్లో తడబాటు తదితర లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయవద్దని వైద్యులు సూచిస్తున్నారు. తొలి మూడు గంటల్లోగా విమ్స్‌కు వస్తే వెంటనే సీటీ స్కాన్, సీటీ యాంజియో పరీక్షలు చేసి చికిత్స ప్రారంభిస్తున్నారు.ఆరిలోవ ప్రాంతానికి చెందిన జగన్నాథరావు (70)కు పక్షవాతం రావడంతో కుప్పకూలిపోయాడు. బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైనట్లు గుర్తించిన వైద్యులు రూ.55 వేల విలువైన ఇంజక్షన్ చేశారు. తర్వాత రక్తం గడ్డ కట్టకుండా ఔషధాలు ఇవ్వడంతో పరిస్థితి మెరుగుపడింది. వారం రోజుల్లోనే పూర్తిగా కోలుకున్నారు. ఇలా పలువురికి చికిత్స అందించారు.

**యువకుడికి ప్రత్యేక చికిత్స..:** నగరానికి చెందిన 26 ఏళ్ల యువకుడికి క్లోమ గ్రంథికి సమీపంలో ఒక గడ్డ ఏర్పడింది. దీన్ని వైద్య పరిభాషలో 'సూడో ప్రాంకియాటిక్ సిస్ట్'గా అభివర్ణిస్తారు. కొన్ని సందర్భాల్లో దానికి చికిత్స కష్టతరమవుతుంది. చికిత్సకు ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ. లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు ఖర్చవుతుంది. ఇటీవల ఆ యువకుడిని విమ్స్‌కు తీసుకురాగా ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ (ఈయూఎస్) ద్వారా మెటాలిక్ స్టెంటు వేశారు. దీంతో రోగి రెండు రోజుల్లోనే కోలుకున్నాడు. దీనికి సాధారణంగా ప్లాస్టిక్ స్టెంటు వేస్తుంటారని, రాష్ట్రంలోనే తొలిసారిగా విమ్స్‌లో మెటాలిక్ స్టెంటు వేసినట్లు అక్కడి వైద్యులు చెబుతున్నారు.

**ఆ సమస్య గట్టెక్కేందుకు:** ఆసుపత్రిలో హౌస్‌సర్జన్లు, పీజీలు, సీనియర్ రెసిడెంట్లు అందుబాటులో లేరు. దీంతో శస్త్రచికిత్స జరిగిన రోగుల పర్యవేక్షణకు వీలుగా తక్కువ సంఖ్యలోనే శస్త్రచికిత్సలు చేస్తున్నారు. పీజీ మెడికల్ కళాశాలకు అనుమతులు వస్తే శస్త్రచికిత్సల సంఖ్య పెరిగేందుకు అవకాశముంటుంది.

**ఒక్కో విభాగం అభివృద్ధి:** ఉత్తరాంధ్ర వాసులకు సూపర్ స్పెషాలిటీ సేవలు మరింతగా అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో అధునాతన పరికరాలను సమకూర్చుకుంటున్నాం. క్రమంగా ఒక్కో విభాగాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఉత్తరాంధ్ర ప్రజలు వీటిని వినియోగించుకోవాలి. చికిత్స అవసరమైనవారు నేరుగా ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించవచ్చు.డాక్టర్ కె.రాంబాబు, డైరెక్టర్, విమ్స్

# జీతాలు ఇవ్వడం లేదని చెత్త వేసి..

ఏలూరు : అయిదు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదంటూ పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటా సేకరించిన చెత్తను తీసుకొచ్చి గ్రామ సచివాలయం వద్ద కుప్పలుగా వేసి నిరసన తెలిపారు. ఏలూరు మండలం జాలిపూడి గ్రామ పంచాయతీలో నలుగురు కార్మికులు జూన్‌లో విధుల్లో చేరారు. అప్పటి నుంచి జీతాలు ఇవ్వడం లేదని వారు గ్రామంలో సేకరించిన చెత్త తీసుకొచ్చి సచివాలయం వద్ద వేశారు. సిబ్బంది వచ్చేసరికి చెత్తకుప్పలు దర్శనమివ్వడంతో ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు.



ఎంపీడీవో శ్రీలత, ఏలూరు గ్రామీణ పోలీసులు, చాటపర్రు పంచాయతీ కార్యదర్శి వర్మ సచివాలయం వద్దకు వచ్చారు. పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. జీతాలు ఇవ్వకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని గానీ.. ఇలా సచివాలయం ఎదుట చెత్త వేయడం సబబు కాదన్నారు. సెలవులో ఉన్న పంచాయతీ కార్యదర్శి కుమార్, సర్పంచి వీధి నవ్యతో ఎంపీడీవో ఫోన్లో మాట్లాడారు. చెత్త వేసిన వారిపై కేసు పెట్టాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని, తక్షణమే సచివాలయం వద్ద చెత్తను తొలగించాలని సూచించగా కార్మికులు తొలగించారు.

# ఎర్రకాలువ.. ఎవరికీ పట్టదు!

జంగారెడ్డిగూడెం : వేల ఎకరాలకు సాగు, తాగునీరందించే జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెంలోని కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం నిర్వహణను అధికార యంత్రాంగం గాలికి వదిలేసింది. ప్రధాన ఏటిగట్టు వెంబడి పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయి అభయారణ్యాన్ని తలపిస్తున్నాయి. దారి మూసుకుపోయి రాకపోకలకు వీల్లేకుండా పోయింది. గట్టు వెంబడి ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు వెలగక అలంకారప్రాయంగా మారాయి. స్తంభాలకున్న దీపాలను కొందరు ఆకతాయిలు ధ్వంసం చేయగా, మరికొన్ని మరమ్మతులకు గురయ్యాయి. **కళ తప్పిన పర్యాటకం..** ఎర్రకాలువ జలాశయాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడంలో పాలకులు విఫలమయ్యారు. ఇక్కడ ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు చినవేంకన్న, మద్ది ఆంజనేయస్వామి, గుబ్బల మంగమ్మ, పారిజాతగిరి ఆలయాలతో పాటు గుంటుపల్లి బౌద్ధారామాలున్నాయి. ఆయా పర్యాటక ప్రాంతాలకు జలాశయం దగ్గరగా ఉండటంతో పెద్ద సంఖ్యలో పర్యాటకులు వచ్చే అవకాశముంది. త్వరలో కార్తిక మాసం ప్రారంభం కానుంది. 'నిధుల కొరతతో అభివృద్ధి పనులు నిలిచాయి. గట్టుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగిస్తాం' అని జలవనరుల శాఖ డీఈ ఎం.రాంబాబు తెలిపారు.

**గండి పూడ్చక మీనమేషాలు..** జలాశయం నుంచి కుడి కాలువ ప్రధాన రెగ్యులేటర్ వద్దకెళ్లే మార్గంలో గట్టు కోతకు గురై బలహీనపడుతోంది. 2018 ఆగస్టులో సంభవించిన వరదలకు జలాశయం ప్రధాన కాలువ డ్రాఫ్ట్ వద్ద కుడివైపున గండి పడి వందలాది ఎకరాలు నీటమునిగాయి. ఆ గండి నేటికీ పూడ్చకపోవడం గమనార్హం.

# కార్తిక స్నానం.. అవస్థలమయం

కొవ్వూరు : గౌతమ మహర్షి తపఃఫలంతో ఉద్భవించిన గోదావరి తీరం అధ్వాన భరిత ప్రదేశంగా మారుతోంది. ఆలయాల సమాహారమైన కొవ్వూరు గోష్పద క్షేత్రాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దడం మాటెలా ఉన్నా కనీసం శుభ్రతగా.. భద్రత కల్పిస్తే చాలన్న భావన భక్తులకు కలుగుతోంది. ప్రాతఃకాలంలో పుణ్యస్నానం చేసి సూర్యభగవానుడికి అర్ఘ్యం ఇద్దామంటే గోదావరి వ్యర్థ ఘోష చేస్తోంది. క్షేత్రానికి వస్తే పుణ్యమే కానీ స్నానం చేయలేం అన్న చందంగా ఈ ప్రదేశం మారింది. పురాణ ప్రాశస్త్యంతో ఆధ్యాత్మిక వైభవ ప్రతీకగా భావించిన భక్తులు ఏమిటీ ఈ దుస్థితి అని ఆవేదన చెందుతున్నారు. యంత్రాంగం పర్యవేక్షణ లోపం, పాలకుల అలసత్వం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. పర్వదినాలు, విశేష కార్యక్రమాల సమయాల్లో పురపాలక, జలవనరులు, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, మత్స్యశాఖలు అప్పటికపుడు



ఏర్పాట్లు చేసినా ఆ మర్నాటి నుంచే ఇక్కడి వెతలు యథాతథంగా దర్శనమిస్తున్నాయి. 2015 పుష్కరాల వేళ యాత్రికుల కోసం క్షేత్రంలోని మూడు రేవులను కలిపి 197 మీటర్ల పొడవున ప్రధాన ఘాట్‌ను నిర్మించి ఆధునికంగా తీర్చిదిద్దారు. రేవు పొడవునా రక్షణ వలయం ఏర్పాటు చేసినా ఏడాదికే ఆ వలయం మాయమైంది.

**ఆదమరిచి దిగితే అంతే...**
ప్రధాన రేవులో మెట్లు నాచు పట్టి అడుగేస్తే అంతే సంగతులు అనే చందంగా మారాయి. ఎంత జాగ్రత్తగా దిగినా జారి పడటం తథ్యమన్న భావనతో భక్తులు వెనుకాడే పరిస్థితి ఉంది. పొడవునా పూజా ద్రవ్యాల వ్యర్థాలు, ఇతర చెత్తాచెదారాలు, అపర కర్మలకు వచ్చిన వారు విడిచిన దుస్తులు రేవు, ఆ పరిసరాల్లోనే కనిపిస్తున్నాయి.

**మహిళా భక్తుల అగచాట్లు..**
పుణ్యస్నానాలు చేసే మహిళా భక్తులు దుస్తులు మార్చుకోవడం పరీక్షగా మారుతోంది. మెట్ల వద్ద తాత్కాలిక రీతిలో దుస్తులు మార్చుకునే గదికి తలుపులు సరిగా లేవు. ఎక్కడికక్కడ రేకులు లేచిపోయాయి. రావిచెట్టు వద్ద గదికి చుట్టూ రేకులు లేవు. దీంతో మహిళా భక్తులు ఆ తడి దుస్తులతోనే దర్శనం చేసుకుని వెనుదిరగాల్సి వస్తోంది. ఎవరికి చెప్పాలో కూడా అర్థం కాని దుస్థితి వారిది.

చురకలు

ఆదివారం 3 నవంబర్ 2024

# పొదుపు.. భవితకు మదుపు

మల్కాపురం : విశాఖ నగరంలోని వివిధ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు పొదుపు మంత్రం పాటిస్తున్నారు. వారి సౌలభ్యం కోసం యాజమాన్యాలు ఏళ్ల కిందటే థ్రిఫ్ట్ సొసైటీలు ఏర్పాటు చేసి ప్రోత్సాహం అందిస్తున్నాయి. నేడు 'ప్రపంచ పొదుపు దినోత్సవం' సందర్భంగా ఆయా సొసైటీల ప్రస్తుత పరిస్థితిపై కథనం.

**బీహెచ్‌పీవీలో..:** బీహెచ్‌పీవీ(భారత్ హెవీ ప్లేట్ అండ్ వెసెల్స్ లిమిటెడ్) ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగుల కో-ఆపరేటివ్ పొదుపు, పరపతి సొసైటీ లిమిటెడ్‌ను 1972లో స్థాపించారు. తొలుత 56 మంది సభ్యులతో రూ.6.5 లక్షల టర్నోవర్‌తో ప్రారంభమైంది. తర్వాత సభ్యుల సంఖ్య 5,850కి చేరింది. వారి పొదుపుపై 13 శాతం వడ్డీ ఇచ్చేవారు.

**మారిన పరిణామాలు..**

కొన్నేళ్లకు బీహెచ్‌పీవీ నష్టాల బాట పట్టింది. దీంతో సంస్థ యాజమాన్యం రూ.3.70 కోట్ల మేర బకాయిలు పెట్టడంతో పొదుపు సంఘం నష్టాల్లో కూరుకుపోయింది. ప్రస్తుతం సొసైటీలో 382 మంది సభ్యులే ఉన్నారు. ఆ తర్వాత బీహెచ్‌పీవీ... భెల్‌లో విలీనమవడంతో భెల్ ఉ




ద్యోగుల కో-ఆపరేటివ్ పొదుపు, పరపతి సొసైటీ లిమిటెడ్‌గా మారింది. నేడు సుమారు రూ.4.5 లక్షల టర్నోవర్‌తో సభ్యుల పొదుపుపై 8 శాతం వడ్డీ ఇస్తున్నారు. ఈ ఏడాది సొసైటీకి సుమారు రూ.3.5 లక్షల లాభం వచ్చింది. ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులకు రూ.6 లక్షల రుణం మంజూరుకు, పొదుపుపై వడ్డీ 12 శాతానికి పెంచేందుకు నిర్ణయించారు.

**ఉక్కునగరంలో..**

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల సహకార పొదుపు, పరపతి సంఘం లిమిటెడ్‌ను 1986లో ఉక్కునగరం సెక్టార్-1లో రష్యన్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేశారు. తొలుత 99 మంది సభ్యులతో సంస్థ ప్రారంభమైంది. నాటి నుంచి మెరుగైన సేవలు అందిస్తూ..1998లో రాష్ట్రంలోనే ఉత్తమ ఉద్యోగుల సహకార సంఘంగా గుర్తింపు తెచ్చుకుంది.

కర్మాగారంలో పని చేసే శాశ్వత ఉద్యోగులకు సభ్యులుగా చేరే అవకాశం ఉంటుంది. తొలుత ఒక్కో షేర్ రూ.10 చొప్పున కనీసం 30 షేర్లు కొనుగోలు చేయాలి. గరిష్ఠంగా 750 షేర్లు తీసుకోవచ్చు.

పొదుపు ఖాతా, స్వచ్ఛంద పొదుపు ఖాతా, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, దీర్ఘకాలిక రుణం, మధ్యకాలిక రుణం, రిటైర్‌మెంట్ బెనిఫిట్ ఫండ్ స్కీమ్, సూపర్ యాన్యుయేషన్ బెనిఫిట్ ఫండ్ స్కీమ్, మరణ సహాయ నిధి... తదితర సదుపాయాలు ఉన్నాయి. 2023-24 ఏడాదికి రూ.5.07 కోట్ల లాభం వచ్చింది. షేర్ క్యాపిటల్ రూ.7.90 కోట్లుగా, పెట్టుబడులు రూ.22.15 కోట్లుగా, టర్నోవర్ రూ.316 కోట్లుగా ఉంది. ప్రస్తుతం 12,527 మంది సభ్యులు ఉన్నారు.

**హిందుస్థాన్ షిప్‌యార్డులో..**

పారిశ్రామిక ప్రాంతం గాంధీగ్రాం ది హిందుస్థాన్ షిప్‌యార్డ్ వర్కర్స్ కో-ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్‌ను 1989లో స్థాపించారు. 296 మంది సభ్యులు, రూ.1.16 కోట్ల టర్నోవర్‌తో ప్రారంభమైన సంస్థ... నేడు 1714 మంది సభ్యులతో రూ.5.86 కోట్ల టర్నోవర్‌తో నడుస్తుంది.

# దొరికినంత దోచుకో..!

పుత్తూరు : 2009 అక్టోబరు 16న రాత్రి తమిళనాడులోని పళ్లిపట్టులో టపాసుల గోదాంలో టపాసుల కొనుగోలుదారులు అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ సమయంలో కరెంటు పోయింది. దీంతో గోదాం యజమాని షటర్ మూశారు. చీకటి అలుముకోవడంతో ఓ వ్యక్తి అగ్గిపెట్టె తీసి వెలిగించారు. దీంతో అక్కడి నల్ల మందు అంటుకుని మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో 32 మంది దుర్మరణం చెందారు. అందులో కార్వేటినగరానికి చెందిన ఆరుగురు మృతి చెందారు. ఎస్ఆర్‌పురానికి చెందిన వారూ ప్రాణాలు కోల్పోయారు. అప్పటి నుంచి పట్టణాలకు దూరంగా దుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది.

దీపావళి వచ్చిదంటే చాలు హెూల్‌సేల్ టపాసుల వ్యాపారం చేసే దుకాణాదారులకు కాసులు కురిపిస్తున్నాయి. సామాన్య, పేద ప్రజలు



టపాకాయలు ముట్టుకోవాలంటే మతాబులు పేలినట్లు ధరలు పేలుతున్నాయి. గతంలో ఎక్కడో ఓ హెూల్‌సేల్ దుకాణం ఉండేది. వైకాపా ప్రభుత్వంలో ఇబ్బడిముబ్బడిగా హెూల్‌సేల్ దుకాణాలకు లైసెన్సులు ఇచ్చేశారు. దీనికి తోడు హెూల్‌సేల్ దుకాణాదారులు తాత్కాలికంగా లైసెన్సులు పొంది నిరంతరం అమ్మేస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు.

**ఇద్దరికి మాత్రమే లైసెన్సులు**

తిరుపతి, చిత్తూరు జిల్లా మొత్తం మీద ఇద్దరికి మాత్రమే హెూల్‌సేల్ లైసెన్సులున్నాయి. మిగిలిన వారంతా తాత్కాలికంగా తీసుకుని స్థానికంగా ఉన్న పోలీసులు, అగ్నిమాపకశాఖ, వాణిజ్య పన్నులు, రెవెన్యూ శాఖ అధికారులకు ముడుపులు ముట్టజెప్పి నిరాటంకంగా విక్రయాలు చేపడుతుండడం గమనార్హం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం, రామచంద్రాపురం, వడమాలపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి, రేణిగుంట తదితర ప్రాంతాల్లో తాత్కాలిక లైసెన్సులు పొందిన వారంతా నిరంతరం టపాకాయలు అమ్మేస్తుండటం గమనార్హం.

**నిబంధనలు తుంగలో తొక్కి...**

హెూల్‌సేల్ టపాసులు విక్రయించే దుకాణదారులు విధిగా కాంక్రీట్ భవనంలో ప్రమాదం జరిగితే మంటలు వ్యాపించకుండా ఆటోమేటిక్ వాటర్ లైన్లు ఏర్పాటు చేయాలి. గాలి, వెలుతురు విశాలమైన స్థలం ఉండాలి. తిరుపతి, చిత్తూరులో మాత్రమే అలా నిర్వహిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో ఎక్కడా నిబంధనలు పాటించడం లేదు. అయినా ఏటా వ్యాపారాలు జరిగిపోతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. చిత్తూరు, తిరుపతి జిల్లాలో కొందరు విశాఖపట్నం లైసెన్సులు తీసుకుని వ్యాపారాలు చేస్తున్నారు.

**బిల్లులు ఇవ్వాల్సిందే..**

టపాసులు కొనుగోలు చేసిన అందరికీ బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి. లేని పక్షంలో వారిపై కేసులు నమోదు చేస్తాం. దీనికి తోడు నిబంధనలు కచ్చితంగా పాటించాలి. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం. వరలక్ష్మి, సీటీవో, చిత్తూరు-2

# గోదాము నిర్మాణాలకు గ్రహణం



మడకశిర : ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయ గోదాముల నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర దక్కే వరకు రైతులు గోదాముల్లో నిల్వ ఉంచుకోవాలనే ఉద్దేశంతో గత వైకాపా ప్రభుత్వం వీటి నిర్మాణాలు చేపట్టింది. అనంతపురం జిల్లాలో 102, పుట్టపర్తి జిల్లాలో 93 ఆర్‌బీకేలను ఎంపిక చేసింది. ఒక్కో ఆర్బీకే పరిధిలో 50 సెంట్లలో గోదాము నిర్మించేలా ప్రణాళికలు రూపొందించింది.

500 టన్నుల సామర్థ్యం గల గోదాముకు ఆప్కాబ్ ద్వారా నాబార్డు నిధులు రూ.36 లక్షలు, సహకార సంఘం ద్వారా రూ.4 లక్షలు, అదే వెయ్యి టన్నుల సామర్థ్యం అయితే నాబార్డు నిధులు రూ.73.08 లక్షలు, సహకార సంఘం రూ.8.02 లక్షలతో నిర్మాణాలు ప్రారంభించారు. సకాలంలో బిల్లులు మంజూరు చేయకపోవడంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. సుమారు రూ.10 కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉందని దస్త్రాలు స్పష్టం చేస్తున్నారు.

**తప్పని అవస్థలు..**

గోదాములు అందుబాటులో లేకపోవడంతో రైతులు తమ పంట ఉత్పత్తులను నిల్వ ఉంచుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్లో గిట్టుబాటు ధర పలికే వరకు వారు పంటలను ఇళ్లు, కల్లాలు తదితర చోట్ల నిల్వ ఉంచుకుంటున్నారు. విపత్తులు, ప్రమాదాలు సంభవిస్తే దిగుబడులు కాలిపోయి లేదా తడిసి తీవ్ర నష్టాలు మూటగట్టుకోవాల్సిన పరిస్థితి. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి గోదాములను వినియోగంలోకి తీసుకురావాలని అన్నదాతలు కోరుతున్నారు.

అనంతపురం జిల్లాలోని పెద్దవడుగూరు మండలంలో రైతులు పత్తి పంటను సుమారు 30వేల ఎకరాల్లో సాగు చేస్తారు. ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఇక్కడ పంట ఉత్పత్తులు నిల్వ ఉంచుకోవడానికి సరిపడా గోదాములు అందుబాటులో లేవు. దాంతో రైతులు పత్తి దిగుబడులను ఇళ్లు, కల్లాల్లో నిల్వ ఉంచుకోవాల్సిన పరిస్థితి. ఏదైనా ప్రమాదాలు, విపత్తులు సంభవిస్తే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.

**పంట వర్షానికి తడిసి నష్టపోయా**

నాలుగెకరాల్లో సాగు చేసిన ఆముదం పంటను కోత కోసి రోడ్డుపై ఆరబోశాం. 18 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. గత వారం రోజులుగా ఇంటికి వెళ్లకుండా ఇక్కడే ఉంటున్నాం. మార్కెట్లో క్వింటా ధర రూ.5,600 ఉంది. అకాల వర్షానికి పంట తడవడంతో వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారు. ప్రభుత్వ గోదాములు అందుబాటులో ఉండి ఉంటే పంటను నిల్వ చేసుకొనేవాళ్లం. ప్రభుత్వం గోదాముల పూర్తికి ప్రత్యేక చొరవ తీసుకోవాలి.అక్కులప్ప, రైతు, పాతచెరువు, కళ్యాణదుర్గం మండలం **బిల్లులు రాక పోవడంతోనే..** ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో గోదాముల నిర్మాణాలు కొన్ని తుది దశలో ఉన్నాయి. బిల్లులు రాకపోవడంతోనే పనులు ఆగిపోయాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే బిల్లులు మంజూరైతే నిర్మాణాల పూర్తికి చర్యలు చేపడతాం.రఘునాథ్, వ్యవసాయ మార్కెటింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు

# ధ్రువపత్రాలు భద్రం




అనంతపురం : డిగ్రీ చదువుకున్న మహేశ్ ఒక కంపెనీ నుంచి ఇంటర్వ్యూకు రావాలని పిలుపొచ్చింది. ఆ సమయంలో మహేశ్ తమిళనాడులో ఉన్నాడు. ధ్రువపత్రాలు విజయవాడ ఇంటి వద్ద ఉండిపోయాయి. అందుబాటులో ధ్రువపత్రాలు లేక ఇంటర్వ్యూ చేజారిపోయింది. చాలా మంది ఉన్నత చదువులు చదువుకున్నవారు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే సమయంలో సకాలంలో విద్యార్హత ధ్రువపత్రాలు అందుబాటులోకి లేకపోవడంతో అవకాశాలను కోల్పోతున్నారు. మన దగ్గర ధ్రువపత్రాలు అందుబాటులో ఉండేలా కేంద్ర ప్రభుత్వం అధీకృత డీజీ లాకర్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో విద్యార్హత ధ్రువపత్రాలతో పాటు అన్ని రకాల పత్రాలను భద్రపరుచుకోవచ్చు. ఇటీవల పలు యూనివర్సిటీలు తమ పరిధిలోని డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ విద్యార్హతలతో పాటు ఈ డీజీ లాకర్ ఐడీని ఏర్పాటు చేసి ధ్రువపత్రాలు భద్రపరుచుకునే చర్యలు చేపడుతున్నారు. గతంలో ఈ సదుపాయం లేక చాలా మంది ఈమెయిల్‌లో భద్రపరచుకునేవారు. విద్యా నిపుణులు సైతం కేంద్రం ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ యాప్ ఎంతో సురక్షితమని చెబుతున్నారు. ఒక ప్రైవేటు కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సురేశ్‌కు ఒక రోజు ఎంఎన్‌సీ కంపెనీ నుంచి ఫోన్‌కు సందేశం వచ్చింది. మీరు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగానికి తక్షణమే ఇంటర్వ్యూకు రావాలని ఆ సందేశంలో పేర్కొన్నారు. సురేశ్ వద్ద చదువుకు సంబంధించిన ధ్రువపత్రాలు సిద్ధంగా లేవు. ఇంటికి ఫోన్ చేద్దామంటే అందరూ విహారయాత్రలకు వెళ్లిపోయారు. దీంతో మంచి జీతంతో ఉండే ఉద్యోగం అవకాశం చేజారిపోతుందని ఆందోళన చెందాడు. ఆ సమయంలో డీజీ లాకర్‌యాప్‌లో భద్రపరిచిన ధ్రువపత్రాలు గుర్తుకు వచ్చి తక్షణమే యాప్ ఓపెన్ చేసి వాటిని డౌన్‌లోడ్ చేసుకుని ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. నాలుగు అంకెల జీతంతో ఉద్యోగంలో చేరాడు.

**యాప్ డౌన్‌లోడ్ ఇలా..**

ఆండ్రాయిడ్ ఫోన్‌లో ప్లేస్టోర్ ఓపెన్ చేసి డీజీ లాకర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.

మీ పేరు, పుట్టిన తేదీ, ఈమెయిల్, ఫోన్ నంబరు, ఆరు అంకెల పిన్ నమోదు చేయాలి.

ఫోన్‌కు వచ్చిన ఓటీపీ ఎంటర్ చేయగానే డీజీ లాకర్ యాప్ ప్రారంభించడానికి సిద్ధం అవుతుంది.

యాప్‌లో పాన్, ఆధార్‌కార్డులతో పాటు, పది, ఇంటర్, డిగ్రీ, పీజీ ధ్రువపత్రాల జాబితా కనిపిస్తుంది. వాటిలో మనకు కావలసిన వాటిని ఎంచుకుని ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేసుకోవాలి.

పదోతరగతి మెమో కావాలంటే బోర్డు ఎంచుకున్నాక హాల్ టికెట్ నంబరు నమోదు చేయాలి. 2004 తరవాత నుంచి ధ్రువపత్రాలు అందుబాటులో ఉన్నాయి.

ఈ యాప్‌ను క్లిక్ చేస్తే ప్లస్ సింబల్ కనిపిస్తుంది. క్లిక్ చేసి కావలసిన ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేసి దాచుకోవచ్చు.

12 రకాల భాషల్లో ఈ యాప్ అందుబాటులో ఉంది.

**ఎలాంటివి దాచుకోవచ్చంటే..?**

ఈ యాప్‌లో విద్యార్హత ధ్రువపత్రాలతో పాటు ఆధార్, రేషన్, ఆరోగ్య బీమా, ఓటరు, పాన్‌కార్డులు భద్రం చేసుకోవచ్చు. వీటితో పాటు డ్రైవింగ్ లైసెన్సు, కుల, ఆదాయ, జనన, ఆస్తి రిజిస్ట్రేషన్ పత్రాలు భద్రపరచుకోవచ్చు.

ఈ లాకర్‌తో అనుసంధానమైన ప్రభుత్వ శాఖలు అందించే పత్రాలను వీటిలో భద్రపరుచుకోవచ్చు. అందుకు ఆయా పత్రాల రిజిస్ట్రేషన్ సంఖ్య నమోదు చేస్తే చాలు. అందుకు ప్రతి లాకర్‌కు 1 జీబీ స్టోరేజి సామర్థ్యం కేటాయిస్తున్నారు. ధ్రువపత్రాలు సమర్పించడానికి యూఆర్‌ఎల్ లింక్ పంపించడానికి కొన్ని సంస్థలు అనుమతులు కూడా ఇస్తున్నాయి. దూరప్రాంతాలకు వెళ్లినప్పుడు ధ్రువపత్రాలు తీసుకెళ్లే సమయంలో పోతాయనే భయం ఉండదు. ఈ యాప్ సహాయంతో తక్షణమే ధ్రువపత్రాలు పొందవచ్చు.

# పూడికతీత.. అంతా పైపూత

సూళ్లూరుపేట : గతంలో ఏటా పురపాలికలకు ఇచ్చే పూడికతీత నిధులను వైకాపా ప్రభుత్వ పాలనలో పైసా కూడా విధించలేదు. కొద్దిపాటి వర్షం వచ్చినా పట్టణాల్లో పలు ప్రాంతాలు ముంపునకు గురవుతూ వచ్చాయి. సీజనల్ వ్యాధులు ప్రబలుతూ ప్రజలు ఆసుపత్రులకు పరుగులు తీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పురపాలికల్లో కాలువల్లో పూడికతీతకు 2011 జనాభా ప్రాతిపదికన జులై నెలాఖరులో నిధులు పురపాలిక బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. వాటితో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఉత్తర్వులిచ్చారు. అయితే క్షేత్రస్థాయిలో ఇందుకు భిన్నంగా ఉంది. పలుచోట్ల పూడికతీత చర్యలు చేపట్టకనే నిధులను ఆరగించేశారు.

**క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే..**

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పురపాలక సంఘాల్లోని కాలువల్లో నామమాత్రంగానే పూడికతీత చర్యలు చేపట్టారు. సీఎం సొంత నియోజకవర్గం కుప్పంలో మాత్రం టెండర్లు నిర్వహించి, గుత్తేదారుల ద్వారా పక్కాగా పూడిక తీయించారు. పలుచోట్ల టెండర్లు నిర్వహించకనే కమిషనర్లు తమకు నచ్చిన వారికి పనులు అప్పగించి, పైపూతగానే పనులు చేయించారు. మరికొన్నిచోట్ల ఒకటి రెండు కాలువల్లో పూడికతీసి, అంతా చేసినట్లు చేతులు దులుపుకొని నిధుల ఆరగింతకు తెర లేపారు.



**ఎక్కడ.. ఎంత వరకు?**

సూళ్లూరుపేట, నాయుడుపేట పురపాలకల్లో సంఘాల్లో పూర్తి స్థాయిలో పూడికతీత చర్యలు చేపట్టలేదు. దీంతో ఇటీవల వర్షాలకు యంత్రాలతో పూడిక తీయాల్సి వచ్చింది. పుత్తూరులో మమ అనిపించారు. గూడూరు పురపాలికలో ఇంకా పనులు జరుగుతున్నాయి. శ్రీకాళహస్తిలో 70 శాతం మేర కాలువల్లో పూడిక తొలగించారు. వెంకటగిరిలో జాతర సందర్భంగా అన్నిచోట్లా చర్యలు చేపట్టారు. పుంగనూరు, పలమనేరులో 60 శాతం మేర పనులు జరిగాయి.

# అంగన్‌వాడీలకు ఇండక్షన్ స్టవ్‌లు

చిత్తూరు : ఇంధన సామర్థ్య కార్యక్రమాల అమల్లో భాగంగా అంగన్‌వాడీలకు ఇండక్షన్ సామగ్రి సరఫరా చేయనున్నారు. ఇందుకుగాను ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్) ఆసక్తి చూపింది. తాజాగా సీఎం చంద్రబాబు సమీక్షించగా ఈ పథకాలను సద్వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలో 24 ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. సుమారుగా 1.97 లక్షల మంది లబ్ధిదారులున్నారు. వీరికి అందించే ఆహారం ఇక్కడే తయారు చేయడానికి వీలుగా వంట కోసం గతంలో సిలిండర్లు అందజేశారు. వీటికి భారం కావడంతో కొందరు కట్టెల పొయ్యి మీదే వంట చేస్తున్నారు. తాజా పరిస్థితుల్లో ఇంధన సామర్థ్య విద్యుత్తు పరికరాలు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని 4,912 కేంద్రాలకు వీటిని అందజేయనుంది.

ఇప్పటికే పట్టణాలు, పల్లె ప్రాంతాల్లో ఎల్ఈడీలు పెద్దఎత్తున ఏర్పాటు



చేయగా మరికొన్నింటిని ఇవ్వడానికి ఈఈఎస్ఎల్ ఆసక్తి చూపించింది. ఇలా అంగన్‌వాడీ కేంద్రాల్లో శుద్ధ ఇంధనంగా విద్యుత్ పరికరాల వాడకం చేపట్టనున్నారు. వీటి వల్ల ఇంధన ఖర్చు తగ్గుతుందని భావిస్తున్నారు. ఇలా ఎంపిక చేసిన కేంద్రాలకు వీటిని ఈఈఎస్ఎల్ అందజేయనుండగా ప్రభుత్వం చెల్లింపులు చేస్తోంది. పిల్లలకు అవసరమైన పాలు, ఇతర పదార్థాలు ఇక్కడే వంట చేసి అందజేయనున్నారు. కొందరికి గుడ్లు ఉడకబెట్టి ఇవ్వడం, బాలామృతం తయారీ చేసి అందించడం చేస్తారు.

# మట్టి కోసం మైదానాన్నీ వదల్లేదు!

కుప్పం : అక్రమార్కులు ధనార్జన కోసం చెరువులు, వంకల్లో తవ్వకాలు యథావిధిగా చేపడుతున్నారు. వీటితో పాటు గ్రామీణ స్థాయి క్రీడాకారులను అభివృద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ క్రీడా మైదానాన్ని సైతం వదలడం లేదు. గత వైకాపా పాలనలో క్రీడా మైదానం అభివృద్ధి పక్కన పెట్టడంతో మందుబాబులకు అడ్డాగా మార్చుకున్నారు. ప్రస్తుతం నూతనంగా ఏర్పాటైన ఎన్డీయే ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపారు. అయితే మైదానంలో యథేచ్ఛగా మట్టి కోసం జేసీబీ యంత్రాలతో తవ్వకాలు చేపడుతున్నా, అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానిక ప్రజలు,



క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీని వివరణ కోరగా.. మట్టి తవ్వకాలను సిబ్బందితో అడ్డుకుంటున్నామని తెలిపారు. ఎవరైనా తవ్వకాలు చేపడితే తమ దృష్టికి తెస్తే నియంత్రిస్తామని చెప్పారు.

# నవంబరులో 4 సరకులు

కర్నూలు : తెల్లరేషన్ కార్డుదారులకు వచ్చే నెల నుంచి నాలుగు రకాల సరకులు అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే ఎంఎల్ఎస్ పాయింట్లకు కందిపప్పు చేరింది. కార్డుదారులకు బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార, జొన్నలు పంపిణీ చేయనుంది. కచ్చితమైన తూకాలు, నాణ్యమైన సరకు సరఫరా చేసే గుత్తేదారులకు బాధ్యతలు అప్పగించింది. అక్టోబరు నెలలో 50 శాతానికిపైగా కార్డుదారులకు కందిపప్పు పంపిణీ చేశారు. నవంబరులో ప్రతి కుటుంబానికి నాలుగు వస్తువులు అందించేలా ఇప్పటికే పౌరసరఫరాల సంస్థ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే చౌక ధరల దుకాణాలకు రేషన్ సరకుల సరఫరా జోరుగా సాగుతోంది.

**పప్పన్నం దూరం చేసిన వైకాపా** బహిరంగ మార్కెట్‌లో పప్పు ధరలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో పేదలకు కందిపప్పు అందించేలా చర్యలు తీసుకోవాల్సి ఉండగా గత వైకాపా ప్రభుత్వం ఎగ్గొట్టింది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు పప్పన్నం దూరం చేసింది. కిలో కందిపప్పు రూ.160-180 వరకు పలుకుతుండటంతో పేదలు కొని తినలేని పరిస్థితి ఏర్పడింది. తమకు కందిపప్పు అందించాలని విన్నవించినా ఏమాత్రం పట్టించుకోలేదు. చివరికి పేదలకు పచ్చడి మెతుకులే దిక్కైంది.

**బియ్యానికి బదులు జొన్నలు**

నవంబరులో కార్డుదారులకు నాలుగు రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నారు. బియ్యం బదులు జొన్నలు చౌకధరల దుకాణాల్లో అందుబాటులో ఉంచనున్నారు. ప్రతి కార్డుదారుడికి 3 కిలోల చొప్పున జొన్నలు ఇవ్వనున్నారు. నాణ్యమైన జొన్నలను డీలర్లకు సరఫరా చేస్తున్నారు. కానీ 35 శాతానికిపైగా డీలర్లు జొన్నలు తీసుకెళ్లడం లేదు. డీలర్లు సరకులన్నింటినీ దుకాణాలకు తీసుకెళ్లేలా పౌరసరఫరాల అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉండగా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

**గ్రామాలకు చేరవేత**

నంద్యాల జిల్లాలో 90 శాతం మేర చౌకధరల దుకాణాలకు నిత్యావసర వస్తువులు చేరవేశారు. కర్నూలు జిల్లాలో రేషన్ సరకుల పంపిణీ కొంతమేర నత్తనడకన సాగుతోంది. ఇప్పటివరకు 70 శాతానికిపైగా సరఫరా చేశారు. కర్నూలు జిల్లాలో 1,233 చౌకధరల దుకాణాలు ఉండగా వీటి పరిధిలో 6,76,209 తెల్ల రేషన్ కార్డులున్నాయి. నంద్యాల జిల్లాలో 1,204 చౌకధరల దుకాణాలు ఉండగా 5,41,804 తెల్ల రేషన్ కార్డులున్నాయి.

**కిలో కందిపప్పు రూ.67**

నవంబరు నుంచి కిలో రూ.67 చొప్పున కందిపప్పు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 12.18 లక్షల మంది కార్డుదారులు ఉండగా 9.85 లక్షల మందికి కందిపప్పు పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ చర్యలు ముమ్మరం చేసింది. డీలర్లు డీడీలు చెల్లించి సరకు తీసుకెళ్లాల్సి ఉంది.

**తీయని ప్రణాళిక** పంచదార 95 శాతానికి పైబడి పంపిణీ చేయనున్నారు. 11.46 లక్షల మంది కార్డుదారులకు పంచదార పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల గోదాముల్లో నిల్వలున్నాయి. ఇప్పటికే 80 శాతానికిపైగా చౌకధరల దుకాణాలకు నిత్యావసరాలను చేరవేస్తున్నారు. ఏఏవై కార్డుదారులకు పంచదార కిలో రూ.14, మిగిలిన కార్డుదారులకు అర కిలో రూ.17 చొప్పున అందించనున్నారు.

# ప్లేట్‌లెట్ల పేరుతో 'దోపిడీ'

ఏలూరు: లింగపాలెం మండలం గోకవరానికి చెందిన ఓ మహిళకు ప్లేట్‌లెట్లు 20 వేలకు పడిపోయినట్లు తెలిసింది. చికిత్సతోపాటు ప్లేట్‌లెట్లు ఎక్కించేందుకు రూ.50 వేల వరకు ఖర్చవుతుందని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చెప్పారు. స్తోమత లేక ఏలూరు జిల్లా ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఇక్కడ ప్లేట్‌లెట్లు లేవని బయట ల్యాబులో కొనుగోలు చేయాలని రూ.14 వేలు ఖర్చవుతుందని చెప్పారు. ఉచితంగా చికిత్స చేస్తారని ఇక్కడికి తీసుకువచ్చామని కుటుంబ సభ్యులు చెప్పగా ప్లేట్‌లెట్లు తీసుకొస్తే వైద్యం చేస్తాం.. లేదంటే తీసుకుపొండి అంటూ వారిపై ఓ వైద్యురాలు చిందులు తొక్కారు.

నిడమర్రుకు చెందిన ఓ వ్యక్తికి డెంగీ రావడంతో భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్లేట్‌లెట్లు 17 వేలకు పడిపోయాయని చెప్పారు. ప్లేట్‌లెట్లు ఎక్కించి రూ.30 వేలు బిల్లు చేశారు. చికిత్స, ఐసీయూ ఛార్జీలకు మరో రూ.70 వేలు వసూలు చేసి ఇంటిక్జి పంపించారు. నీరసం తగ్గకపోవటంతో మరుసటి రోజు మరో ప్రైవేటు ఆసుపత్రిలో ప్లేట్‌లెట్లు పరీక్ష చేయంచగా రూ.17 వేలే ఉన్నాయి. ప్లేట్‌లెట్ల బదులు ప్లాస్మా ఎక్కించి మోసం చేశారని వైద్యుడి ద్వారా తెలుసుకున్నారు.

ఉమ్మడి జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. డెంగీ ప్రభావం కూడా చాలా ఎక్కువగా ఉంది. ప్లేట్‌లెట్ల సంఖ్య పడిపోయి ఆసుపత్రి పాలవుతున్న రోగుల సంఖ్య పెరుగుతోంది. ఏలూరు జిల్లా ఆసుపత్రిలో ప్లేట్‌లెట్ల కొరత వేధిస్తోంది. ఇదే అదనుగా ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్లేట్‌లెట్లకు బదులు ప్లాస్మా ఎక్కించి దోపిడీ చేస్తున్నారు. దీంతో పేదలు ఆర్థికంగా చితికిపోతున్నారు.

ఏలూరు జిల్లా ఆసుపత్రిలో ప్లేట్‌లెట్లను నిల్వ చేసే ఈ యంత్రం కొన్ని నెలల క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో రక్తం నుంచి ప్లేట్‌లెట్లను సేకరించే ప్రక్రియ పూర్తిగా నిలిచింది. ప్లేట్‌లెట్లను ఆ యంత్రంలో ఉండే 22-24 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉంచితేనే వినియోగానికి పనికి వస్తాయి. దీంతో రోగులు ప్రైవేటుగా కొనుగోలు చేస్తున్నారు.

వ్యాధుల కాలంలోనూ వేదనే

డెంగీ రోగుల్లో చాలా మందికి ప్లేట్‌లెట్ల సంఖ్య పడిపోతోంది. ఉమ్మడి జిల్లాలో ఏలూరు జిల్లా ఆసుపత్రిలో మాత్రమే ఉన్న ర్యాపిడ్ డోనర్ ప్లేట్‌లెట్ల యంత్రాలు మరమ్మతులకు గురి కావటంతో ఈ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ప్లేట్‌లెట్లు కావాలంటే ప్రైవేటుగా కొనాల్సిందే. ఇక్కడ వైద్యం అందక ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే స్తోమత లేక చాలా మంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ప్రైవేటుగా ప్లేట్‌లెట్లు కొనుగోలు చేయాలంటే ఒక యూనిట్ రూ.15 వేల వరకు ఖర్చవుతుంది.

ఇదే అదనుగా ప్రైవేటు ఆసుపత్రుల్లో దందా చేస్తున్నారు. ప్లేట్‌లెట్ల సంఖ్య పెరుగుతున్నా..తగ్గుతున్నట్లు చూపించి ఎక్కించాలని భయపెట్టి..ప్లాస్మా ఎక్కిస్తున్నారు. తర్వాత మళ్లీ పరీక్షించి సంఖ్య పెరిగినట్లు చూపించి బురిడీ కొట్టిస్తున్నారు. అన్ని బిల్లులు కలిపి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు.

ఈ అంశమై ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్విని వివరణ కోరగా యంత్రాల మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్లేట్‌లెట్ల సంఖ్యలో హెచ్చు తగ్గులు సాధారణం. మొదట తగ్గినా చికిత్స చేయడంతో పెరుగుదల ఉంటుంది. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు వైద్యులు దోపిడీ చేస్తున్నారు. ప్లేట్‌లెట్ల సంఖ్య తెలుసుకునేందుకు చేసే పరీక్ష ఫలితాలను మార్చేస్తున్నారు.

# పది వేల ఎకరాల్లో పంట లేనట్లే!

భీమవరం ఆంధ్రా అన్నపూర్ణగా పేరొందిన పశ్చిమగోదావరిలో వరి సాగు విస్తీర్ణం క్రమేణా తగ్గిపోతోంది. మురుగు సమస్యతో ప్రస్తుత ఖరీఫ్‌లోనే సుమారు పది వేల ఎకరాలను రైతులు నాట్లు వేయకుండా వదిలేశారు. భీమవరం, నరసాపురం, ఆచంట, ఉండి తదితర నియోజకవర్గాల్లోని పల్లపు ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. మరోవైపు జులై నుంచి సెప్టెంబరు తొలి వారం వరకు కొనసాగిన అధిక వర్షాలు, వరదలతో వేలాది ఎకరాల్లో వరి చేలు ముంపు బారిన పడ్డాయి.తప్పిన అంచనాలు..

అయిదేళ్ల వైకాపా పాలనలో మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేసిన దాఖలాలు లేవు. ఆ వైఫల్యమే అన్నదాతలకు శాపంగా మారింది. ప్రస్తుత ఖరీఫ్ ప్రారంభ దశలో జిల్లా వ్యాప్తంగా 2,11,664 ఎకరాల విస్తీర్ణంలో వరి నాట్లు పడినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. జులైలో కురిసిన అధిక వర్షాలతో వేలాది ఎకరాల్లో నారుమడులు, నాట్లు వేసిన చేలు ముంపుబారిన పడ్డాయి. సగటున ప్రతి ఎకరానికి నాట్లేసిన చోట్ల రూ.13 వేలు, నారుమడి దశలో రూ.7 వేల చొప్పున రైతులు నష్టపోయారు. వీరికి ప్రభుత్వం 80 శాతం రాయితీపై విత్తనాలు అందజేసింది. ఇలాంటి తరుణంలో సాగు కాలాన్ని అందుకునేందుకు కొందరు అధిక ధరకు నారు కొనుగోలు చేసి నాట్లేశారు. ఆగస్టు నెలాఖరు నుంచి సెప్టెంబరు తొలి వారం వరకు కురిసిన అధిక వర్షాలతో వేలాది ఎకరాల్లో చేలు ముంపులో చిక్కుకున్నాయి. తాజా లెక్కల ప్రకారం 2,01,550 ఎకరాల్లోనే పూర్తిస్థాయిలో నాట్లు పడ్డాయని అధికారులు తేల్చారు. అతివృష్టి ప్రభావంతో 10,114 ఎకరాల్లో



భూములను సాగు చేయకుండా వదిలేశారు.

భీమవరం మండలం కొమరాడ- అనాకోడేరు గ్రామాల సరిహద్దులో నాట్లు వేయకుండా వదిలేసిన పొలాలివి. గత అయిదేళ్లలో మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా మారడంతో చేలలో నీరు బయటకు వెళ్లే మార్గం లేక రైతులు తమ పొలాలను సాగు చేయకుండా వదిలేశారు. ప్రస్తుత ఖరీఫ్‌లో కేవలం ఈ రెండు గ్రామాల్లోనే దాదాపు 2 వేల ఎకరాల్లో సాగు విరమించుకున్నారు.

ముంచిన అతివృష్టి

మరోపక్క అధిక వర్షాలు, ముంపు ప్రభావంతో 122 గ్రామాల్లో 8,758 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. ఈ విస్తీర్ణంలో కొంత మేర చేలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మిగిలిన ప్రాంతాల్లో దిగుబడి సగానికి పైగా పడిపోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ముంపు కారణంగా జిల్లాలో 6,128 మంది సాగుదారులు నష్టపోయారని, ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వరరావు చెప్పారు. ఖరీఫ్‌లో నాట్లేయని చోట్ల రబీ సాగు త్వరగా చేపట్టేలా రైతులు సిద్ధపడాలని సూచించారు.

# విద్యాశాఖలో అవినీతి జలగలు



అనంతపురం : అవినీతి జలగలు విద్యాశాఖను పట్టిపీడిస్తున్నాయి. కొన్నేళ్లుగా ఒకేచోట పాతుకుపోయి అక్రమ సంపాదనకు అలవాటుపడ్డాయి. ప్రతి పనికీ ధర నిర్ణయించి వసూలు చేస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, నిబంధనలు పాటించని ప్రభుత్వ ఉపాధ్యాయుల నుంచి నెలనెలా డబ్బులు వసూలు చేసి రూ.లక్షలు వెనకేస్తున్నారు. అవినీతి సంపాదనలో జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు ప్రతి నెలా వాటాలు సమర్పించుకుంటున్నారు. మండలాల్లోని అధికారులపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా ఉన్నతాధికారులు బుట్టదాఖలు చేస్తున్నారు.

**పురపాలికల్లో ఇష్టారాజ్యంగా..**

అనంతపురం, హిందూపురం, తాడిపత్రి, పుట్టపర్తి, కదిరి, ధర్మవరం పురపాలికల్లో పదుల సంఖ్యలో ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ప్రతి పాఠశాల అగ్నిమాపక, ట్రాఫిక్, ఆర్అండ్‌బీ శాఖల నుంచి ఎన్‌వోసీలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతి బడికి ఎకరా విస్తీర్ణంలో మైదానం ఉండాలి. విద్యార్థులు, సిబ్బందికి ప్రత్యేక మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం, ప్రహరీ తదితర 20 రకాల నిబంధనలు పాటించాలి. చాలాచోట్ల ఇరుకైన అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు.

**లంచం ఇస్తేనే పునరుద్ధరణ**

ఉమ్మడి జిల్లాలో సుమారు 900 వరకు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో అత్యధిక శాతం నిబంధనలు పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్ని బడులను రేకుల షెడ్లలో నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు వాటికి అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఒక్కో ప్రైవేటు పాఠశాల నుంచి రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు తీసుకుని అనుమతులను పునరుద్ధరిస్తున్నారు. లంచాలకు అలవాటుపడిన అధికారులు మూడో అంతస్తులో ఉన్న పాఠశాలలకు సైతం అనుమతులు ఇచ్చేస్తున్నారు. కొత్త పాఠశాలలకు అనుమతి ఇవ్వాలంటే చేయి తడపాల్సిందే.

**ప్రభుత్వ ఉపాధ్యాయుల నుంచి..**

ప్రభుత్వ ఉపాధ్యాయులు వ్యక్తిగత పనులకు సెలవు తీసుకుని.. వాటిని మెడికల్ లీవ్‌గా మార్చుకుంటూ జీతం పొందుతున్నారు. ఈ విషయంలో అధికారులు ఒక్కొక్కరి నుంచి రూ.10 వేలు వసూలు చేస్తున్నారు. సర్దుబాటుకు సంబంధించి ఉపాధ్యాయులకు నచ్చిన చోటును కేటాయిస్తున్నారు.

తాడిపత్రి మండలంలో 90 ప్రైవేటు బడులకు గాను పదింటికి మాత్రమే ఆట మైదానాలున్నాయి. మరుగుదొడ్ల సౌకర్యం అంతమాత్రమే. లంచాలకు అలవాటు పడిన అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.అనంతపురంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు అనుమతులు లేకపోయినా అధికారులు పెద్దమొత్తంలో ముడుపులు తీసుకుని వదిలేశారు. రుద్రంపేట సమీపంలోని ఓ ప్రయివేటు పాఠశాలను మరో చోటుకు మార్చారు. భవనానికి అనుమతులు లేకపోయినా తరగతులు నిర్వహిస్తున్నారు. నిర్వాహకుల నుంచి విద్యాశాఖ అధికారులు వసూలు చేసినట్లు తెలుస్తోంది.

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఓ అధికారిణి ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రైవేటు బడులు నిబంధనలు పాటించకపోయినా చూసిచూడనట్లు వదిలేస్తున్నారు. పలు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి. వారి నుంచి పెద్దమొత్తంలో డబ్బు వసూలు చేసి అనుమతులు రెన్యూవల్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనలు ఉల్లంఘనతో నోటీసులిచ్చాం

వరలక్ష్మి, జిల్లా విద్యాశాఖాధికారిణి, అనంతపురం

మండల విద్యాశాఖాధికారులపై ఫిర్యాదులు రాలేదు. ప్రైవేటు పాఠశాలలను ఉప విద్యాశాఖాధికారులు పరిశీలించారు. జిల్లాలో 21 బడులు నిబంధనలు పాటించలేదని నివేదిక ఇచ్చారు. వాటిపై చర్యలకు ఆర్జేడీకి దస్త్రం పంపించాం. ఇప్పటికే నోటీసులు జారీ చేశాం.

ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు ఇలా..

ప్రాథమిక : 345

ప్రాథమికోన్నత: 395

ఉన్నత : 375

# సీఎం ఇలాకాలో అడవుల సంరక్షణ ఇలాగేనా..!



కుప్పం : ఈచిత్రం కుప్పం మండలం పెద్దవంక అటవీప్రాంతంలో ఈనెల 13న అర్ధరాత్రి 12.30 గంటలకు యంత్రాల సాయంతో యూకలిప్టస్ వృక్షాలను నేలకూల్చుతుండగా... గ్రామస్థులు అడ్డుకుని అక్రమార్కులను అటవీశాఖ అధికారులకు అప్పగించారు. అప్పటికే 26 యూకలిప్టస్ చెట్లు కూల్చివేసినా... అక్కడ ఏమీ చెట్లు కోతకు గురికాలేదని.. కేవలం ఎండిపోయిన ఒక్క పుల్ల మాత్రమే కొట్టిన వ్యక్తికి రూ.1300 జరిమానా విధించామని అధికారులు చెప్పడం విడ్డూరం. ఈ చిత్రం గుడుపల్లె మండలం మల్లప్పకొండ అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి యూకలిప్టస్ చెట్లు నేలకూల్చారు. పట్టపగలే చెట్లు నేలకూల్చి కొండ మార్గం పక్కనే తరలించేందుకు నిల్వ చేసుకొన్నా సంబంధిత అధికారులెవరూ పట్టించుకోలేదు. దీనిపై స్పందించిన కొందరు మల్లప్పకొండ అటవీప్రాంతంలో నేలకూల్చిన వృక్షాల నిల్వలను చరవాణిలో బంధించి సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో నామమాత్రపు చర్యలతో అధికారులు చేతులు దులుపుకున్నారు.

రాష్ట్రంలో 29 శాతం ఉన్న అడవులను 50 శాతానికి పెంచి హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వనమహోత్సవం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సీఎం సొంత నియోజకవర్గమైన కుప్పంలో జిల్లాస్థాయి అధికారులంతా వచ్చి ఎంతో ఆర్భాటంగా మొక్కలు నాటారు. అయితే క్షేత్రస్థాయిలో వాటి సంరక్షణ మరిచారు. అడవుల్లో ఎక్కడచూసినా కలపను అక్రమార్కులు కొల్లగొడుతూనే ఉన్నారు. మొన్న మోట్లచేను, నిన్న పెద్దవంక, నేడు మల్లప్పకొండ అటవీప్రాంతాల్లో అక్రమార్కులు చెట్లు నరికి కలపను కొల్లగొట్టి పక్క రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అడవులను కాపాడాల్సిన అధికారులెవరూ అటు వైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల విమర్శలకు తావిస్తోంది.

**దొంగలను పట్టించినా... చర్యలు శూన్యమే**

కుప్పం మండలం మోట్ల చేను అటవీప్రాంతంలో రెండు నెలల క్రితం యూకలిప్టస్ చెట్లు నరికి ట్రాక్టర్‌లో తరలిస్తున్నారని గ్రామస్థులు అధికారులకు తెలియజేసినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా... పెద్దవంక అటవీప్రాంతం, గుడుపల్లె మండలం మల్లప్పకొండ పరిసరాల్లో చెట్ల నరివేతకు సంబంధించిన వివరాలు తెలియజేసినా... అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. గురువారం రాత్రి నాయనూరు అటవీ ప్రాంతంలోనూ 3 ఆకేషా చెట్లు మాయం చేసినా చర్యలు శూన్యం.

**అబ్బే అదేం లేదు..- జయశంకర్, అటవీశాఖ అధికారి, కుప్పం**

పెద్దవంక అటవీప్రాంతంలో ఎక్కడా చెట్లు నరికివేత లేదు. అక్కడ ఒక ఎండిన పుల్లను కొట్టినందుకు ఓ వ్యక్తికి రూ.1300 జరిమానా విధించాం. గుడుపల్లె మండలం మల్లప్పకొండ వద్ద రెవెన్యూ భూమిలో యూకలిప్టస్ చెట్లు కూల్చివేశారే తప్ప అడవిలో ఎక్కడా చెట్లు నరకలేదు.

# కాలయాపన.. ఆడిటర్లను కాపాడేందుకేనా..?

చిత్తూరు : జడ్పీ నిధుల దుర్వినియోగం వ్యవహారం ఒక్క అడుగు ముందుకు పడలేదు.. అప్పటి ప్లానింగ్ అధికారి ప్రభాకరరెడ్డి అక్రమాలపై విచారణ చేపట్టిన ఆడిట్ అధికారుల బృందం పొంతనలేని కారణాలతో కాలయాపన చేస్తూ విచారణ గాలికొదిలేసిందనే ఆరోపణలున్నాయి. గతంలో ఈ అక్రమాలకు ఆమోదముద్ర వేసిన సొంత శాఖ ఆడిటర్లను కాపాడాలనే విచారణ జాప్యానికి కుంటిసాకులు చెబుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. ఈ కీలక వ్యవహారంలో నాటి ఆడిట్‌శాఖ అధికారులు ముగ్గురి పాత్ర ఉందని సమాచారం. దీంతో దర్యాప్తు ఎప్పుడు పూర్తవుతుంది.. అసలు ఏం జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జడ్పీకి విడుదలైన బీఆర్‌జీఎఫ్, ఆర్థిక సంఘం నిధులు రూ.400-500 కోట్లు బ్యాంకుల్లో డిపాజిట్ చేశారు. దానిపై వచ్చిన వడ్డీని దారి మళ్లించారని మాజీ సీఈవో, నాటి ప్లానింగ్-2 సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డిపై జడ్పీ పూర్వ అధికారి కనకరాజులునాయుడు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విచారణాధికారిగా జిల్లా ఆడిట్ అధికారి కృష్ణారెడ్డిని.. నాటి కలెక్టర్ నియమించారు. సునిశిత విచారణ చేపట్టిన బృందం ఇప్పటికి 70 రోజులు దాటినా పురోగతి లేదు. దస్త్రాలు అందలేదని, జడ్పీ అధికారులు సహకరించలేదంటూ కాలయాపన చేసిన ఆడిట్ శాఖ అధికారులు అన్ని దస్త్రాలు అందినా పురోగతి సాధించలేదు.

**ఆడిటర్లపై ప్రేమతోనే..**

బీఆర్‌జీఎఫ్, ఆర్థిక సంఘం నిధులను నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకుల్లో డిపాజిట్ చేసి వడ్డీ రూపంలో వచ్చిన రూ.12-15 కోట్లు ఓ జడ్పీ ఉద్యోగి ఖాతాకు మళ్లించి ఆపై అభివృద్ధి పనులు చేపట్టిన గుత్తేదారుల ఏజెన్సీల ఖాతాలకు మళ్లించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. గతంలో జడ్పీ ఆడిట్ చేపట్టిన ఆడిట్ అధికారులు.. నాటి జడ్పీ అధికారులతో కుమ్మక్కై ఆడిట్ నివేదికల్లో క్లీన్‌చీట్ ఇచ్చేశారు. నిధులు దుర్వినియోగం కాలేదని, నిబంధనల ప్రకారం ఖర్చు చేశారంటూ ఆడిట్ నివేదికల్లో పొందుపరిచారు. అయితే నిధుల దుర్వినియో



గంపై లోతైన దర్యాప్తు చేపడితే అప్పట్లో పనిచేసిన ముగ్గురు ఆడిట్ అధికారుల పాత్ర ఉన్నట్లు నిర్ధారణ అయ్యే అవకాశాలు ఉన్నాయి. తమ శాఖ అధికారులపై ప్రేమతో పొంతనలేని కారణాలతో దర్యాప్తు జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు జిల్లా ఆడిట్ శాఖ ఉన్నతాధికారులపై వెల్లువెత్తుతున్నాయి.

**జడ్పీ అధికారులపై నెపం నెట్టేస్తూ..**

దస్త్రాలు ఇవ్వనందునే విచారణ చేపట్టలేకపోతున్నామని ఆడిట్ విచారణ బృందం జడ్పీ అధికారులపై నెట్టేస్తున్నారు. దస్త్రాలు ఇచ్చినా ఇలా తమపై నెపం నెట్టేయడం ఎంతవరకు సమంజసమని జడ్పీ అధికారుల వాదన. ఇలా నెలలు గడుస్తున్నా విచారణ విషయంలో పురోగతి లేదు.

**ఉన్నతాధికారులు దృష్టిసారిస్తేనే..**

అక్రమార్కులను వదిలే ప్రసక్తే లేదు.. పారదర్శక పాలనందిస్తామంటూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెబుతున్నప్పటికీ.. ఈ దిశగా జడ్పీ నిధుల దుర్వినియోగం దర్యాప్తు సాగకపోవడంపై జిల్లా స్థాయి అధికారులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర స్థాయి అధికారులు దృష్టి సారిస్తే తప్ప దర్యాప్తు ముందుకు సాగే పరిస్థితులు లేవని జడ్పీ అధికారులు, ఉద్యోగులు పేర్కొంటున్నారు.

# మల్లన్న లడ్డూలో మాయ

శ్రీశైలం : శ్రీశైల మల్లన్న క్షేత్రంలో గత ఐదేళ్లు వైకాపా రాజకీయం చేసింది.. భక్తుల సమస్యలు పట్టించుకోకుండా.. ఆ పార్టీ నేతలు, అధికారులు సొంత లాభాలు చూసుకున్నారు. ఆధ్యాత్మిక క్షేత్రంలో అవినీతి, అక్రమాలను పెంచి పోషించారు. భక్తుల సేవా ముసుగులో భారీగా లబ్ధి పొందారు. ఎక్కడికక్కడ దేవాలయ వ్యవహారాలను ఏదో ఒక విధంగా వివాదాస్పదం చేసి భక్తుల విశ్వాసాలతో ఆడుకున్నారు. భక్తులు మహా ప్రసాదంగా భావించే లడ్డూ తయారీలో సొంత రుచులకు మక్కువ చూపారు. వైకాపా నేతలకు అత్యంత సన్నిహితుడు, డిప్యూటీ కలెక్టర్ ఎస్.లవన్నను 2021లో శ్రీశైల దేవస్థానం ఈవోగా నియమించింది. బాధ్యతలు స్వీకరించిన కొన్నాళ్లకు ఆయన లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యి, జీడిపప్పు వంటి పదార్థాల కొనుగోలు నాణ్యతపై వివాదాలు రేగాయి. వాటిపై విచారణ చేయాలని భక్తులు విన్నవిస్తున్నారు.

బ్యాచ్ నంబర్లు లేకుండానే సరఫరా

ఈవో లవన్న ఆమోదించిన ప్రైవేటు సంస్థ దిగుమతి చేసిన నెయ్యి సరఫరాలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. క్యాన్లపై బ్యాచ్ నంబరు, వరుస సంఖ్య (సీరియల్ నంబరు)తో కూడిన స్టిక్కర్‌ను జత చేస్తారు. చాలా క్యాన్లను బ్యాచ్ నంబర్లు లేకుండా సరఫరా చేశారు. వైకాపా ప్రభుత్వంలో పెద్దల ఆశీస్సులతో వచ్చిన ఈవో అండదండలు నెయ్యి సరఫరా సంస్థకు ఉండటంతో ఆలయ అధికారులు ఎవరూ ప్రశ్నించే సాహసం చేయలేదు.

నిత్యం పది వేల లడ్డూల తయారీ

శ్రీశైల క్షేత్రానికి నిత్యం 30 వేల మంది భక్తులు వస్తుంటారు. శని, ఆదివారాల్లో 70 వేల మంది స్వామిని దర్శించుకుంటారు. నిత్యం పది వేల వరకు లడ్డూ ప్రసాదం తయారీ చేస్తుంటారు. ఉదయం 9




ప్రైవేటు సంస్థ సరఫరా చేసిన నెయ్యి క్యాన్లు

గంటల్లోపే పూర్తవుతాయి. నిత్యం 20 మంది వరకు పాల్గొంటారు.

అస్మదీయ సంస్థకు అందలం

వైకాపా హయాంలో ఈవోగా పని చేసిన లవన్న విజయ డెయిరీ నెయ్యికి మోకాలడ్డారు. రివర్స్ టెండర్ విధానాన్ని అడ్డుపెట్టుకొని విజయ డెయిరీ నెయ్యిని తక్కువ ధరకు సరఫరా చేయాలని మెలిక పెట్టడంతో సదరు సంస్థ ఆసక్తి చూపలేదు. రివర్స్ టెండర్ విధానంలో నెల్లూరుకు చెందిన ఓ ప్రైవేటు సంస్థ ద్వారా నెయ్యిని కొనుగోలు చేశారు. ఏడాదిపాటు ఆ సంస్థ అందించిన నెయ్యిని లడ్డూల తయారీకి వినియోగించారు. ఈ సమయంలో నాణ్యతపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. వైకాపా అస్మదీయ అధికారులు వెనకుండి ప్రైవేటు సరఫరాదారుల నెయ్యిని వినియోగించడానికి పావులు కదపడంతో దేవస్థానం అధికారులూ ఎదురుచెప్పలేని పరిస్థితి అప్పట్లో నెలకొంది.

నమూనాల ప్రదర్శన శూన్యం

లడ్డూ తయారీకి సంబంధించి ఒక ఏడాదికి రూ.10 కోట్ల వరకు సరకులు కొనుగోలు చేస్తారు. టెండర్‌దారుడు సరఫరా చేసే నెయ్యి, జీడిపప్పు, యాలకులు, ఎండు ద్రాక్ష వంటివి నమూనాలు ప్రదర్శించాలి. కానీ పడితరం విభాగంలో సరకుల నాణ్యత, ధరలు అంతా గుట్టుగా జరుగుతోంది. సరకుల నిల్వలో వ్యత్యాసంపై విచారణ జరగకుండా కొందరు చక్రం తిప్పారు.

సరకుల కొనుగోలులో అక్రమాలు

లడ్డూల తయారీకి వినియోగించే సరకుల కొనుగోలులో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నట్లు అప్పట్లో ధర్మకర్తల మండలి ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి బహిరంగంగా ప్రకటించారు. జీడిపప్పు, యాలకులు మార్కెట్ ధరల కంటే ఎక్కువగా వెచ్చిస్తున్నారని అధికారుల తీరును ఎండగట్టారు. నెలకు రూ.42 లక్షల చొప్పున ఏడాదికి రూ.5 కోట్ల నష్టం జరుగుతోందని లెక్కలు చెప్పారు. అప్పటి ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకొని ఛైర్మన్‌ను బుజ్జగించారు.

పడితరం (సరకులు నిల్వ చేసే విభాగం) సరకులు, నిత్యప్రసాదాల సరకుల కొనుగోలుకు మూడు రకాల టెండర్లను అమలు చేస్తామని అప్పటి దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పి అక్రమాల వ్యవహారాలు దాటవేశారు. టెండర్ల విధి విధానాలపై దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినా నాణ్యతకు క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై స్పందించలేదు.

సరకుల కొనుగోలు అక్రమాలపై ఛైర్మన్ ఎదురు దాడి చేయడంతో అప్రమత్తమైన దేవస్థానం అధికారులు ప్రైవేటు సంస్థ సరఫరా చేసిన నెయ్యిని ఆపివేసి మళ్లీ విజయ డెయిరీ నెయ్యిని కొనుగోలు చేసి లడ్డూ ప్రసాదాలను తయారు చేస్తున్నారు.

# అందుబాటులో ఆన్‌లైన్ విధానం

పోలవరం : అప్పుడంతా అరాచకం..గత వైకాపా పాలనలో అక్రమార్కులు హద్దు, అదుపు లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా వ్యవహారాలు చూశాం. నదులే కాదు, వారి ధన దాహానికి వాగులు, వంకలు కూడా హరించుకుపోయాయి. హరిత ట్రైబ్యునల్ అభ్యంతరాలు తెలిపినా ఖాతరు చేయలేదు. ప్రస్తుతం వారి శకం ముగిసింది. ఇప్పుడు.. సామాన్యుడి కోసం రాష్ట్రంలో ఎన్డీయే అధికారంలోకి వచ్చింది. గతంలో జరిగిన ఇసుక అక్రమాలపై కొత్త ప్రభుత్వం విచారణ జరుపుతూనే.. మరో వైపు సామాన్యులకు ఇసుక అందుబాటులోకి తెచ్చేందుకు అనేక చర్యలు చేపట్టింది. తొలుత జులై మొదటి వారంలో ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తెచ్చింది. అయితే ఈ వ్యవహారంలో రవాణా రుసుములు అధికంగా ఉంటున్నాయన్న సమాచారంతో ఆన్‌లైన్ విధానాన్ని గురువారం నుంచి ప్రారంభించింది. ఎలాగంటే.. ఇసుక ఉచితంగా పొందాలంటే ఏపీ శాండ్ పోర్టల్(డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. శాండ్.ఏపీ .జీవోవి.ఇన్ )లో బుక్ చేసుకోవాలి. నమోదు చేసుకున్న ఒకట్రెండు రోజుల్లో ఇంటి వద్దకే సరఫరా చేస్తారు. పని దినాల్లో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శాండ్ పోర్టల్‌లో నమోదు చేసుకునేందుకు అనుమతి ఉంది. గ్రామ/వార్డు సచివాలయాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అందుకు గాను ఇసుక సరఫరా కేంద్రం నుంచి కొనుగోలు దారు ఇంటి మధ్య దూరాన్ని బట్టి రవాణా రుసుములు చెల్లించాలి. ప్రస్తుతానికి నిల్వ కేంత్వరలో విధివిధానాలు ద్రాల నుంచి మాత్రమే ఇసుక సరఫరా చేస్తున్నారు. త్వరలో తవ్వకాలకు సంబంధించి రూపొందించి, రీచ్‌లకు అనుమతులు ఇవ్వనున్నారు.

# సహకార రుణాల్లో రైతులకు గుదిబండ

సూళ్లూరుపేట : రైతులకు చేదోడు, వాదోడుగా ఉంటూ, తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేసి, ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాల్సిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, కేంద్ర సహకార బ్యాంకులు నేడు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. ఏకంగా రైతుల నుంచి 12.50 శాతం వడ్డీ వసూలు చేస్తూ అధిక మొత్తంలో షేర్ క్యాపిటల్ పేరుతో నగదు ఉంచుకోవడంపై రైతుల నుంచి వ్యతిరేకత వస్తోంది. దీనిపై అధికారులు కుంటిసాకులు చెబుతూ తప్పించుకుంటున్నారు. ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో కేంద్ర సహకార బ్యాంకులు 62, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు 145 ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 53 వేల మంది సభ్యులున్నారు. జిల్లాల పునర్విభజన జరిగినా సహకార సంఘాలు మాత్రం ఉమ్మడి జిల్లాలోనే ఉన్నాయి. కొందరు రైతులు సహకార బ్యాంకుల ద్వారా స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు తీసుకున్నారు. ఒక్కో కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో దీర్ఘకాలిక రుణాలు రూ.30–రూ.80 కోట్ల వరకు మంజూరు చేశారు. ఇక్కడ షేర్ క్యాపిటల్ పేరుతో ఎక్కువ మొత్తంలో నగదు వసూలు చేస్తూ.. రైతులు తీసుకున్న రుణాలకు 12.50 శాతం వడ్డీని ముక్కు పిండి వసూలు చేస్తున్నారు.



గతంలో ఈ వడ్డీ కేవలం 9.75 మాత్రమే ఉండేది.

**అసలు విషయానికి వస్తే..**

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రుణాలు తీసుకోవాలంటే రైతులు గతంలో 2 శాతం షేర్ క్యాపిటల్ చెల్లించేవారు. దీనిని బ్యాంకు నుంచి ఇచ్చే రుణం నుంచి మినహాయించుకునేవారు. వైకాపా ప్రభుత్వంలో ఈ షేర్ క్యాపిటల్‌ను 4 శాతం, ఆ తర్వాత 6 శాతం పెంచుతూ చివరకు 8 శాతం వరకు తీసుకొచ్చారు. రైతుల రుణాల నుంచి మినహాయించుకున్న షేర్ క్యాపిటల్‌కు మాత్రం ఎలాంటి వడ్డీని సహకార సంఘాలు చెల్లించవు. కానీ రుణ మొత్తానికి రైతులు వడ్డీ చెల్లించాల్సిందే. ఇంత పెద్ద మొత్తంలో షేర్ క్యాపిటల్ వసూలు చేస్తూ.. రైతులకు ఇచ్చే దీర్ఘకాలిక రుణాలపై ఏకంగా ఈ ఏడాది జూన్ ఒకటి నుంచి 12.50 శాతం వడ్డీ పెంచారు.

**అనర్హులకూ రుణాలు**

సహకార సంఘాల పరిధిలో ఆ ప్రాంత రైతులు కానివారికి కూడా రుణాలు మంజూరు చేశారు. కొన్నిచోట్ల సహకార బ్యాంకు సిబ్బంది రెండు శాతం ముడుపులు తీసుకుని, ఇతర ప్రాంతాల వారికి రుణాలు ఇచ్చేశారు. ప్రస్తుతం ప్రతి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలో మహాజన సభ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రైతులు సహకార సంఘ సీఈవోలను, పర్సన్ ఇన్‌ఛార్జిలను, సూపర్‌వైజర్లను నిలదీస్తున్నారు.

పాలసీ మేరకు చేస్తున్నాం– శ్రీనివాసమూర్తి, సీఈవో, ఎన్‌డీసీసీబీ

సహకార సంఘ పాలసీ మేరకు దీర్ఘకాలిక రుణాలపై 12.50 శాతం వడ్డీ వసూలు చేస్తున్నాం. ఈ విషయాన్ని రైతులు నా దృష్టికి కూడా తెచ్చారు. స్వల్పకాలిక రుణాలు ఏటా రెన్యూవల్ చేస్తుంటాం. అందువల్ల దాని వడ్డీ రేట్లు తరచూ పెరుగుతుంటాయి. దీర్ఘకాలిక రుణాల విషయంలో అలా జరగదు. అందువల్ల 12.50 శాతం వడ్డీ నిర్ణయించారు.

# కోళ్ల వ్యర్థాల్లో.. కాసుల వేట!!

విశాఖపట్నం : వైకాపా పాలనలో కోళ్ల వ్యర్థాల్లోనూ నాయకులు కాసుల వేట సాగించారు. జీవీఎంసీ పరిధిలో ఉత్పత్తయ్యే కోళ్ల వ్యర్థాలను నిబంధనల ప్రకారం కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తీసుకెళ్లాలి. చట్ట విరుద్ధంగా చేపల చెరువులకు తరలించారు. ఇలా ప్రజారోగ్యంతో చెలగాటమాడి రూ.కోట్లు ఆర్జించారు.వ్యర్థాల రవాణాకు సంబంధించి రెండేళ్ల తర్వాత.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో తాజాగా టెండర్లు పిలిచారు. వాటిని దక్కించుకునేందుకు కొందరు కార్పొరేటర్లు దగ్గరుండి వ్యాపారులతో బిడ్లు వేయించడం గమనార్హం.వైకాపా కార్పొరేటర్ల దందా: వైకాపా హయాంలో ముగ్గురు గుత్తేదార్లకు కోళ్ల వ్యర్థాల తరలింపు టెండరు దక్కినప్పటికీ, ఆర్నెళ్లలోనే పూర్తిగా పరిస్థితులు మారిపోయాయి. కోళ్ల వ్యర్థాలకు మంచి గిరాకీ ఉండటంతో, నాటి అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్లు కొందరు దందాకు దిగారు. తమ వార్డుల్లో వ్యర్థాలు తామే తీసుకుంటామంటూ గుత్తేదార్లకు చెప్పారు. కోళ్ల వ్యర్థాల విక్రయాల్లో భీమిలి, మధురవాడ, ఎంవీపీకాలనీ, కంచరపాలెం, తాటిచెట్లపాలెం, గాజువాక ప్రాంతాల్లోని కొందరు కార్పొరేటర్ల హస్తం ఉందన్న విమర్శలున్నాయి. వైకాపాలో కోళ్ల వ్యర్థాల చిచ్చు రేగడంతో, ఒక దశలో ఆ పార్టీ కీలక నేతలూ జోక్యం చేసుకోవాల్సి



వచ్చింది.అందుకే పోటీ: నగరంలో ఉత్పత్తయ్యే వ్యర్థాలను ఉమ్మడి విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల్లోని పలు ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొన్ని ప్రత్యేక రోజుల్లో భారీ విక్రయాలతో ఎక్కువ మొత్తంలో వ్యర్థాలు సమకూరుతున్నాయి. పైగా... చేపల చెరువుల యజమానుల మధ్య పోటీ ఉండటంతో కోళ్ల వ్యర్థాలకు డిమాండ్ పెరిగి.. భారీ ఆదాయం వస్తుండటంతో కొందరు కార్పొరేటర్లు పోటీపడుతున్నారు. వ్యర్థాల సేకరణ ఇలా: టన్ను కోళ్ల వ్యర్థాల సేకరణకు దుకాణదారు నుంచి రూ.700 వసూలు చేస్తారు. దానిలో జీవీఎంసీకి రూ.530 చెల్లించి, మిగతా నిధులు గుత్తేదారు తీసుకునేలా టెండర్లు పిలుస్తారు. దుకాణదారు నుంచి నిధులు వసూలు చేయడం పక్కనపెడితే, తిరిగి వారికే కొంత నగదు ముట్టజెబుతున్నారు. సేకరించిన వ్యర్థాలు కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు తరలించాల్సి ఉండగా, వాహనాలన్ని ఓ నిర్మానుష్య ప్రాంతంలో నిలిపి వ్యర్థాలు గ్రేడ్ చేసి తరలిస్తున్నారు. టెండర్లపై నాయకుల గురి: జీవీఎంసీలో రెండేళ్ల తర్వాత కోళ్ల వ్యర్థాలకు టెండర్లు పిలవడంతో... కొందరు ప్రజాప్రతినిధులతో సిఫార్సులు చేయించి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే ఈ–టెండరు విధానం అమలు చేసి, నిబంధనలు పెట్టడంతో ఆశావహులకు చుక్కెదురైంది. తమకు తెలియకుండా టెండర్లు ఎలా పిలుస్తారంటూ? అధికారులపై కొందరు కూటమి కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం గడువు తేదీని పొడిగించారు. దాఖలైన టెండర్లను ఇంకా తెరవాల్సి ఉంది.

# అమ్మేశాం.. అడిగేదెవరు!



ధర్మవరం : పట్టణంలోని లబ్ధిదారులకు తెదేపా హయాంలో కేటాయించిన పలు ప్రభుత్వ స్థలాలను వైకాపా నాయకులు దర్జాగా కబ్జా చేసి ఇతరులకు అమ్మేసి రూ.కోట్లు వెనకేసుకున్నారు. అయిదేళ్ల వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు రెవెన్యూ అధికారుల సాయంతో ఆ స్థలాలు తమ పూర్వీకుల నుంచి వచ్చిందంటూ పట్టాలు పొంది కబ్జా చేశారు. అనంతరం వాటిని కొలతలు వేసి అమ్మేశారు. పట్టణంలోని 1వ వార్డులో గూడ్స్ షెడ్డు కొట్టాల్లో 560–7 సర్వే నంబరులో 5 ఎకరాల ప్రభుత్వ స్థలముంది. 2018లో తెదేపా హయాంలో ఆ స్థలాన్ని రెండు సెంట్ల చొప్పున లబ్ధిదారులైన హమాలీలు, హిజ్రాలు, చేనేత కార్మికులు, ఇతర వర్గాలు 190 మందికి పక్కా లేవుట్‌గా వేసి ఇంటి పట్టాలుగా మంజూరు చేశారు. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ స్థలంపై ఆ పార్టీ నాయకుల కన్నుపడింది. ఇంకేముంది ఎలాగైనా సొంతం చేసుకోవాలని వైకాపా ప్రభుత్వ హయాంలో ధర్మవరం మండలానికి ఇన్‌ఛార్జి తహసీల్దారుగా విధులు నిర్వర్తిస్తున్న ఓ మహిళా అధికారికి భారీగా నగదు ముట్టజెప్పి పట్టాలను (పొజిషషన్ సర్టిఫికెట్) సృష్టించారు. దీనికి అప్పటి మాజీ ప్రజాప్రతినిధి భూకబ్జాదారులకు వత్తాసు పలకడంతో రెవెన్యూ అధికారులు ఏమాత్రం ఆలోచించకుండా అక్రమాలకు తమ వంతు సాయమందించి జేబులు నింపుకున్నారు.

**లబ్ధిదారులపై భౌతికదాడులు**

పట్టణానికి అతి సమీపంలో 1వ వార్డు ఉండటంతో ఇక్కడ స్థలాలకు సెంటు రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు ధర పలుకుతోంది. దీనికితోడు ఈ భూమి చెంతనే రైల్వేస్టేషన్ ఉంది. ఇదే అదనుగా 560–7 సర్వే నంబర్‌లోని రూ.కోట్లు విలువచేసే 5 ఎకరాల ప్రభుత్వ భూమిని వైకాపా నాయకులు కబ్జా చేశారు. తాతాల కాలం నాటి నుంచి ఈ భూమి తమదే అంటూ లబ్ధిదారులపై భౌతిక దాడులకు దిగారు. వారికి కేటాయించిన స్థలాల్లో అడుగు పెట్టనీయకుండా బెదిరించారు. పాపం లబ్ధిదారులు కొందరు అధికారులు, నాయకులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించిన అప్పటి ఎమ్మెల్యే, కౌన్సిలర్ మా గోడు వినలేదని లబ్ధిదారులు కన్నీటిపర్యంతమయ్యారు.

**ప్లాట్లు వేసి దర్జాగా..**

వైకాపా ప్రభుత్వ హయాంలో గుడి, బడి స్థలాలనూ అమ్మి సొమ్ము చేసుకున్నారు. 560–7 సర్వే నంబరులో లబ్ధిదారులతో పాటు ఆలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల నిర్మాణాలకు, ఇతరత్రా భవిష్యత్తు అవసరాల కోసం 90 సెంట్ల మేరకు స్థలాన్ని అప్పటి తెదేపా ప్రభుత్వం కేటాయించింది. అక్రమార్కులు దీన్ని కబ్జా చేసి ప్లాట్లు వేసి దర్జాగా అమ్మేశారు. రోడ్డుకోసమని వదిలేసిన స్థలాలనూ విక్రయించేశారు. అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోలేదు.

**దివ్యాంగురాలి స్థలాన్ని లాగేసుకున్నారు..**

నా మనవరాలు శ్యామలమ్మ దివ్యాంగురాలు. నడవలేదు. ఆమెకు ఇల్లు లేదని 2018లో తెదేపా నాయకులకు విన్నవిస్తే 1వ వార్డులో కొంత స్థలాన్ని కేటాయించి పట్టా ఇచ్చారు. వైకాపా నాయకులు ఆ స్థలాన్ని లాగేసుకున్నారు. ఇదేమని అడిగితే నీకు దిక్కున్నచోట చెప్పుకోమని బెదిరించారు. వారితో కొట్లాడలేక ఊరికే ఉన్నాం. ప్రభుత్వం మాకు తగిన న్యాయం చేయాలని కోరుతున్నాం.

నారాయణమ్మ, గూడ్స్‌షెడ్డు కొట్టాల

**దౌర్జన్యానికి అధికారుల సాయం**

ప్రభుత్వం ఇచ్చిన పట్టాలకు విలువ లేకుండా పోయింది. మాకు కేటాయించిన స్థలాలను ఇతరులకు అమ్మేస్తున్నారని అధికారుల దగ్గర మొరపెట్టుకుంటే కబ్జాదారులకే మద్దతు పలికారు. ఇప్పటికీ మా స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలి.

పుష్పావతి, గూడ్స్‌షెడ్డు కొట్టాల

**విచారణ చేపడుతున్నాం..**

పట్టణంలోని 1వ వార్డులోని 560–7 సర్వే నంబరులో తెదేపా ప్రభుత్వ హయాంలో పేదలకు పట్టాలు పంపిణీ చేశారని మా దృష్టికి వచ్చింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఏం జరిగిందో మాకు తెలియదు. అన్నింటిపై విచారణ చేసి బాధితులకు న్యాయం చేస్తాం. అక్కడ ఎలాంటి నిర్మాణాలు జరగకుండా బోర్డు ఏర్పాటు చేస్తాం.

వెంకటశివరామిరెడ్డి, ఆర్డీవో, ధర్మవరం

# ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రశ్నార్థకం



అనంతపురం : జిల్లాలో ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. సెప్టెంబరు నుంచి తక్కువ కాలంలో చేతికొచ్చే పంటలపై వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు విత్తన పంపిణీ ప్రారంభించింది. మరో పదిరోజుల్లో ఈనెల ముగుస్తోంది. అక్టోబరు నుంచి రబీ సీజన్ ప్రారంభమవుతుంది. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. ఎక్కడా చినుకు పడలేదు. వ్యవసాయశాఖ అధికారులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ సాగు కింద ఉలవలు, పెసర, అలసంద, జొన్న, కొర్ర విత్తన పంపిణీ సాగుతోంది. ఈ ప్రక్రియ కొనసాగించాలా.. వద్దా అన్న సందిగ్ధంలో వ్యవసాయశాఖ ఉంది. విత్తనం తీసుకున్న రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈనెల ఆరంభం నుంచి వర్షం పడలేదు. ఒక్క ఎకరా సాగు కాలేదు.

**విత్తన కేటాయింపులు**

జిల్లాలో ప్రత్యామ్నాయ సాగుకు ప్రభుత్వం విత్తన కేటాయింపు చేసింది. మొత్తం 27,907 క్వింటాళ్లు మంజూరయ్యాయి. వర్షం రాకపోయినా విత్తనాలు సిద్ధం చేయించి, పంపిణీ చేపట్టింది. ఉలవలు 21,791 క్వింటాళ్లు, పెసలు 1,501, అలసంద 3,253, జొన్నలు 973, కొర్రలు 369, మినుములు 20 క్వింటాళ్ల చొప్పున కేటాయించారు. జిల్లాలో గత రెండువారాల నుంచి రైతుసేవా కేంద్రాల ద్వారా విత్తన పంపిణీ కొనసాగుతుంది. ప్రత్యామ్నాయ విత్తనాలన్నీ 80 శాతం రాయితీతోనే అందజేస్తున్నారు. ఇప్పటి వరకు ఉలవలు 8,959 మంది రైతులకు 3,055 క్వింటాళ్లు, పెసర 188 మంది రైతులకు 40, కొర్రలు 18 మంది రైతులకు 1.28, జొన్నలు 96 మంది రైతులకు 14.2 క్వింటాళ్ల చొప్పున పంపిణీ చేశారు.

**అంతటా లోటు వర్షపాతమే..**

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ మరో పదిరోజుల్లో ముగియనుంది. నాలుగు మాసాల్లో రెండు నెలలు భారీ వర్షాలు కురిశాయి. మిగిలిన రెండు నెలల్లో వర్షాభావ పరిస్థితులు నెలకున్నాయి. దీంతో ఖరీఫ్‌లో వేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. ప్రత్యామ్నాయ విత్తనం వేసేందుకు చినుకుపడక అన్నదాతలు, వ్యవసాయాధికారులు ఆందోళన చెందుతున్నారు. మండల వారీగా వర్షపాతం పరిశీలిస్తే.. జూన్, ఆగస్టులో అత్యధిక వర్షం కురిసింది. జూలై, సెప్టెంబరు నెలల్లో లోటు వర్షపాతమే నమోదయింది. ఒక పామిడి మండలంలో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదుకాగా, మిగిలిన 12 మండలాల్లో లోటు వర్షపాతం, 18 మండలాల్లో అతి తక్కువ వర్షపాతం నమోదైదనట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి..

**అన్నతాతలు ఆందోళన చెందాల్సిన పనిలేదు**

– డాక్టర్ విజయశంకరబాబు, ప్రధాన శాస్త్రవేత్త (ఏఆర్ఎస్–రేకులకుంట)

జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకున్నాయి. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఈనెలాఖరు, అక్టోబరులో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ఉలవలు, అలసంద, పెసర, కొర్ర, జొన్న వంటి పంటలను... ప్రస్తుతం వర్షం వచ్చినా విత్తుకోవచ్చు. అక్టోబరు నెలంతా ఉలవలు వేసుకోవచ్చు. మిగిలిన అలసంద, జొన్న, కొర్ర, పెసర వంటివాటిని అక్టోబరు 15 వరకు వేసుకోవచ్చు.

# చెరువుల్లో నిర్మాణాలు.. చర్యలేవి?

రేణిగుంట : రేణిగుంట మండలంలో గడిచిన ఐదేళ్లలో వైకాపా నేతల భూకబ్జాలకు హద్దులు లేకుండా పోయాయి. ప్రభుత్వ భూములను మింగేసి తరువాత నీటి వనరులను కూడా వదల్లేదు. చెరువులు, కాలువను సైతం వారు ప్లాట్లుగా మార్చి విక్రయించారు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికి ప్లాట్ల మధ్యలో వాన నీరు చేరింది. నీటి ప్రదేశాల్లో నిర్మాణాలు చేపడితే వచ్చే నష్టాలు ఎలా ఉంటాయో ఇటీవల చోటుచేసుకున్న పలు ఘటనల్లో తేటతెల్లమైంది. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి.. ఇక్కడ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రేణిగుంట మండలంలో ప్రధానంగా చెంగాల్రయగుంత, బేరివానిగుంత, రాగిమాకులగుంత కబ్జాకు గురయ్యాయి. కుర్రకాలువలో పేదలకు ప్లాట్లు ఇచ్చిన ప్రదేశంలో కాలువను సైతం మింగేశారు. కరకంబాడి లెక్కదాఖల్లో సర్వే నంబర్ 453–6లో 6.72 ఎకరాల చెంగ్రాలయగుంతను వైకాపా నేతలు చదును చేసి పూడ్చి ప్లాట్లుగా మార్చేశారు. కుర్రకాలువలో ప్లాట్ల మధ్యలో వెళ్లే కాలువను సైతం కబ్జా చేసి వంద ఇళ్ల వరకు నిర్మించి విక్రయించారు. ః ఆర్.అగ్రహారం లెక్కదాఖల్లో సర్వే నంబర్ 535లో 8.48 ఎకరాల విస్తీర్ణంలో బేరివానిగుంతను చెంగారెడ్డిపల్లెకు చెందిన నాటి వైకాపా నేతలు ఆక్రమించారు. ఇక్కడ ఎస్టీలకు ఇళ్లు ఇస్తామని చెప్పి ప్లాట్లు వేసి విక్రయాలు జరిపారు. ః కుర్రకాలువ లెక్కదాఖల్లో సర్వే నంబర్ 15లో రాగిమాకులగుంతలో 50 ప్లాట్లు వేసి విక్రయించారు. ఈ కబ్జాల్లో స్థానిక పంచాయతీ పెద్దలు పూర్తి సహాయ సహకారాలు అందించడం గమనార్హం. త్వరలో చర్యలు తీసుకుంటాం.– సురేష్‌బాబు, తహస్మీల్దార్, రేణిగుంట మండలం ఈ గుంతలపై త్వరలో చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అదనపు పోలీసు బలగాలను కోరాం. వారు వచ్చిన వెంటనే ఇక్కడ చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

# కార్డుల సర్దుబాటు.. లోపాల దిద్దుబాటు

అనకాపల్లి : వైకాపా ప్రభుత్వంలో ప్రజా పంపిణీ వ్యవస్థ గాడి తప్పింది. ఇంటింటా రేషన్ అందిస్తామని ఎండీయూ వాహనాలను తీసుకువచ్చారు. వాటిని వైకాపా ప్రచార రథాలుగా వాడుకున్నారే తప్ప కార్డుదారుల ఇళ్లకు సరకులు అప్పగించలేదు. వీధి చివరన బండి నిలిపి బియ్యం ఇవ్వడానికే పరిమితమయ్యారు. రేషన్ బండి వీధిలోకి వచ్చిన రోజు కార్డుదారులు లేకుంటే ఆ వాహనాలు ఏ వీధిలో ఉన్నాయో అక్కడికి పరుగులు తీయాల్సి వచ్చేది. లేకుంటే ఆ నెల రేషన్ వదులుకోవాల్సి వచ్చేది. ఈ సమస్యలకు చెక్ పెట్టేలా కూటమి ప్రభుత్వం గత మాదిరిగానే ప్రజాపంపిణీ దుకాణాలను వినియోగంలోకి తీసుకురాబోతోంది. ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న డీలర్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు కార్డుల సంఖ్యకు అనుగుణంగా దుకాణాల హేతుబద్ధీకరణ చేపడుతోంది.

అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 1734 ప్రజాపంపిణీ దుకాణాలున్నాయి. వాటి పరిధిలో 8.45 లక్షల కార్డుదారులున్నారు. వీరికి ఇంటింటా రేషన్ సరుకులు అందించేందుకు 595 ఎండీయూ వాహనాలను వినియోగిస్తున్నారు. అయితే ఇవి ఎప్పుడు వీధుల్లోకి వస్తాయో సరైన సమాచారం లేకపోవడంతో ప్రతినెలా 50 వేల నుంచి 70 వేల కార్డుదారులు సరకులు అందుకోలేకపోతున్నారు. అదే రేషన్ దుకాణాల



ద్వారా సరకులు ఇస్తే నిర్దేశిత రోజుల్లో ఎప్పుడు వెళ్లినా డీలర్లు అందుబాటులో ఉంటారు. అందరికీ రేషన్ సరకులు అందడానికి అవకాశం ఉంటుంది. ఆ దిశగా కూటమి సర్కారు చర్యలు చేపడుతోంది. ఇన్నాళ్లు మూతపడిన ప్రజాపంపిణీ దుకాణాలను తెరిపించేందుకు సిద్ధమవుతున్నారు.

**రేషన్.. రేషనలైజేషన్..**

ప్రస్తుతం ఒక్కో డిపో పరిధిలో ఒక్కో విధంగా కార్డుల సంఖ్య ఉన్నాయి. ఒక డిపోకి 700 కార్డులు ఉంటే మరో డిపోకి 500 కార్డులుంటున్నాయి. ఇలా హెచ్చుతగ్గులున్న డిపోలన్నింటికీ సమానంగా కార్డులను కేటాయించేలా హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) చేయడానికి కసరత్తు మొదలుపెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒక డిపో పరిధిలో 400 నుంచి 450 కార్డుదారులు, పట్టణాల్లో 500 నుంచి 550, నగరాల్లో 600 నుంచి 650 కార్డులుండేలా సర్దుబాటు చేయనున్నారు. దీనివల్ల అనకాపల్లి జిల్లాలో అదనంగా సుమారు వంద రేషన్ దుకాణాలు పెరగడానికి అవకాశం ఉన్నట్లు పౌరసరఫరాల అధికారులు అంచనా వేస్తున్నారు. అల్లూరి జిల్లాలో సర్దుబాటుపై మండల పౌరసరఫరాల ఉప తహసీల్దార్ల నుంచి సమాచారం సేకరిస్తున్నారు. కొత్త దుకాణాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు కేటాయించనున్నారని జిల్లా పౌరసరఫరాల అధికారి కేవీఎల్ఎన్ మూర్తి తెలిపారు.

**ఖాళీల భర్తీకి నోటిఫికేషన్..**

ఎండీయూ వాహనాల ద్వారా ఇన్నాళ్లు రేషన్ పంపిణీ జరగడంతో ఖాళీ అయిన డీలర్ పోస్టులను భర్తీ చేయడం మానేశారు. అనకాపల్లి జిల్లాలో 1063 ప్రజాపంపిణీ దుకాణాలుంటే అందులో 102 డిపోలకు డీలర్లు లేరు. సమీప డిపో డీలర్లకు వాటిని అప్పగించారు. ఇప్పుడు రేషన్ దుకాణాల ద్వారానే సరకులు ఇప్పించాలని భావించడంతో ఖాళీలన్నింటినీ భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో సుమారు 156 ఖాళీలున్నాయి. వీటి భర్తీకి ఈ వారంలోనే ఆర్డీవోల ద్వారా నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. మండలాల ప్రాతిపదికగా రోస్టర్ అనుసరించి ఈ భర్తీ ప్రక్రియను చేపట్టనున్నారు. 80 మార్కులకు రాత పరీక్ష, 20 మార్కులకు మౌఖిక పరీక్షలు నిర్వహించనున్నారు.

# కాగితాల్లో కనెక్షన్లు!

భీమవరం : కుళాయిల ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్(జేజేఎం)ను ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. ఈ పనులకు గత వైకాపా ప్రభుత్వం నిధులు ఇవ్వడంలో రెండడుగులు వెనకున్నా... అక్రమ కనెక్షన్లు ఇవ్వడంలో మాత్రం నాలుగడుగులు ముందే ఉండేది. కాగితాల్లో మాత్రమే పేదలకు కుళాయి కనెక్షన్లు ఇచ్చినట్లు చూపి... క్షేత్రస్థాయిలో నిధులు కాజేసింది. జేజేఎం పనుల్లో నిధుల వినియోగం, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ తదితరాలపై ఎన్డీయే ప్రభుత్వం చేపట్టిన పల్స్ సర్వేలో డొల్లతనం బయటపడింది.రెండేసి కుళాయిలే అధికంజిల్లాలోని 20 మండలాల్లో చేపట్టిన సర్వేలో విస్తుపోయే అంశాలు వెలుగుచూశాయి. 75,738 కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు లేనట్లు గుర్తించారు. రెండేసి కనెక్షన్లు ఉన్న కుటుంబాలు 11,235 ఉండగా– కుళాయి ఉండి, స్థానికంగా నివాసం లేని కుటుంబాలు 53,036 ఉన్నాయని తేల్చారు.జిల్లా వ్యాప్తంగా గత అయిదేళ్లలో 3.69 లక్షల కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. నేటికీ సింహభాగం కుళాయిల నుంచి నీరందడం లేదు. చాలాచోట్ల కనెక్షన్లు అలంకారప్రాయంగా మిగిలాయి. స్థానికులు యథావిధిగా చెరువులు, కాలువలు, నదులు, చేతి పంపులపై ఆధారపడుతున్నారు. వర్షాకాలం లో కలుషిత నీరు తాగి అనారోగ్యం బారిన పడుతున్నారు. దీనిపై గత నెల 12 నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి తాగునీటి కుళాయి కనెక్షన్ ఉందా? లేదా? ఎప్పుడిచ్చారు? లేకపోతే ఎక్కణ్నుంచి నీరు తెచ్చుకుంటున్నారు? ఎన్ని కిలోమీటర్లు వెళ్తున్నారు? తదితరాలపై సర్వే చేశారు.ఉన్నట్లా? లేనట్లా?దస్త్రాల్లో చూపుతున్న కుళాయిలకు క్షేత్రస్థాయిలో ఉన్నవాటికి పొంతన కుదరడం లేదు. సర్వే సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకెళ్లగా– దస్త్రాల్లో పేర్కొన్న 53,036 మంది ఎక్కడున్నారో తెలియని పరిస్థితి. తాడేపల్లిగూడెంలో అత్యధికంగా 9,059, గణపవరంలో 5,967, యలమంచిలిలో 4,239, పెంటపాడులో 4,200, నరసాపురంలో 4,187, ఉండిలో 838 మందికి కనెక్షన్లు ఇచ్చినట్లు చూపగా– వారి జాడ మాత్రం కనిపించడం లేదు.'సర్వే నివేదిక ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వ ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకుంటాం' అని గ్రామీణ నీటి సరఫరా విభాగం జిల్లా అధికారి నాగేశ్వరరావు తెలిపారు.




## షాలిని పాండే.. చీరలో గ్లామర్ బ్లాస్ట్

తెలుగు సినిమా 'అర్జున్ రెడ్డి'తో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా ముద్ర వేసుకున్న షాలిని పాండే, తాజాగా తన గ్లామర్ లుక్‌తో సోషల్ మీడియాను మరింతగా హీట్ పెంచుతోంది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న ఫోటోల్లో షాలిని తన సరికొత్త లుక్‌లో అదరగొట్టింది. అందమైన చీరలో మోడ్రన్ టచ్ తో ఉన్న ఆమె స్టైల్, గ్లామర్ హైలైట్ అవుతూ ప్రేక్షకులను ఫిదా చేసేస్తోంది. చిన్న టాప్, లైట్ పింక్ చీర కాంబినేషన్‌లో ఉన్న ఆమె లుక్ చూస్తే, ఆమె అందం మరింత అంతగా మెరిసిపోతోంది. తన స్వచ్ఛమైన సౌందర్యంతో పాటు, సమతుల్యతగా ఉన్న బాడీ లాంగ్వేజ్, ఈ ఫోటోలను మరో స్థాయిలోకి తీసుకెళ్లాయి. ఈ లుక్స్‌లో షాలిని పాండే అందరిని మాయ చేసేలా ఉంది. ఈ గ్లామర్ ఫోటోలకు ఫ్యాన్స్ నుంచి భారీగా పాజిటివ్ కామెంట్స్ వస్తున్నాయి. "మైండ్ బ్లోయింగ్ లుక్" అని, "మహా గ్లామరస్



గార్జియస్" అంటూ కామెంట్స్ పెడుతూ, అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇలాంటి బోల్డ్ లుక్స్‌లో షాలిని పాండే మరిన్ని ఫాలోవర్స్ ను సంపాదించుకుంటోంది. అంతే కాకుండా, ఆమె నటనతో పాటు గ్లామర్ ఫోటోషూట్లతో సరికొత్త ట్రెండ్ సెట్ చేస్తోంది. మొత్తంగా చూస్తే, షాలిని పాండే గ్లామర్ ప్రెజెంట్ చేయడంలో తనదైన మార్క్ చూపిస్తూ మరింత క్రేజ్ తెచ్చుకుంటుందని అర్థమవుతోంది. ఇక ఆమె కెరీర్ విషయానికి వస్తే.. మొదటి సినిమా అర్జున్ రెడ్డి ఒక ట్రెండ్ సెట్ చేసినప్పటికీ ఆ తరువాత మళ్ళీ సరైన అవకాశాలు మాత్రం రాలేదు. కొన్ని సినిమాల్లో సైడ్ రోల్స్ కూడా చేసింది. హీరోయిన్ గా అవకాశాలు రాకపోయినా గెస్ట్ రోల్స్ చేస్తూ ఏదో ఒక విధంగా బిగ్ స్క్రీన్ పై కనిపించే ప్రయత్నం అయితే చేస్తోంది. తెలుగులో ఆమె చివరగా నిశ్శబ్దం సినిమాలో నటించింది. ఇక ఆ తరువాత హిందీలో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నం చేసింది. కానీ చేసిన సినిమాలు పెద్దగా క్లిక్ కాలేదు. మరి గ్లామర్ తో సోషల్ మీడియాలో బాగా ట్రెండ్ అవుతున్న షాలిని కొత్తగా ఏమైనా ఆఫర్స్ అందుకుంటుందేమో చూడాలి.

## ప్రియా వారియర్ ఇదో సర్ ప్రైజ్ మురిపం!

స్విమ్మింగ్ పూల్ లో జలకాలట కోసం... లేక్ లో..బీచ్ లో ఈత కోసం హీరోయిన్లు అంతా స్విమ్ షూట్లు వేస్తారు. టూపీస్ లు ధరిస్తారు. రకరకాల బికినీలు వేసుకుంటారు. వాటిలో అందాలు ఆరబోస్తు కెమెరాకి రకరకాల భంగిమల్లో ఫోజు లిస్తుంటారు. వాటిని అంతర్జాలంలోకి వదిలి నెటి జనుల్ని ఖుషీ చేస్తుంటారు. ఇదందా ఓ పద్దతిగా పోతుంది. కానీ ఇలాంటి జలకాలాట కోసం మ్యాప్ వేసుకుని..అందంగా ముస్తాబై..పట్టు లంగావోణీ లు లాంటివి ఎవరైనా ధరించి చూసారా? అంటే ఇదొక్కడి చోద్యం అంటారు. కానీ ఓవర్ నైట్ స్టార్ ప్రియా ప్రకాష్ వారియర్ అలా భిన్నంగా ట్రై చేసి సక్సెస్ అయింది. ఇదిగో ఇక్కడిలా స్విమ్మింగ్ పూల్ లో అమ్మడి పోటో సెషన్



చూస్తే స్టన్ అవ్వాల్సిందే. రెండు చేతులకు మల్లె పూలు ధరించింది. ఎంతో అందంగా హెయిర్ స్టైల్ చేసుకుంది. మ్యాకప్ వేసుకుంది. నుదిటిన రూపాయి బిళ్లంగా బొట్టు పెట్టుకుంది. పట్టు పరికిణీ ధరించింది. టాప్ లో మ్యాచింగ్ బ్లౌజ్ ధరించింది. ఇదే దుస్తుల్లో ఈత కొలనులోకి దిగి వివిధ భంగిమల్లో ఫోజులిచ్చింది. ప్రియాని అలా చూసి అంతా స్టన్ అవుతున్నారు. రెగ్యులర్ స్విమ్ షూట్లకు భిన్నంగా ఇలా ట్రై చేసింది. యూనిక్ గానూ హైలైట్ అవుతుంది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ప్రియా స్కిన్ షోకి యువత ఫిదా అవుతుంది. ప్రియాపై ఫోజులుపై ఎవరి స్టైల్లో వారు కామెంట్లు గుప్పిస్తున్నారు. ఇక అమ్మడి కెరీర్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇండస్ట్రీకి మెరుపులా వచ్చింది. స్టార్స్ తో అవకాశాలు అందుకుంది. అయితే సక్సెస్ లు సరైనవి పడలేదు. లేదంటే? అమ్మడి కెరీర్ మరోలా ఉండేది. ప్రస్తుతం అవకాశాలు చేతిలో బాగానే ఉన్నాయి. హిందీ, కన్నడలోనే సినిమాలు చేస్తోంది. తెలుగు, తమిళ్ లో మాత్రం కొత్త అవకాశాలు రాలేదు.

# పుష్ప 2: సుక్కూ ప్లానింగే ప్లానింగ్ అబ్బా!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, జీనియర్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న సినిమా "పుష్ప 2: ది రూల్". అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ.. డిసెంబర్ 5వ తేదీన గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సినిమాపై అంచనాలు ఏ రేంజ్ లో ఉన్నాయో స్పెషల్ గా చెప్పాల్సిన పనిలేదు. అయితే వీటికి ఏమాత్రం తగ్గకుండా భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు సుక్కూ అండ్ టీమ్. అంతేకాదు 'పుష్ప 3' కోసం సాలిడ్ లీడ్ ప్లాన్ చేస్తున్నట్లుగా తెలిసింది. 'పుష్ప 1' సినిమా ఊహించని విధంగా నార్త్ మార్కెట్ లో బ్లాక్ బస్టర్ సక్సెస్ సాధించడంతో, 'పుష్ప 2' పై ఎక్స్పెక్టేషన్స్ నెక్స్ట్ లెవల్ కి చేరుకున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని మొదటి భాగానికి మించి ఉండేలా, సెకెండ్ పార్ట్ ను డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. హై-ఆక్టేన్ యాక్షన్ సీన్స్, ఎమోషన్స్, ఎలివేషన్స్ మీద ఎక్కువ ఫోకస్ పెట్టినట్లుగా టాక్ వినిపిస్తోంది. పుష్పరాజ్ క్యారక్టర్ అస్సలు తగ్గేదే లే అనే విధంగా ఉంటుందని మేకర్స్ చెబుతూ వస్తున్నారు. 'పుష్ప 2' చిత్రానికి పార్ట్-3 కూడా ఉంటుందని హీరో నిర్మాతలు ఇప్పటికే హింట్ ఇచ్చారు. సెకండ్ పార్ట్ ఎండింగ్ లోనే 'పుష్ప 3' లీడ్ కచ్చితంగా ఉంటుందని క్లారిటీ ఇచ్చారు. అయితే ప్రేక్షకులను షాక్ కు గురిచేసేలా పార్ట్-2 క్లైమాక్స్ ను సుకుమార్ డిజైన్ చేసినట్లుగా తెలుస్తోంది. బాహుబలిని కట్టప్ప ఎందుకు చంపాడు అని ఎంతగా ఎదురు చూశారో, అదే విధంగా పుష్ప ఫ్రాంచైజీలో నెక్స్ట్ పార్ట్ పై ఇంట్రెస్ట్ క్రియేట్ చేసేలా ఈ క్లైమాక్స్ ఉంటుందట. అంతేకాదు ఓ పాపులర్ స్టార్ హీరోని దీంట్లో భాగం చేస్తారని అంటున్నారు. 'పుష్ప' పార్ట్-3 లీడ్ గా 'పుష్ప 2' క్లైమాక్స్ లో కీలక పాత్ర కోసం ఓ ప్రముఖ హీరోని ఎంపిక చేయడానికి సుక్కు అండ్ టీమ్ చర్చలు జరుపుతున్నారట. ఇందులో నిజమెంతో తెలియదు కానీ, ఇది కచ్చితంగా ఆడియన్స్ ను సర్ప్రైజ్ చేస్తుందని చెప్పాలి. నిజానికి పుష్ప అనేది క్యారక్టర్ డ్రివెన్ సినిమా. 'బాహుబలి' మాదిరిగా పెద్ద ట్విస్ట్ ఇచ్చి మొదటి భాగాన్ని ముగించ లేదు. పుష్పరాజ్ పాత్ర సెకండ్ పార్ట్ లో ఎలా రూల్ చేస్తాడు అనే ఆసక్తికరమైన పాయింట్ తో 'పుష్ప 1' ముగిసింది. కానీ 'పుష్ప 2' మాత్రం 'పుష్ప 3' కోసం ఎదురు చూసేలా ముగుస్తుందని నివేదికలు పేర్కొన్నాయి. 'పుష్ప 2' సినిమాలో జాతర ఎపిసోడ్ హైలైట్ గా నిలుస్తుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఇదొక మాస్టర్ పీస్ అని, గూస్ బమ్స్ వస్తాయని ఇటీవల నిర్మాతలు తెలిపారు. 35 రోజుల పాటుగా ఈ సీక్వెన్స్ ను షూట్ చేసినట్లు చెప్పారు. ఇక నవంబర్ 4వ తేదీ నుంచి మిగిలి ఉన్న ఐటెం సాంగ్‌ని చిత్రీకరించేందుకు టీమ్ ప్లాన్ చేస్తోంది. ఇప్పటికే ఫసాఫ్ట్ ను లాక్ చేశారు కాబట్టి, వీలైనంత త్వరగా మిగతా షూటింగ్ పూర్తి చేసి పోస్ట్ ప్రొడక్షన్ మీద దృష్టి పెట్టనున్నారు. 'పుష్ప 2' చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఆరు భాషల్లో కలిపి 11,500 స్క్రీన్స్ లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇండియాలో 6500 స్క్రీన్స్‌లో, ఓవర్సీస్‌లో 5000 స్క్రీన్లలో రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా తప్పకుండా మునుపటి రికార్డులన్నింటినీ బద్దలు కొడుతుందని అభిమానులు భావిస్తున్నారు. 1000 కోట్ల క్లబ్ లో చేరే మరో ఇండియన్ సినిమా అవుతుందని ధీమాగా ఉన్నారు.

# ఎట్టకేలకు 'గేమ్ ఛేంజర్' బిగ్ అప్‌డేట్




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ – ప్రముఖ దర్శకుడు శంకర్ షణ్ముగం 'గేమ్ ఛేంజర్' కోసం జతకట్టారు. ఇది పొలిటికల్ డ్రామా. దిల్ రాజు– శిరీష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా 10 జనవరి 2025న బహు భాషల్లో ఈ చిత్రం గ్రాండ్ రిలీజ్ కాబోతోంది. కియారా అద్వానీ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో భారీ తారాగణం నటించారు. తాజాగా దీపావళి కానుక కోసం వేచి చూస్తున్న మెగా ఫ్యాన్స్ కి అద్భుతమైన వార్తను అందించింది శంకర్ టీమ్. గేమ్ ఛేంజర్ టీజర్ నవంబర్ 9న విడుదల కానుందని ప్రకటించారు. ఈ సినిమా నుంచి మాస్ పోస్టర్ ని రిలీజ్ చేసి టీజర్ డేట్ ని దానిలో రివీల్ చేసారు. రైల్వే ట్రాక్ పై ఆరుగురిని పడుకోబెట్టి ఒక చెక్కపై కూచుని చరణ్ తీక్షణంగా వారి వైపు చూస్తున్నాడు. అతడు గళ్ల పంచె, బనియన్ ధరించి మాసీగా కనిపిస్తున్నాడు. రైలు వచ్చే ముందు ఆ ఆరుగురి పరిస్థితిని ఊహించవచ్చు. ఈ సన్నివేశంతోనే అతడు గూస్ బంప్స్ తెప్పించడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే టీజర్ లో దీనిని చూపిస్తారా లేదా? సందర్భం ఏమిటన్నది వేచి చూడాలి. ఐఏఎస్ టర్న్ డ్ ముఖ్యమంత్రిగా రామ్ చరణ్ ఈ చిత్రంలో నటిస్తున్నాడని ఇప్పటికే కథనాలొచ్చాయి. ఇందులో %యాజీ% సూర్య ప్రధాన విలన్ గా నటిస్తున్నారు. శ్రీకాంత్, అంజలి, సముద్రఖని, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. థమన్ ఈ ప్రాజెక్ట్‌కి సంగీతం అందించారు. సంక్రాంతి పందెంలో క్రేజ్ ఉన్న చిత్రంగా వస్తోంది. చరణ్ పాన్ ఇండియా ఆశలు ఫలిస్తాయా లేదా? ఆర్.ఆర్.ఆర్ తర్వాత శంకర్ ని ఎంపిక చేయడం అనే అతడి ఎత్తుగడ సరైనదేనా కాదా? అన్నదానికి కాలమే సమాధానం చెప్పాలి.

## పింక్ చీర కట్టులో తంగం అందం

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొంది ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'దేవర' సినిమాలో తంగం పాత్రలో కనిపించి మెప్పించిన ముద్దుగుమ్మ జాన్వీ కపూర్. టాలీవుడ్ లో మొదటి సారి కనిపించి మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. జాన్వీ కపూర్ కెరీర్‌లో మొదటి భారీ విజయంగా దేవర సినిమా నిలిచింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా కాలం అయినా ఇప్పటి వరకు ఆమె కు దక్కని విజయం దేవర సినిమాతో దక్కింది. దేవర విడుదలకు ముందే జాన్వీ కపూర్ కి టాలీవుడ్ లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కి జోడీగా బుచ్చిబాబు దర్శకత్వంలో సినిమాను చేసే అవకాశం దక్కింది. ఆ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. టాలీవుడ్‌లో వరుసగా సినిమాలు చేస్తూనే బాలీవుడ్‌లోనూ సినిమా ఛాన్స్ లు దక్కించుకుంటూ బిజీగా ఉంది. ఆకట్టుకునే అందం తన సొంతం అంటూ ప్రతి ఫోటో షూట్ తోనూ కన్నుల విందు చేసే జాన్వీ కపూర్ మరోసారి ఆకట్టుకుంది. దీపావళి స్పెషల్‌గా జాన్వీ కపూర్ ఆకట్టుకునే అందమైన



చీర కట్టు ఫోటోలను షేర్ చేసింది. పింక్ చీర కట్టులో ఈ అమ్మడు మతి పోగొట్టింది. నెట్టెడ్ చీర కట్టడం ద్వారా నడుము అందం చూపిస్తూ, మరింత అందంగా కనిపిస్తోంది అంటూ నెటిజన్స్ జాన్వీ కపూర్ అందంపై కామెంట్స్ చేస్తున్నారు. సినిమాల్లో కంటే ఇలా మరింత అందంగా ఉన్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు. అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలుగా ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చిన జాన్వీ కపూర్ కేవలం నటన పరంగానే కాకుండా అందం పరంగానూ తన తల్లికి ఏమాత్రం తీసి పోకుండా ఫ్యాన్స్ ను ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో ఈమె రెగ్యులర్ గా షేర్ చేసే అందమైన ఫోటో షూట్ కారణంగానే ఇంత బిజీగా సినిమాలు చేస్తుందని అంటున్న వారు లేక పోలేదు, అందుకే సోషల్ మీడియాలో ఈమె అందం మరింతగా కన్నుల విందు చేస్తోంది. ఆకట్టుకునే అందంతో పాటు, నటన పరంగానూ ఒక్క సినిమాతో మంచి మార్కులు దక్కించుకుంటూ ఇండస్ట్రీలో ఆమెకు తిరుగు ఉండదు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. దేవర సినిమాలో తంగం పాత్రలో నటించిన జాన్వీ కపూర్ అందాల ప్రదర్శనకే పరిమితం అయింది. నటించేందుకు ఎక్కువ స్కోప్ దక్కలేదు. అయితే పాటల్లో, సన్నివేశాల్లో జాన్వీ కపూర్ అందంకు నెటిజన్స్ ఫిదా అయ్యారు. ఎన్టీఆర్ కి సరి జోడీ అన్నట్లుగా ఉందని కామెంట్స్ వస్తున్నాయి. ముందు ముందు మరిన్ని తెలుగు సినిమాల్లో జాన్వీ కపూర్ నటించాలని శ్రీదేవి ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. తప్పకుండా మంచి సినిమాగా త్వరలో నటించబోతున్న చరణ్, బుచ్చిబాబు సినిమా జాన్వీ కపూర్ కి పేరు తెచ్చి పెడుతుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది. సోషల్ మీడియాలో జాన్వీ కపూర్ మరోసారి చీర కట్టు ఫోటోలతో వైరల్ అవుతోంది.

## మీనాక్షి చౌదరి.. ఎట్టకేలకు ఒక పెద్ద హిట్..

హీరోయిన్ మీనాక్షి చౌదరి.. ఈ హర్యానా బ్యూటీ యంగ్ హీరో సుశాంత్ ఇచ్చట వాహనములు నిలపరాదు మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. అవుట్ ఆఫ్ లవ్ వెబ్ సిరీస్ తో యాక్టింగ్ కెరీర్ స్టార్ట్ చేసిన బ్యూటీ.. అప్ స్టార్ట్స్ మూవీతో బాలీవుడ్ సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు. ఆ తర్వాత రెండేళ్ల గ్యాప్ లో తెలుగు సినీ ప్రియులకు హీరోయిన్ గా పరిచయమయ్యారు. తన అందం, అభినయంతో మెప్పించారు. ఆ తర్వాత మాస్ మహారాజా రవితేజతో నటించే ఛాన్స్ దక్కించుకున్నారు మీనాక్షీ చౌదరి. ఖిలాడీ సినిమాలో నటించి అందరినీ ఆకట్టుకున్నారు. అదే ఏడాది అడివి శేష్ తో హిట్- ది సెకండ్ కేస్ మూవీలో నటించి మెప్పించారు. తన కెరీర్ లో తొలి హిట్ ను సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత కొలై సినిమాతో కోలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చారు. 2024 ఏడాది సంక్రాంతికి గుంటూరు కారం మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. త్రివిక్రమ్ డైరెక్షన్ లో తెరకెక్కిన గుంటూరు కారంలో సెకండ్ హీరోయిన్ గా నటించారు. పెద్దగా స్కోప్ లేని రోల్ లో కనిపించినా.. తన యాక్టింగ్ తో మెప్పించారు. రీసెంట్ గా విజయ్ దళపతి ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ లో నటించారు. కానీ సాంగ్స్, మూడు సీన్స్ కే పరిమితమయ్యారు.



ఇప్పుడు చేతి నిండా సినిమాలతో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారిపోయారు. వరుస ప్రాజెక్టుల్లో మీనాక్షి నటిస్తున్నారు. దీపావళి కానుకగా లక్కీ భాస్కర్ చిత్రంతో ఇప్పుడు థియేటర్లలో సందడి చేస్తున్నారు. మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ సరసన నటించారు. యంగ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఆ మూవీ ప్రీమియర్స్ షోస్ నిన్ననే పడ్డాయి. సినిమా అదిరిపోయిందని అంతా రివ్యూస్ ఇస్తున్నారు. చాలా బాగుందని చెబుతున్నారు. మీనాక్షి యాక్టింగ్ సూపర్ అని కొనియాడుతున్నారు. అదే సమయంలో ఎట్టకేలకు మీనాక్షి చౌదరి మంచి హిట్ అందుకున్నారని నెటిజన్లు అంటున్నారు. వాస్తవానికి అది నిజమే.. హిట్-2 తర్వాత మీనాక్షి ఇప్పుడే సరైన హిట్ ను దక్కించుకున్నారు. అదే సమయంలో మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తో ప్రస్తుతం మెకానిక్ రాకీ చిత్రంలో నటిస్తున్నారు. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ సరసన పాన్ ఇండియా మూవీ మట్కాలో యాక్ట్ చేస్తున్నారు. వెంకటేష్, అనిల్ రావిపూడి ప్రాజెక్ట్ లో కనిపించనున్నారు. మెగాస్టార్ చిరంజీవి విశ్వంభరలో నటిస్తున్నట్లు వార్తలు వచ్చినా.. అది నిజం కాదని రీసెంట్ గా మీనాక్షి క్లారిటీ ఇచ్చారు. మరి ముద్దుగుమ్మ.. ఫ్యూచర్ లో ఇంకెన్ని హిట్స్ అందుకుంటారో చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536